చింతన్ గత వారంలో రెలిజియస్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital


మిస్ తెలుగు యుఎస్ఎ 2026 అమూల్య 12లో

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-4-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 70 పేజీలు: 16 వెల: 6.50

# 6 జోన్లు, 2 మల్టీజోన్లుగా విభజన

కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు

ప్రైవేటు వర్సిటీల చట్టంలో సవరణలు

రూ.39వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

విశాఖపై ప్రత్యేక దృష్టి, ఐటి, డేటా సెంటర్ల హబ్

అమరావతికి చట్టబద్ధతపై ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు


శుక్రవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి సమావేశ దృశ్యం

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగ నియామకాలకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు1975 స్థానంలో ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్2025ను అమలు చేసేందుకు ఏపీ మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం రాష్ట్రాన్ని 4 జోన్లనుంచి 6 జోన్లుగా, 2 మల్టీ జోన్లుగా పునర్వ్యవస్థీకరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. సచివాలయంలో సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో 60 అంశాల ఎజెండాపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ఉన్నత విద్యలో సంస్కరణలు వంటి ముఖ్యమైన అంశాలపై కేబినెట్ దృష్టి సారించింది. సమావేశంలో ప్రధానంగా, అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర పునర్విభజన చట్టానికి సవరణ చేసి నందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అమరావతి బిల్లుకు పార్లమెంటులో మద్దతిచ్చిన అన్ని పార్టీలకు కూడా కేబినెట్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సూచించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా, 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చర్చించిన >>2

## నాలుగు నెలల్లోగా మునిసిపల్ పోల్స్!

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధమవుతుంది. మరో నాలుగునెలల్లోపు ఈ ఎన్నికలు నిర్వహించాలని ఆలోచన చేస్తుంది. ఈ అంశంపై శుక్రవారం నిర్వహించిన కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులతో పురపాలక ఎన్నికల నిర్వహణపై మాట్లాడిన సీఎం చంద్రబాబు వారిని అలర్ట్ చేశారు. అలాగే మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న దానిపై వారికి ఓ క్లారిటీ కూడా ఇచ్చారు. వీటికి సిద్ధంగా ఉండాలని మంత్రులకు సూచించారు. రాష్ట్రంలో మరో మూడు, నాలుగు నెలల్లో మున్సిపల్ ఎన్నికల్ని నిర్వహిస్తే ఎలా ఉంటుందని మంత్రుల్ని చంద్రబాబు అడిగారు. వారు కూడా దీనికి అంగీకరించడంతో >>2



## 'స్థానికం' సీట్లన్నీ కూటమికే

మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇకపై జరిగే ప్రతి ఎన్నికల్లో మనం విజయం సాధించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. నగర,పురపాలక సంఘాల ఎన్నికలో అన్ని స్థానాల్లో కూటమి విజయం సాధించాలన్నారు. కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో కష్ట పడి పని చేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారంమంత్రులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. స్థానిక >>2



## విజయవాడ- శంషాబాద్ ఫ్లై91 కొత్త విమానం

శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ, ఏప్రిల్10ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని విజయవాడ ఎయిర్ పోర్ట్ నుంచి తెలంగాణ లోని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఫ్లై91అనే కొత్తవిమాన సర్వీసు ప్రారంభమైంది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సర్వీసును ప్రారంభించారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా ఈ ఫ్లై91 (Fly91) సర్వీసును ప్రారంభించారు. ఉడాన్ పథకం ద్వారా ప్రాంతీయ అను సంధానతను పెంచుతూ, దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సంస్థ విస్తరిస్తున్న తీరును ఆయన కొనియాడారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా మరిన్ని విమానాల రాకపోకలు పెరగనున్నాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని విమానా >>2

## దాడులు ఆపితేనే చర్చలు!



స్తంభింపచేసిన ఆస్తులు విడుదల చేయాలి

చర్చలకు ఇరాన్ తాజా షరతులు

అమెరికాతో ఆటలాడుకోవద్దు: జెడి వాన్స్ హెచ్చరిక

**ఇస్లామాబాద్; ఏప్రిల్ 10:**ఇరాన్ యుద్ధంముగింపు కోసం అమెరికా,ఇరాన్‌లమధ్య జరిగే చర్చల్లో ప్రతిష్టంభన కనిపిస్తోంది. లెబనాన్‌పై దాడులపట్ల తీవ్ర నిరసన వ్యక్తంచేసిన ఇరాన్ లెబాన్‌ను కూడా తమ చర్చల అజెండాలోచేర్చాలని పట్టుదలగా ఉంది. ఇదిలా ఉంటే డీల్ జరిగితే ఒకే లేదంటే ఇక గతంకంటే తీవ్రస్తాయిలో సైనిక చర్య లుంటాయని ట్రంప్ మరోసారి ట్రూత్ సోషల్ మీడియాలో హెచ్చరికలు చేయడంమళ్లీ ఉద్రిక్త తలను రాజేసింది. ఇందుకోసం ఇప్పటికే భారీ ఆయుధాలతో ఉన్న నౌకలు మళ్లీ పశ్చిమాసియా జలాల్లోకి వెళుతున్నాయి. న్యూయార్క్‌పోస్టుతో జరిగిన ఇంటర్వ్యూలోట్రంప్ మాట్లాడుతూ మేం మా నౌకలను అత్యున్నత అధునాతన ఆయు ఘసామగ్రితో నింపుతున్నాయి. గతంలో ఎన్న డూలేని ఆయుధాలు ఈ సారి దాడులకు విని యోగిస్తాం. ఈదెబ్బకు మొత్తం మంటల్లో తగుల బడిపోవడం ఖాయం అని అన్నారు. డీల్ అనేది లేకపోతే ఈ ఆయుధాలన్నీ ప్రయోగి స్తామని ఆయనఅన్నారు. ఇదిలాఉంటే అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ఇస్లామాబాద్‌కు బయలు దేరుతున్నట్లు ప్రకటించారు. చర్చల్లో తాత్సారం చేయవద్దని అమెరికాతో ఆటలాడుకోవద్దంటూ ఇరాన్‌కు అల్టిమేటమ్ ఇచ్చారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతాయనే భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్ సోషల్‌మీడియాలో పోస్టుపెడుతూ రెండు పాయింట్లు తెరపైకి తెచ్చారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపచేసిన ఇరాన్ ఆస్తులు విడుదల చేయాలని కోరారు. వీటిని ఇప్పటికీ అమలుచేయలేదని అవిజరిగితేనే చర్చలుం టాయని చెప్పారు. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాల మధ్యతీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్న క్రమంలో ఇపుడు చర్చలు తెరపైకి వచ్చాయి. లెబనాన్‌పై దాడులు ఆపనంతవరకూ చర్చలు ప్రారంభించేదిలేదని ఇరాన్ తెగేసి చెప్పింది.

## నవశకంలోకి సాంకేతికం

క్వాంటం డీప్‌టెక్‌లో అజేయ శక్తిగా అమరావతి

ఆవిష్కరణల కేంద్రంగా క్వాంటం వ్యాలీ: సిఎం చంద్రబాబు



**విజయవాడ ఏప్రిల్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** నవశకం సాంకేతికత క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా అమరావతి ఎదుగుతోంది. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అవసరమైన ఎకోసిస్టం సిద్ధమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవానికి నాంది పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ తో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ ప్రపంచానికి చిరునామాగా మారుస్తున్నారు. ఏప్రిల్ 14, ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ క్వాంటం కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీని సీఎం ప్రారంభించనున్నారు. ఏపీ మంత్రి మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీఎం వెల్లడించిన అంశాలను పరిశీలించినప్పుడు గన్నవరంలోని మేధాటవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్సు ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఈ స్వదేశీ నిర్మిత క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీలు అమరావతిని ఓ అత్యాధునిక క్వాంటం ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దనున్నాయి. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో భారత్ లోనే తొలిసారి క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్ ను పరీక్షించే సౌకర్యాన్ని అమరావతిలో ఏర్పాటు చేశారు. అమరావతి 1క్యూ పేరిట మినీ క్వాంటం కంప్యూటింగ్ టెస్టింగ్ ఫెసిలిటీని గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేశారు. అమరావతి 1క్యూ పేరిట రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధకుల కోసం ఇది ఖిఓపెన్ యాక్సెస్‌ఖి ప్రాతిపదికన మరో క్వాంటం రిఫరెన్సు టెస్ట్ ఫెసిలిటీని తీర్చిదిద్దారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షి ంచేలా ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీగా దీనిని ఏర్పాటు చేశారు. అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దేలా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తోంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్ పాలసీ 202530ని కూడా విడుదల చేసింది. గత ఏడాది జూన్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వాంటం డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. అమరావతిలోని ఉద్దండరాయుని పాలెం వద్ద 50 ఎకరాల్లో ఏక్యూఏసీ కేంద్రం నిర్మితం అవుతోంది. ఆరు టవర్లుగా నిర్మిస్తున్న ఈ భవనాల్లో అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో అత్యంత శక్తివంతమైన 133 క్యూబిట్, 5 కే గేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. ఐబీఎంతో పాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషి >>2

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు 6 నెలల జైలు శిక్ష 2లో

ఇజ్రాయెల్‌పై హెజ్బుల్లా భీకర దాడులు 5లో

## సిఎస్ఆర్‌లో భారత్ టాప్



శ్రీకాకుళం పెట్టుబడులకు అనుకూలం

గత 18 నెలలుగా రూ.50కోట్ల వినియోగం

కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** కార్పొరేట్ సంస్థలు నిధులు వినియోగించాలంటే జిల్లాలో డిపిఆర్‌లు తయారు చేసి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద కార్పొరేట్ సామాజిక బాధ్యత సమ్మిట్ టినీ లూప్‌లో భాగంగా కొత్త రోడ్డు వద్దగల కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎస్ఆర్, కార్పొరేట్, ఎన్జీఓ లు పాల్గొన్నట్లు చెప్పారు. సిఎస్ఆర్ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి విచ్చేసిన టీంలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అడ్మినిస్ట్రేషన్, ఎన్జీఓ, సిఎస్ఆర్ నాలుగు డిపార్ట్మెంట్‌లు కలిసి ఒక శక్తివంతమైన ప్లాట్‌ఫారంను నిర్మించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక పరిపూర్ణమైన లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం జరగడానికి ముఖ్యకారకులు శాసన సభ్యులు కూన రవికుమార్ అన్నారు. ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన జిల్లాలో సమ్మిట్ ఏర్పాటుకు అందరితోనూ చర్చించినట్లు పేర్కొన్నారు. సిఎస్ఆర్ వినియోగంలో ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉంటుందన్నారు. భారత దేశం సాంస్కృతిక మూలాలు చూసుకుంటే మన సంపాదనలో సమాజానికి ఎంత ఇవ్వగం అనే దానిని నిర్ణయించుకోవాలన్నారు. దేశంలో పెద్ద పెద్ద కంపెనీలు పెరగడం వలన కంట్రిబ్యూషన్ కూడా పెరిగిందన్నారు. ఏదైనా ప్రాంతంలో పరిశ్రమ పెట్టాలంటే ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తరువాత పరిశ్రమ ఏర్పాటు చేసి దాని నుండి వచ్చిన కంట్రిబ్యూషన్ ఆ ప్రాంతం అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. సిఎస్ఆర్ పెట్టిన తర్వాత 2014లో ప్రధాని నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత మరింత ఫండ్స్ వచ్చేటట్లు చేసి ఎన్నో సేవలు చేసినట్లు చెప్పారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ చారిటీకే కాదని, అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడుతోందన్నారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ శ్రీకాకుళంలో పెద్ద ఎత్తున చేయవచ్చున్నారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబడిన, పేదరికం జిల్లా అని అనుకుంటూ ఉంటామని అలా అనేకంటే జిల్లాని డిస్ట్రిక్ట్ ఆఫ్ >>2

## సీమ ప్రాజెక్టులపై వైసిపి మొసలి కన్నీరు

రాజకీయ లబ్ధిపొందాలని చూస్తోంది: మంత్రి పయ్యావుల విమర్శ

**సచివాలయం,ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** రాయలసీమ మీద ఇప్పుడు ప్రేమ ఉన్నట్లు వైసీపీ నాయకులు మొసలి కన్నీరు కార్చుతూ మీటింగ్‌లు పెడుతున్నారని రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక,వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవ చేశారు.ఏపి సచివాలంలోని ప్రచార విభాగంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నేడు రాయలసీమ మీద అవ్యాజ్యప్రేమ చూపుతున్న వైసీపీ నాయకులు అధికారంలో ఉన్న 5ఏళ్ళలో రాయలసీమకు ఏం చేశారని ప్రశ్నించారు. కనీసం కాల్వల్లో తట్టమట్టి తీశారా, కనీసం కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యామ్ వైపు తిరిగి చూశారా...రాయలసీమ ప్రాజెక్టును చంపింది మీరు కాదా అని నిలదీశారు. తెలంగాణా సభలో అప్పటి మంత్రి హరీష్ రావు రాయలసీమ ప్రాజెక్టును ఆపింది మేమే అని చెప్పలేదా అని నిలదీశారు. మాజీ సీఎం జగన్ హాయాంలో చీఫ్ సెక్రటరీ, ఈఎన్సీ రాయలసీమ ప్రాజెక్టు పై ఏమని రాశారో తెలుసా...రాయలసీమ ప్రాజెక్టు అసలు ఇరిగేషన్ ప్రాజెక్టు కాదని మేము కేవలం స్టడీ చేస్తున్నామని రాయలేదా....ఆ అఫిడవిట్లు చూపమంటారా...ప్రజలను మళ్ళీ మోసం చేయడానికి మీరు ఎప్పుడూ రాజకీయం కోసం రాయలసీమను వాడుకునే విధంగా మరోసారి రాజకీయం చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ హాయాంలో గాలేరు నగరి, హంద్రీనివా, తెలుగుగంగ ఈ మూడు ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని మంత్రి అన్నారు. నేడు రాయలసీమ సస్యశ్యామలానికి ఈ మూడు ప్రాజెక్టులు >>2

## రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు మంజూరు ఒక్కరోజే రూ.2,950 కోట్లు విడుదల

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సుదీర్ఘకాలం నుంచి ఎదురుచూస్తున్న వారి బకాయిలను విడుదల చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నిన్న ఒక్కరోజే ఏకంగా రూ.2,950 కోట్లను విడుదల చేసింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బిల్లుల కోసం ఈ నిధులను కేటాయించగా, వాటిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపులకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రక్రియకు మార్గం సుగమమైంది. సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆర్థిక శాఖ, నిధుల లభ్యత ఆధారంగా ఈచెల్లింపులను పర్యవేక్షి స్తోంది. ప్రభుత్వం మొత్తంమీద రూ.7,059 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను దశలవారీగా చెల్లించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం ఉద్యోగులే కాకుండా ప్రభుత్వానికి మెటీరియల్ సరఫరా చేసిన చిన్న కాంట్రా >>2

## కిరాతక ప్రేమికుడు

పట్టపగలు అమ్మాయి గొంతు కోసిన వైనం

నిందితుడిని ఎన్ కౌంటర్ చేయాలి, లేదంటే అప్పగించాలంటూ జాతీయ రహదారిపై మృతదేహంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో

**రాజంపేట ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**పట్టపగలు ఇంటికి వెళ్ళాడు. అమ్మాయిపై కర్కశంగా దాడి చేసి గొంతు కోశాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కూతురుని ఆసు పత్రికి తీసుకెళ్లేలోపే కన్ను మూసింది. ఈ విషాదసంఘటన, కసాయి ప్రేమికుడి ఉదంతం కడప జిల్లా మండల కేంద్రమైన కాజీపేటలో జరిగింది. నిందితుడిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని లేదంటే తమకు అప్పగించాలని మృతురాలి >>2


కీర్తన (ఫైల్)


వెంకటేష్

## ఎండ మంటల్లో విలవిల

కడపలో 43.6°, కరపలో 44.1° ఉష్ణోగ్రత

ఇటు వడగాడ్పులు, అటు పిడుగుపాట్లు

**విజయవాడ ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నెలకొన్న విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎండతీవ్రత , పిడుగులతో కూడిన అకాల వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎండ తీవ్రత, వడగాలులు, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఈ సీజన్లో గరిష్ఠ ఉష్ణోగ్రత కాకినాడ జిల్లా కరపలో 44.1 డిగ్రీల సి, కడపలో 43.6 డిగ్రీల సి నమోదైందని అలాగే 22జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. కడపలో 19 మండలాలు, నంద్యాలలో 11, మార్కాపురంలో 7, ఎన్టీఆర్‌లో 4, ఇతర జిల్లాల్లో కలిపి మొత్తంగా 67 మండలాల్లో 41డిగ్రీలు సికు పైగా ఉష్ణోగ్రతలు రికార్డైనట్లు తెలిపారు. శనివారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాల్పులు, కోస్తా, రాయలసీమ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. శనివారం ఆయా జిల్లాలో మండలాల వారిగా గమనిస్తే శ్రీకాకుళం 8, విజయనగరం 20, పార్వతీపురంమన్యం 14, అల్లూరి 1, పోలవరం 6, అనకాపల్లి 5, కాకినాడ 2, తూర్పుగోదావరి 4, ఏలూరు 3, ఎన్టీఆర్ 3 మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. >>2

# మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఆర్నెల్ల జైలు శిక్ష

**విశాఖపట్టణం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కోర్టు షాక్ ఇచ్చింది. దాదాపు 8యేళ్ల క్రితం నాటి ఒక పాత కేసులో ఆయనకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విశాఖ అడిషనల్ చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ వరలక్ష్మి సంచలన తీర్పు ఇచ్చారు. రూ.రూ. 5 వేలు జరిమానా విధించారు. 2016 ఏప్రిల్ 17న విశాఖపట్నంకు ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర గుడివాడ అమర్నాథ్ దీక్ష దీక్షకు దిగారు. అయితే, ఆ సమయంలో ఆయన ప్రాణాలకు హాని కలిగించుకునేలా ఆత్మహత్యాయత్నం చేస్తున్నారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసుపై సుదీర్ఘ కాలంగా విచారణ సాగగా, శుక్రవారం తీర్పు వెల్లడించింది. కాగా, తీర్పుపై పైకోర్టులో అప్పీల్ చేస్తానని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు.

# సీమ ప్రాజెక్టులపై వైసిపి మొసలి కన్నీరు

జిజి కారణం కాదా అని అన్నారు.జగన్ మోహన్‌రెడ్డి ఈ మూడు ప్రాజెక్టులకు ఏం చేశారు...రాయలసీమ అభివృద్ధికి చుక్క నీరందించారా అని ప్రశ్నించారు.రాయలసీమ అభివృద్ధికి ఎంత ఖర్చు పెట్టారో చర్చకు రావాలని సవాల్ విసిరారు.అదే మా పాలనలో ఒక్క సంవత్సరంలోనే హంద్రీనీవా ప్రాజెక్టు కు రూ.3,700కోట్లు ఖర్చు చేశామన్నారు.ఒకే సంవత్సరంలో కేటాయింపులు,అదే సంవత్సరంలో పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరిగిందని ఇది చరిత్రలో ఒక రికార్డు అని అన్నారు.అంతే కాకుండా మరో రూ.2వేల కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు.మీ హాయాంలో 5ఏళ్ళలో మీరు రాయలసీమ పేరు పలకడానికి కూడా సాహసించలేదని కానీ మేము రూ.40వేల కోట్లతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్ పెడతామని రాయలసీమను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.రాయలసీమ పై మీ మొసలి కన్నీరు కార్చితే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరన్నారు. రాయలసీమ ప్రాజెక్టు కంటే తక్కువ ఎత్తులో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం మేము పూర్తి చేశాము కదా...మళ్ళీ రాయలసీమ ప్రాజెక్టు ఎందుకన్నారు.ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ముచ్చుమర్రి పథకం పనిచేస్తుంది...అన్నీ అనుమతులు తెచ్చాము కదా అని మంత్రి వివరించారు.కేవలం వివాదం,ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టించడానికి ఇటువంటి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు.మీ పాలనలో రాలయసీమ ప్రాజెక్టుపై స్టే విధిస్తే మీరు ఏం చేశారన్నారు.

# అమెరికాతో ఆటలాడొద్దు..

## పరిణామాలు తీవ్రంగా ఉంటాయ్! - ఇరాన్‌కు ఉపాధ్యక్షుడుజెడివాన్స్ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 10:** అమెరికాతో ఆటలు ఆడాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించినందున శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లే ముందు వాన్స్ మీడియాతో మాట్లాడుతూ అమెరికా వైఖరిని స్పష్టం చేశారు. తమ అధ్యక్షుడి ఆదేశాల మేరకు దౌత్యపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ సమయంలో ఇరాన్ తమతో ఆటలు ఆడాలని చూస్తే సహించబోమని వాన్స్ స్పష్టం చేశారు.ఆరు వారాలుగా క్షిపణుల మోతతో అట్టుడికిన పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించిన అమెరికా టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చలకు సిద్ధమైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉన్నత స్థాయి బృందంతో కలిసి శుక్రవారం పాకిస్థాన్ బయల్దేరారు. టెహ్రాన్‌తో చర్చల కోసం మేము సిద్ధంగా ఉన్నాం. ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను అని పాకిస్థాన్‌కు వెళ్లడానికి ముందు వాన్స్ పేర్కొన్నారు. టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చల విషయమై అధ్యక్షుడు ట్రంప్ మాకు కీలకమైన సూచనలు చేశారు. ఆయన మాట ప్రకారం ఇరాన్ విశ్వసనీయతతో చర్చలు జరిపితే మేము సానుకూలంగా స్పందిస్తాం.

# ఎండ మంటల్లో విలవిల

>> అలాగే 79 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఆదదివారం మొత్తంగా 93 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం కాకినాడ (జి) కరపలో 44.1 డిగ్రీ సి, కడపలో 43.6 డిగ్రీల సి, పశ్చిమగోదావరి(జి) పోడూరులో 42.9 డిగ్రీలు సి, తిరుపతి (జి) వరదయ్యపాలెంలో 42.6డిగ్రీలు సి, కృష్ణా (జి) పెదపారుపూడి, నంద్యాల (జి) బనగానపల్లిలో 42.3 డిగ్రీలు సి, ఏలూరు (జి) ధర్మాజీగూడెం, నెల్లూరు (జి) కొమ్మిపాడులో 42.1డిగ్రీల సి, విజయనగరం (జి) పెద్దరావీడు, పల్నాడు (జి) అమరావతి, పోలవరం (జి) కూనవరంలో 41.4 డిగ్రీల సి, పార్వతీపురం మన్యం (జి) భామినిలో 41.2 డిగ్రీల సి, ప్రకాశం (జి) కొప్పెరపాడు, శ్రీ సత్యసాయి (జి) తలుపులలో 41.1డిగ్రీలు సి, చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. అదేవిధంగా కళ్ళరక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్తపడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాల నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# సమాచారం లీక్ చేస్తే కఠిన చర్యలు

## మంత్రులు పూర్తిగా గోప్యతను పాటించాలి

## ప్రభుత్వ కార్యదర్శులు పనితీరు మార్చుకోవాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాత వార్తప్రతినిధి:** ప్రభుత్వ అంతరగత అంశాలపై మంత్రులు పూర్తి గోప్యతను పాటించాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఈ విషయంలో అత్యుత్సహం చూపించడమే కాకుండా,సమాచారాన్ని లీక్ చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు ఈ సందర్భంగా మంత్రులు పనితీరు బాగా మారాల్సి ఉందన్నారు.ఎట్టి పరిస్థితుల్లో మంత్రులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మంత్రులు నిర్వహణ బాధ్యత తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమాలను మంత్రులు ఓన్ చేసుకోవాలన్నారు. ప్రతి మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నాలుగు కార్యక్రమాల్లో అయినా పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యే లా పనులు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచు కుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. కేబినెట్ అజెండా లీక్ అవుతున్న విషయంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది.కేబినెట్ అజెండా బయటకు వెళ్తుంది. అందరం బాధ్యతగా ఉండాలి. చాలా ముఖ్యమైన విషయాలు ఉంటాయి... ముందు మన వద్దకు వస్తుంద్ని అని సీఎం అన్నారు. గతంలో బడ్జెట్ లీక్ అయితే 30 మంది మంత్రులు రాజీనామా చేశారని, ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఇక సమావేశం ప్రారంభమైనా అజెండా మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్య దర్శులు గతంలో సబ్జెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.



# 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా విభజన

>> రూ.39 వేల కోట్లకు పైగా విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటై, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు, విశాఖపట్నంలోని క్వాంటం వ్యాలీలో మూడు సంస్థల ఏర్పాటుకు కూడా మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ నెల 14న క్వాంటం కంప్యూటర్స్‌కు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యారంగంలో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీలు ఇష్టారా జ్యంగా ఫీజులు వసూలు చేయకుండా నిరోధించేందుకు ప్రస్తుతం ఉన్నత విద్యా కమిషన్ స్థానంలో ఫీజ్ రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి యూనివర్సిటీల చట్ట సవరణపై కూడా సమావేశంలో చర్చించారు. వీటితో పాటు పలు సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ మంత్రి మండలిలో తీసుకున్న కీలక నిర్ణయాలు గమనిస్తేరాష్ట్ర క్యాబినెట్ విశాఖపట్నంను ఐటీ, డేటా సెంటర్ల హబ్‌గా మార్చేందుకు పలు కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అదానీ ఇన్‌ఫ్రా, రైడెన్ ఇన్ఫోటెక్ (గూగుల్ అనుబంధ సంస్థ) ఏర్పాటు చేయనున్న ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుకు సంబంధించి భూమిని సేల్ అగ్రిమెంట్‌ఖి బదులుగా ఖిసేల్ డీడ్‌ఖి కింద రిజిస్టర్ చేసేందుకు ఆమోదం తెలిపింది. అలాగే, విశాఖలో ఐటీ పార్క్ ఏర్పాటుకు క్రెడెన్స్ రియాలిటీ సంస్థకు అనుమతినిచ్చింది. దీని ద్వారా రూ.386.88 కోట్ల పెట్టుబడి, 6,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు 2 ఎకరాల భూమి కేటాయింపుతో రూ.425 కోట్ల పెట్టుబడి, 2,500 ఉద్యోగాలకు సిటెక్ డేటా లిమిటెడ్‌కు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కోసం 40 సెంట్ల భూమి కేటాయింపుతో రూ.1,800 కోట్ల పెట్టుబడికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**ఎలక్ట్రానిక్స్, లిథియం బ్యాటరీల తయారీకి ఊతం:** ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక పరికరాల తయారీ రంగంలో రాష్ట్రానికి పెద్దపీట వేస్తూ క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. పీజీ టెక్నో ప్లాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీల తయారీ యూనిట్‌ను విస్తరించనుంది. రూ.1,305 కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 2,910 మందికి ఉపాధి లభించనుంది. మరోవైపు, చిత్తూరు జిల్లా కుప్పంలో ఎలక్ట్రిక్ వాహనాలకు అత్యంత కీలకమైన లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించిన ముడి పదార్థాల ప్రాజెక్టును ఎన్‌పీఎస్‌పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 105 ఎకరాల భూమి కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.2,550 కోట్ల పెట్టుబడి, 4,000 ఉద్యోగాలు రానున్నాయి.

**సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు:** ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటున్న సెమీకండక్టర్ల తయారీ రంగంలో ఏపీ కీలక ముందడుగు వేసింది. శ్రీ సత్యసాయి జిల్లాలో ఆర్‌ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను స్థాపించనుంది. ఇందుకోసం 60 ఎకరాల భూమి కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి విలువ రూ.10,239.78 కోట్లు కావడం విశేషం. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన అనేక ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.

**స్టీల్, భారీ పరిశ్రమలకు ప్రోత్సాహం:**
రాష్ట్రంలో ఉక్కు, భారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. విశాఖపట్నంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ తన ఐరన్ ఓర్ పెల్లెట్ ప్లాంట్ సామర్థ్యాన్ని 7 మిలియన్ టన్నుల నుంచి 11 మిలియన్ టన్నులకు విస్తరించనుంది. ఈ రూ.1,400 కోట్ల ప్రాజెక్టు ద్వారా 760 మందికి ఉపాధి లభించనుంది. నెల్లూరు జిల్లాలో శామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ రూ.3,678 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 3,200 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

**దేశంలోనే తొలిసారి.. అమరావతిలో క్వాంటం వ్యాలీ:** భవిష్యత్ సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటులో భాగంగా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ హబ్, హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సౌకర్యానికి ఆమోదం తెలిపింది. క్వాంటం ఏఐ గ్లోబల్, పీక్యూ స్టేషన్ వంటి సంస్థలు కూడా తమ ప్రాజెక్టులను ఇక్కడ ఏర్పాటు చేయనున్నాయి. దేశంలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించినా, ఏ రాష్ట్రం ముందుకు రాని తరుణంలో చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ముందడుగు.

# పిఎన్‌జి కనెక్షన్ తీసుకుంటే రూ.2,400 సబ్సిడీ జీవో విడుదల చేసిన ప్రభుత్వం

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్పీజీ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. పీఎన్‌జీ కనెక్షన్లు తీసుకునే దీపం2 పథకం అర్హత కలిగిన లబ్దిదారులకు సబ్సిడీ విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జీవో ఎంఎస్ నెం.3 విడుదల చేసింది. ఖిఆంధ్రప్రదేశ్ పీఎన్‌జీ సబ్వెన్షన్ స్కీమ్ఖి కింద ఏడాదికి రూ.2,400 సబ్సిడీ ఇవ్వనున్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నేరుగా లబ్దిదారుని ఖాతాలో నగదు జమ చేయనున్నారు. స్వచ్ఛమైన, సురక్షి తమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నారు. ఎల్పీజీ వినియోగం నుంచి పీఎన్‌జీకి మారేలా ప్రోత్సహించేలా సబ్సిడీ విస్తరణ కార్యక్రమం చేపట్టారు. రెండు నెలలకు ఒకసారి మొత్తం 6 విడతల్లో నగదు చెల్లింపు చేయనున్నారు. దీపం 2 అర్హత గల డొమెస్టిక్ పీఎన్‌జీ కనెక్షన్ కలిగిన లబ్ధిదారులు మాత్రమే అర్హులుగా నిర్ణయించారు. ఎల్పీజీ, పీఎన్‌జీ రెండింటిలో ఏదో ఒక దానికే సబ్సిడీ వర్తించనుంది.

# నవశకంలోకి సాంకేతికం

,>> స్తున్నాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, కేంద్ర ప్రభుత్వంలోని సీఐఎస్ఆర్ నేతృత్వంలోని నేషనల్ టెస్టింగ్ ల్యాబ్ లాంటి సంస్థలు కూడా దీనికి సహకారాన్ని అందిస్తున్నాయి. నూతన ఔషధాల ఆవిష్కరణ, సంక్లిష్ట వ్యాధులకు వ్యాక్సీన్ల ఉత్పత్తిలో వేగం, వెదర్ మోడలింగ్, సెమీ కండక్టర్లు పాలన, లాజిస్టిక్స్ రంగాల్లో డేటా అనలటిక్స్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలకమైన పరిశోధనలు చేసేలా దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో త్వరలోనే ఆవిష్కృతం కానుంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం నుంచి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం ఇప్పటికే 80కి పైగా అంతర్జాతీయ స్థాయి కంపెనీలు, విద్యా సంస్థలు ఒప్పందం చేసుకు న్నాయి. క్వాంటం కంప్యూటింగ్ అల్గారిథమ్స్ లో నిపుణులైన మానవ వనరులను సిద్ధం చేసేందుకు ఐఐటీ చెన్నై, వైసర్ లాంటి సంస్థలతో ప్రభుత్వం భాగస్వామ్యం కూడా కుదుర్చుకుంది. క్వాంటంలో నైపుణ్యాల కోసం ఇప్పటికే 60 వేల మంది శిక్షణ పొందుతున్నారు. వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మం దిని క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

# సిఎస్ఆర్‌లో భారత్ టాప్

>> ఆపర్చ్యునిటీ జిల్లా అంటే బాగుంటుందన్నారు. ఎదుగుతున్న జిల్లా అని జిల్లాపై పిల్లల్లో ఒక కాన్ఫిడెన్స్ కలుగుతోందన్నారు. సిఎస్ఆర్ ఏక్టివిటీలో పెద్ద పెద్ద కంపెనీలకు ఫండ్స్ అయితే ఉన్నాయి కానీ ఏ విధంగా చేస్తే బాగుంటుంది అనే అవగాహన లేనందు వలన వారు ఏమి చేయలేకపోతున్నారన్నారు. కింద స్థాయి నుండి ఎవరైతే ఉన్నారో వారితో ప్రోగ్రాం ఫిక్స్ చేయించి అభివృద్ధి చేయొచ్చన్నారు. కార్పొరేట్ నుండి నిధులు వచ్చిన రాకపోయిన ఎన్జీఓలు సర్వీసు చేసి వారి యొక్క జీవితాలను అంకితం చేశారన్నారు. ఈ సందర్భంగా ఎన్జీఓలను ఆయన అభినందిస్తున్నట్లు చెప్పారు. 49 సంవత్సరాల నుండి జిల్లాలో ఎన్జీఓ నడుపుతున్నట్లు తెలిపారు. ఎన్జీఓ లకు ఒక ప్లాట్ ఫారం ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఇందులో అందరి సంకల్పం ఉండాలి అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఈ సమావేశానికి 30 కార్పొరేట్, 50 ఎన్జీఓ టీంలు వచ్చాయి. జిల్లాలో అభివృద్ధి చేయుటకు అపారమైన అవకాశాలు ఉన్నాయని నీరు అందుబాటులో ఉంది 30 మండలాలు ఉన్నాయని ఒక వైపు మత్స్యకారులు, మరో వైపు గిరిజనులు ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సిఎస్ ఆర్ కింద 41.44 కోట్ల రూపాయలు ఇప్పటికే ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 45 కోట్లకు సిఎస్ఆర్ ఫండ్స్‌కు డిపిఆర్‌లు తయారు చేసి సిద్దంగా ఉన్నట్లు వివరించారు. కంపెనీల చట్టం 2013 ప్రకారం కార్పొరేట్ సామాజిక బాధ్యత (దిళీళి) తప్పనిసరి అయిందన్నారు. దీని ప్రకారం కొన్ని కంపెనీలు తమ నికర లాభంలో కనీసం 2 సిఎస్ఆర్ కార్యక్రమాలపై ఖర్చు చేయాలన్నారు. సిఎస్ఆర్ కార్యకలాపాల, పర్యవేక్షణ కోసం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిఎస్ఆర్ కమిటీ కంపెనీల చట్టం, 2013లోని షెడ్యూల్‌లో పేర్కొన్న కార్యకలాపాల జాబితా ద్వారా మార్గనిర్దేశం చేయబడుతుందని, ఈ జాభితా కార్యకలాపాలపై పెట్టు బడులు పెట్టితేనే సిఎస్ఆర్ క్రింద అర్హత వస్తుందన్నారు. కోటి కంటే ఎక్కువ కార్యక్రమాలు సిఎస్ఆర్ కింద ఉన్నాయని, ఏమైనా సందేహాలు ఉంటే సిఎస్ఆర్ టీం ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. సిఎస్ఆర్ టీం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో సిఎస్ఆర్ సెల్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పి.4 ను ప్రారంభించినట్లు చెప్పారు. సంపాదించిన సంపాదనలో కొంత శాతం వెచ్చించి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో అభివృద్ధి చేయుటకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో బాగా కష్టపడే తత్వం గల యువత ఉందని, వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతమని, శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు పియుసి చైర్మన్, శాసన సభ్యులు కూన రవి కుమార్ పిలుపునిచ్చారు.

# పై91 కొత్త విమానం

>>శ్రయాల అభివృద్ధిపై కేంద్రః మంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటనలు చేశారు. విజయవాడ, రాజమండ్రి, కడప విమానాశ్రయాల పనులు వేగంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా విశాఖపట్నంలోని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పనులు జూన్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. జూలై నెలలో ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారం భించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. త్వరలోనే విజయవాడ నుంచి వారణాసి, కొచ్చి వంటి నగరాలతో పాటు దుబాయ్‌కు కూడా కొత్త విమాన సర్వీసులు ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపార వేత్తలకు వరంలా మారనుంది. పై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. పై 91 అనేది గోవా కేం ద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమాన యాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపు తోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచు కోవడం ద్వారా ప్రయాణి కులకు మరిన్నిసౌక ర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైద రాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసు లుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయా ణంపై ఒత్తిడి తగ్గనుంది.

# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు మంజూరు

>> క్టర్లకు కూడా ప్రాధాన్యమిస్తూ రూ.614 కోట్ల బిల్లులను ఇప్పటికే చెల్లించింది. తాజా చెల్లింపులకు ముందు కూడా ప్రభుత్వం పలు బకాయిలను క్లియర్ చేసింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) బకాయిల కింద రూ.1,848 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. అలాగే, గ్రూప్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కింద 4,793 మందికి రూ.76 కోట్లు, పోలీసు శాఖకు సంబంధించిన అదనపు సరెండర్ లీవుల కోసం రూ.223 కోట్లు విడుదలయ్యాయి. మొత్తం మీద ప్రభుత్వం ఇంకా గ్రాట్యుటీ బకాయిలు రూ.3,411 కోట్లు, విశ్రాంత ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు చెల్లించాల్సి ఉంది.

# 'స్థానికం' సీట్లన్నీ కూటమికే

>> ఎన్నికలు రాబోతున్నాయని.. అందరు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. కార్యకర్తలను, నేతలను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. మంత్రులు అందరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూర్తిగా అందుబాటులో ఉండాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నా టీడీపీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు అందుబాటులో ఉండి తీరాల్సిందేనని హుకుం జారీ చేశారు. పార్టీ ముఖ్యమనే విషయాన్ని అందరు గుర్తు పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎందుకంటే పార్టీ కార్యకర్తలు ఇచ్చే విజ్ఞప్తులను మనం పూర్తిస్థాయిలో పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.నగర, పురపాలక సంఘాల ఎన్నికలు మరో నాలుగు నెలల్లో జరిగే విధంగా చర్యలు చేపడదామన్నారు.మొత్తం స్థానాలపై మనం విజయం సాధించాలన్నారు.

# బెంగళూరు పర్యటనలో మంత్రి నారా లోకేష్

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌బెంగళూరు పర్యటనకు శుక్రవారం బయలుదేరి వెళ్ళారు. బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది...బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతబూని మంత్రి లోకేష్ కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు...బెంగళూరు సర్జాపూర్ లోని గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొననున్న మంత్రి లోకేష్.

# నాలుగు నెలల్లోగా మునిసిపల్ పోల్స్!

>> ఆ మేరకు ఎన్నికల ఏర్పాట్లు చేసుకోవాలని వారికి సూచించారు. అలాగే ఎన్నికల్ని 2011 జనాభా లెక్కల ఆధారంగా నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ప్రస్తుతం జనాభా లెక్కల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో ఇది పూర్తయ్యే వరకూ టైం పడుతుంది. అందుకే పాత లెక్కలతోనే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో ఇప్పటికే అన్ని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీల గడువు ముగియడంతో ప్రత్యే కాధికారుల పాలన అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఆయా చోట్ల పాలన గాడితప్పకుండా ఉండాలంటే వెంటనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని పట్టుదలగా ఉన్న ప్రభుత్వం.. ఈ మేరకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేస్తోంది. ఇదే క్రమంలో ఇవాళ జరిగిన కేబినెట్ భేటీలోనూ మున్సిపల్ ఎన్నికల ప్రస్తావన వచ్చింది. దీంతో సీఎం చంద్రబాబు మున్సిపల్ ఎన్నికలపై మంత్రులకు క్లారిటీ ఇచ్చారు.

# కిరాతక ప్రేమికుడు

>> కుటుంబ సభ్యులు,తత బంధువులు జాతీయ రహదారిపై నాలుగు గంటల పాటు రాస్తారోకో చేశారు. పోలీసుల హామీతో ఆందోళన విరమించారు. కాజీపేట అగ్రహారం లో ఇటీవలే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన కీర్తన శుక్రవారం ఇంట్లో ఒకటే ఉంది. ఈ విషయం తెలుసుకున్న కాజీపేటకి ఆంజనేయులు కొట్టాలు ప్రాంతానికి చెందిన ఆవుల వెంకటేష్ అనే పాశవికంగాగొంతు కోశాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడం ఇంట్లోనే కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కీర్తనను చూసి కడప రిమ్స్ ఆసుపత్రికి బయలుదేరారు.

మార్గమధ్యంలోనే కీర్తన కన్ను మూసింది. గొంతు కోయడంతో ఆమె ధరించిన డ్రెస్ మొత్తం రక్తంతో తడిచిపోయింది. హత్య చేసిన ఆంజనేయ కొట్టాలు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్(19) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం సుమారు 5:00 వరకు జాతీయ రహదారిపై కీర్తన కుటుంబ సభ్యులు బంధువులు బైఠాయించి నిందితున్ని ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు స్థానిక పోలీసులు ఎంత వారించినా వినలేదు.న్యాయం జరిగేంతవరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు.దీంతో కడప నుంచి డిఎస్పి బయలుదేరి వచ్చి నిందితుని కఠినంగా శిక్షి స్తామని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని హామీ ఇవ్వడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

11-04-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
నవమి రా.12.34
ఉత్తరాషాఢ మ.1.36
వర్జ్యం : సా.5.51-రా.7.34
దు.తె.5.55-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఖర్చులు అధికంగా ఉండటంవలన చిన్నపాటి ఋణాలను చేయవలసి వస్తుంది. నూతన విద్యావకాశాలు కలవు.

**వృషభం:** మీ మాట మంచితనం నడవడిక వల్ల చాలా మందికి మీరే ముఖ్యమైన అంతరంగికులవుతారు. ధనలాభం కలదు.

**మిథునం:** మీ మీద ఇతరులు చెప్పే చాడీలు పెద్దగా ప్రభావం చూపవు. వ్యవహారాలు సకాలంలో పూర్తి చేసారు. వస్త్రలాభం.

**కర్కాటకం:** ఇ-మెయిల్స్‌ను సకాలంలో సరిచూసుకోవడం మరవకండి. వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటు చేసుకుంటాయి.

**సింహం:** కీలక వ్యవహారాలలో అవరోధాలు ఏర్పడినా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.ఆరోగ్య జాగ్రత్త.

**కన్య :** ముఖ్య నిర్ణయాలు ఆలోచించి ముందుకు సాగడం మంచిది. కోప తాపాలకు దూరంగా ఉండండి.

**తుల:** ఉద్యోగులకు విధి నిర్వహణలో బాధ్యతలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఏర్పడుతాయి.

**వృశ్చికం:** రాజకీయం, పారిశ్రామిక రంగాలలోని వారికి అనుకూలంగా వుంటుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

**మకరం:** కుటుంబ పరమైన చికాకులు వృత్తి ఉద్యోగాల మీద ప్రభావం చూపించ కుండా జాగ్రత్తలు తీసుకోగలుగుతారు.

**కుంభం:** పరిస్థితులకు లోబడి ఇతరులకు ఇచ్చిన మాటకు కొంతకాలానికి వాయిదా వేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**మీనం:** పనిభారం తట్టుకోలేక పని విభజన చేసే చర్యలలో భాగంగా మధ్యవర్తులకు వ్యవహారాలను అప్పగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

గడిచేదానికి, గడవబోయే దానికి చింతించకుండా వర్తమానాన్ని ఆలోచించేవాడు అభివృద్ధిని సాధిస్తాడు.

న- ఇ. గిబ్బన్

# అ'విశ్రాంత' పోరాటమేనా!

ఎంతో ఉత్సాహంగా జీవితగమనంలో అడుగు పెట్టిన వారు ఉద్యోగ కాలం పూర్తయి రిటైర య్యాక తమకొచ్చే ప్రయోజనాల కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడడం ఈనాటిది కాదు. వారి ప్రయోజనాలను వారు అనుభవించడంలో ఎన్నో చిక్కులు ఎదురౌతుంటాయి. తమ ముందుకొచ్చే ఎందరో ఫైళ్లను క్లియర్ చేసి, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఉద్యోగులే కాలక్రమంలో తమ రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం తపించాల్సి వస్తోంది. తాజాగా తెలంగాణలోని విశ్రాంత ప్రభుత్వోద్యోగులు తమకు రావాల్సి నబకాయిల ప్రయోజనాల కోసం హైకోర్టు మెట్లెక్కారు. ఏ ఒక్కరో కాదు మూకుమ్మడిగా 754 పిటిషన్లు హైకోర్టును చేరాయి. ఒక్కొక్క పిటిషన్‌లోనూ కనీసం పది మందైనా విశ్రాంత ఉద్యోగుల ఆవేదన ఉండే అవకాశముంది. వీరిలో వివిధశాఖల నుంచి రిటైరైన పోలీసులు, టీచర్లు,ఇంజినీర్లు, ఇతర విభాగాలస్థాయిల విశ్రాంత ఉద్యోగులున్నారు. రిటైర్డు ఉద్యోగుల గౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారికివ్వాల్సి న ప్రయోజనాలన్నీ ప్రభుత్వం వద్ద వారు దాచుకున్న వారి సొమ్మేనని తెలంగాణ హైకోర్టు తీవ్ర స్వరంతో ప్రభుత్వానికి తగు ఆదేశాలిచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ఆర్జిత ప్రయోజనాలను వారి కంద్వివడంలో ఎలాంటి జాప్యం కూడదంటూ హైకోర్టు ఎన్నో విషయాలు వివరిస్తూ ప్రభుత్వానికి హితవు చెప్పింది. బకాయిల కోసం ఎదురు చూస్తూ ఎంతో మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారు. ఇంకా జాప్యం జరగడం మంచిది కాదంటూ కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వాల తక్షణ స్పందన అవసరమైన విషయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవాల్సి రావడం పాలనా వైఫల్యం అనిపించుకుంటుంది. ప్రభుత్వమే మళ్లీ మళ్లీ విచారణతో ఆలస్యం చేయడం కోసం గడువుకోరడం సమంజసం కాదని పేర్కొంది. సర్వీసులో ఉన్నవారికి ప్రయోజనాలందించే విషయంలో ప్రభుత్వం వెసులుబాటు అడిగినా అర్థంఉందని ప్రభుత్వ కొలువుల నుంచి విశ్రాంత ఉద్యోగులుగా బయటనున్న వారిని ఇబ్బంది పెట్టడం సహేతుకం కాదని హైకోర్టు చెప్పింది.'ఇంకెంత కాలం జాప్యం చేస్తారని మరో గడువు ఇచ్చేందుకు హైకోర్టు ససేమిరా అంది. దాదాపు 4వేల మంది విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనాలు చెల్లించామన్నా కోర్టు సంతృప్తి చెందలేదు. చిట్టచివరి విశ్రాంత ఉద్యోగి జూన్ 10వ తేదీ నాటికి తమకు ప్రయోజనాలు అందలేదన్న మాట వినిపించనీయకూ డదని హైకోర్టు ఎంతో దృఢనిశ్చయంతో ఆదేశాలిచ్చింది. బకాయిలు విడుదలైనందునే చాలా మంది న్యాయవాదులు తమ కక్షిదారుల తరపున హాజరు కాలేదంటున్న ఏ వాదననూ కోర్టు అంగీకరించే పరిస్థితి లేదు. ఇలాంటి వ్యర్థపు వాదనలతో జరిగే కాలక్షేపాన్ని కోర్టు అంగీకరించలేదు.

విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి నిర్దిష్ట సమాచారాన్ని వ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం కోరింది. ఏప్రిల్ 9నాటికి మొత్తం బకాయిలు చెల్లించాలని లేకపోతే ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ప్రత్యక్షంగా హాజరు కావలసి ఉంటుందని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రేపు ఏం జరుగుతుందో చెప్పే పరిస్థితి ఈ రోజే చెప్పగలిగే పరిస్థితి ప్రభుత్వ ట్రెజరీ విషయంలో ఉండకపోవచ్చు. కనుక విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాల విషయంలో కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వం సత్వర న్యాయం తీసుకునే దిశగా కదలాల్సి ఉంది. ఇదే స్థాయిలో రిటైర్మెంట్ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు బిల్లులను మంజూరు చేయగలిగిన పరిస్థితికి ఎదగాలి. ఒక్క విశ్రాంత ఉద్యోగికి ప్రయోజనాలు ఆపినా ఉన్నతాధికారి కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావల్సిందే. ఈ ఆదేశాలతో అధికారులు వేగంగా తమ బాధ్యతలను నెరవేరుస్తారని ఆశిద్దాం. వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్, జీపీఎఫ్,ఆర్జిత సెలవులు,గ్రాట్యూటీ, గ్రూపు ఇన్సూరెన్స్ ప్రయోజనాలు మొత్తం కూడగడితే కోట్లాది రూపాయల మేర ఉంటుంది. టోకెన్ల జారీలో జరిగిన వ్యత్యాసాల వలన మరో కొన్ని సందర్భాలలో కొంత మందికి ప్రయోజనాలు అందించలేకపోయినట్లు ప్రభుత్వమే ఒప్పుకొంది. కాగా కోర్టు వాయిదాలను అలుసుగా తీసుకోవద్దని ఏ విశ్రాంత అధికారీ ప్రభుత్వదయా దాక్షిణ్యాల కోసం ఎదురు చూడరాదని కోర్టు హెచ్చరించింది.ఇలాంటి వివాదాలు ప్రతిసారి కోర్టులకు చేరకుండా ప్రభుత్వ నిర్దిష్ట విధానాలను రూపొందించుకోవాలి. అంటే ఏఉద్యోగి అయినా రిటైర్మెంట్ అయిన రోజునే తన ఆర్థిక ప్రయోజనాలతోనే ఇంటికి చేరుకోవాలి. అలా చేసిన రోజున ప్రభుత్వంపై విశ్రాంత ఉద్యోగుల్నించి ఎలాంటి సమస్యలూ ఎదురుకావు. ఇలా చేస్తేవిశ్రాంత ఉద్యోగులు తమ విశ్రాంత జీవనాన్ని ఎంతో హాయిగా హుందాగా ప్రారంభించగలుగుతారు. పదవీ విరమణ ప్రతిఉద్యోగి జీవితంలో అతి కీలకదశ. ఆ దశలో వారిని సజీవంగా ఉన్న నిర్జీవులుగా మార్చడం ఏ వ్యవస్థకైనా మంచిది కాదు. నియంత్రణ లేకుండా వ్యవస్థలు నడుస్తున్నప్పుడు మాత్రమే ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయి. విధాన రూపకల్పన, సత్వర అమలు ఉన్న చోట్ల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం కోర్టుల గడప ఎక్కడం విచారకరం. విశ్రాంత ఉద్యోగుల ఎదుర్కొనే ఆర్థిక, అనిశ్చితి, ఒత్తిడి, వార్ధక్యపు అంచుకు చేరుకున్న వారి మానసిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవడం మేలు. విశ్రాంత ఉద్యోగుల్లో వైరాగ్యం తలెత్తకుండా హైకోర్టు తన అసహనాన్ని వ్యక్తం చేస్తూనే వారి సమస్య తీర్చే మార్గాన్ని అన్వేషించడం ఆహ్వానించదగిన సందర్భం.



అవసరం, అవకాశం అనేవి పిరికిపందను కూడా సాహసిగా మారుస్తాయి.

ఆస్కార్‌వైల్డ్



తమ కాళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారు.

జేమ్స్ టైల్

# ప్రజావాక్కు

### భారత్‌లో గోప్యత ఎక్కడ?

డిజిటల్ యుగంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా మారిపోతున్నది. నగదు లావాదేవీల స్థానంలో డిజిటల్ చెల్లింపులు ప్రాముఖ్యత పొందుతున్నాయి.యూపీఐ,మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు సాధారణ ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వ నజర్ పెరగడంసహజమే.అయితే ఇదిప్రజల ప్రయోజనాలకు ఎంత వరకు అనుకూలం? లేదా వ్యక్తిగత గోప్యతకు ముప్పు కలిగించే అంశమా?అనే ప్రశ్నలుప్రస్తుతానికి చర్చనీయాంశంగా మారాయి. మొదటగా, ప్రభుత్వ నజర్ వెనుక ఉన్నఉద్దేశాన్ని పరిశీలిస్తే,ఆర్థిక పారదర్శకతను పెంచడం ప్రధాన లక్ష్యంగాకనిపిస్తుంది.డిజిటల్ లావాదేవీలు ట్రాక్ చేయగలిగినవిగా ఉండటం వల్ల నల్లధనం నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది.

**- టి. శ్రీనివాస్, చొప్పదండి**

### బానిసలు

బానిసలు దశాబ్దాల క్రితం అంటే 60-70 ఏళ్ల క్రితం భార్యల భర్తమాటకు ఎదురు చెప్పేవారు కాదు. తిట్టినా, కొట్టినా భరించేవారు. భర్త కాళ్ల దగ్గర పడి ఉండేవారు అప్పట్లో.ఆడవారికి చదువు ఉండేది కాదు. బయటకి వెళ్లి పనిచేసే పరిస్థితులు ఉండేవికావు.గతిలేక అలా ఉండేవారు.అలానేభూస్వాములు.ధనవంతులుమోతుబరి రైతుల వద్ద ఉండే నౌకర్లు. పాలేర్లు అతి తక్కువ జీతానికి పనిచేసేవారు. ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులు పదవుల కోసం,అధికారం కోసంఅత్యున్నతహోదాలో పనిచేస్తున్నవారి పక్కన చేరి వారి ద్వారా అధికారాన్ని పదవులను పొందుతున్నారు. వారు చెప్పినట్టు నడుచుకోవడం తప్ప వారికి మరో దారి లేదు.

**- రాశి, హైదరాబాద్**

### ఉచిత వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలి

ఏపిలో మహిళలకు ఉచిత ఆర్టీసీ సౌకర్యం కలిగించారు సంతోషం. ఐతే బస్సులో నుండి దిగి మూత్రానికి వెళ్లాలంటేఏపీఆర్టీసీ బస్టాండులలోఐదురూపాయలు రుసుము చెల్లించాలి. పురుషులు,మహిళలు ఐదురూపాయలు కట్టాల్సిందే.టాయిలెటుకు వెళ్లితే ఐదు రూపాయలా అంటూ ప్రయాణికులు ఆశ్చర్యపోతున్నారు. సినిమహాల్స్ లో, హోటల్స్ లో ఉచితం.మరి టికెట్‌కొనిప్రయాణించే బస్టాండ్లలో రుసుము ఏమిటి? తెలంగాణలో తాటి కాయంత అక్షరాలతో ఉచిత టాయిలెట్లు అని రాసి ఉంటుంది.

**- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా**

### వృద్ధనేతలు ఇంకా ఎందుకు?

ఎన్నికల షెడ్యూల్ వెలువడటమే తరువాయి పోటీ చేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని మొండిపట్టు పట్టేవారు సైతం పైరవీలు చేసేవారు పార్టీ పెద్దలను కాకా పడుతూ వారి చుట్టు తిరిగేవారు ఇలాంటి రాజకీయ నాయకులు ఈ రోజుల్లో చాలామంది ఉంటున్నారు.వీరు వయసులో చిన్నవారు కారు, చట్టసభలకు ఎన్నిక అవని వారూ కాదు. సీనియర్లు ఎంతో కాలంగా పార్టీకి సేవ చేస్తున్నవారు కదా అని అధిష్టానం వీరికి ఎన్నో సార్లు అవకాశం ఇచ్చి చట్టసభలకు పంపించింది. అయినా వీరికి తృప్తి ఉండటం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా పెద్దలను ఒప్పించి పోటీ చేయాలని ప్రయత్నిస్తున్నారు. ముదిమి వయసులో చట్టసభలకు వెళ్లి వారు ఏం చేస్తారు. ఒక్కసారి కూడా అవకాశం రాని వారికి టికెట్ ఇవ్వటం సమంజసంగా ఉంటుంది.

**- శాస్త్రి, హైదరాబాద్**

### రెండు విభాగాలను ఏర్పాటు చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లో రెండువిభాగాలు ఏర్పాటు చేయాలి. శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లో స్కూల్అసిస్టెంట్ ఉపాధ్యాయులకుఉన్నత విద్యా వ్యవస్థ అధ్యాపకులకు ఓటుహక్కు కల్పిస్తున్నారు.కానీ విద్యా వ్యవస్థలో కీలకమైన ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులైన ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించలేదు. మొత్తం టీచర్ వ్యవస్థలో 70శాతం ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులే ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ద్వారా ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు అంతగా ప్రాధాన్యత ఇవ్వడంలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లో రెండు విభాగాలు ఏర్పాటు చేసి ఎస్జిటి ఎమ్మెల్సీ స్కూల్ అసిస్టెంట్ ఎమ్మెల్సీ ఉంటే విద్యావ్యవస్థలో లోపాలు, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

**- రావుల రామ్మోహన్ రెడ్డి, జనగాం**

### దివ్యాంగులకు రేషన్ కార్డులు!

తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న రేషన్‌కార్డులు వికలాంగులఉద్యోగులకు తప్పకుండా ఉండాలి. వీరి రేషన్ కార్డులు రద్దు చేయవద్దు. వీరు ఉద్యోగ వయోపరిమితి దాటే వయసులో ఉద్యోగాలలో చేరడం జరిగింది. తక్కువ సర్వీస్ కలిగిఉన్నారు.వికలాంగులకు సహాయకులుగా వారి కుటుంబ సభ్యులు వీరితోఉండడం వలన ఇతర ఆదాయ మార్గాలు లేవు. కొందరు ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సొసైటీ పరిధిలో పనిచేయడం జరుగుతుంది.

**- రాపాక రవీందర్, జనగాం**

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పైశాచికత్వానికి సిసలైన శిక్ష

**స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా పోలీసు సంస్కరణ కోసం 1977లో కేంద్రం జాతీయ పోలీసు కమిషన్‌ను నియమించింది. పోలీసు సంస్కరణలకు సంబంధించి ఆ కమిషన్ పలు సిఫారసులను చేసింది. వాటిలో చాలా అంశాలు నేటికీ అమలుకు నోచుకోలేదనే చెప్పొచ్చు. తెల్లదొరలను పారద్రోలి స్వాతంత్ర్యం తెచ్చుకున్నది డబ్బు, అధికారం కోసం కాదు, స్వేచ్ఛను, మానవత్వాన్ని పునరుద్ధరించడమే లక్ష్యమని జాతికి బాబాసాహెబ్ స్పష్టంగా దిశానిర్దేశనం చేశారు. పోలీసులు సామాజిక కార్యకర్తలు కావాలన్న జాతిపిత బాపూజీ ఆశయాలకు కొందరు పోలీసులు తూట్లుపొడుస్తున్నారు.**

దామెర్ల సాయిబాబ

ప్రజావసరాలు ప్రధానంగా భద్రత పట్టించుకోని ఏ వ్యవస్థ అయినా పతనానికే దగ్గరవుతుంది. ప్రజా రక్షణే ధ్యేయంగా నెలకొల్పిన పోలీసు వ్యవస్థలో కొందరు భక్షకులుగా మారుతుండటం ఆవేదనే కాదు ఆందోళన కలిగిస్తున్నది. ఏనాడో అప్పటి కాల మాన అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన వ్యవస్థ, చట్టాలు నేడు మారిన పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకోకపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాస్తవంగా 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత భారత ఉపఖండంపై తమ ఆధిపత్యం క్షీణించకుండా, పాలనకు ఎదురు లేకుండా ఏర్పర్చుకున్న చట్టాల్లో 1861 ఇండియన్ పోలీసు యాక్ట్ ఒకటి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా కొన్నిసార్లు మరికొన్ని రాష్ట్రాలు చట్టంలో కొన్ని మార్పులు చేసినా చాలావరకు వలస పాలన అవశేషాలు అలాగే కొనసాగుతున్నాయి. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా పోలీసు సంస్కరణ కోసం 1977లో కేంద్రం జాతీయ పోలీసు కమిషన్‌ను నియమించింది. పోలీసు సంస్కరణలకు సంబంధించి ఆ కమిషన్ పలు సిఫారసులను చేసింది. వాటిలో చాలా అంశాలు నేటికీ అమలుకు నోచుకోలేదనే చెప్పొచ్చు. తెల్లదొరలను పారద్రోలి స్వాతంత్ర్యం తెచ్చుకున్నది డబ్బు, అధికారం కోసం కాదు, స్వేచ్ఛను, మానవత్వాన్ని పునరుద్ధరించడమే లక్ష్యమని జాతికి బాబాసాహెబ్ స్పష్టంగా దిశానిర్దేశనం చేశారు. పోలీసులు సామాజిక కార్యకర్తలు కావాలన్న జాతిపిత బాపూజీ ఆశయాలకు కొందరు పోలీసులు తూట్లుపొడుస్తున్నారు. ప్రజాసమస్యను పరిష్కరించడంలో శాంతిభద్రతలను కాపాడడంలో ఓర్పు, ఓర్మి, సానుభూతితో ప్రవర్తిస్తూ కేసులను సాంకేతిక ఆధారాలు సేకరించి శాస్త్రీయంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. నియమ, నిబంధనలను పక్కనపెట్టి బండ బూతులు తిడుతూ ఇష్టానుసారంగా కొట్టి చిత్రహింసలకు గురి చేసి రాక్షసానందం పొందే కేవలం కొందరి ఖాకీల వల్ల మొత్తం పోలీసు యంత్రాంగం అప్రతిష్టపాలవుతున్నది. తాజాగా తమిళనాడులో మధురై కోర్టు వెల్లడించిన తీర్పు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. ఏకంగా ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తోసహా తొమ్మిది మంది పోలీసులకు మరణశిక్ష విధించింది. అయితే ఈ లాకప్‌డెత్ ఉదంతాన్ని న్యాయస్థానం ముందు రుజువుకు కీలకమైన సాక్ష్యం చెప్పిన మహిళ కూడా ఒక పోలీసు ఉద్యోగే. సహజంగా పోలీసు శాఖలో పై అధికారుల చర్యలు, ఆదేశాలను తప్పుబట్టి ఎదురుతిరిగే ధైర్యసాహసాలు ఉండవు. కానీ ఈ మహిళా హెడ్ కానిస్టేబుల్ అవన్నీ పక్కనపెట్టి పై అధికారులు, తోటి సహచరులు చేసిన దాష్టీకాన్ని తనకు ఏమైనా పర్వాలేదు అనే ధీమాతో పూసగుచ్చినట్లు న్యాయస్థానానికి చెప్పడంతో దేశవ్యాప్తంగా ఆమె పట్ల ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న సమయంలో 2020 జూన్ 19వ తేదీన జయరాజ్ తన సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసుకుంటున్న సమయంలో సాంతాన్‌కుళం పోలీసు స్టేషన్‌కు చెందిన పోలీసులు వచ్చి కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్ణీత సమయం కంటే మించి షాప్ తెరిచి ఉంచారని ఆయనను పట్టుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన కుమారుడు ఫెన్నిక్స్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి తండ్రి ని విడిచిపెట్టమని కాళ్లావేళ్లా బతిమిలాడాడు. తనయుడి ఎదుటనే తండ్రిని విపరీతంగా కొడుతుండటంతో ఆ దెబ్బల బాధ భరించలేక విలపిస్తున్న తండ్రిని చూసి భరించలేక, అడ్డుకోపోయిన ఫెన్నిక్స్‌తో గుంజులాటలో ఒక కానిస్టేబుల్ చొక్కాగుండీలు ఊడిపోయాయి.దీంతో ఫెన్నిక్స్‌ను కూడా అదుపులోకి తీసుకొని ఇద్దరిని ఒకరి ముందు ఒకరిని బట్టలు ఊడదీసి నిలబెట్టి దారుణంగా కొట్టారు. తమవారిని వదలి పెట్టమని కుటుంబసభ్యులు పలువిధాల

### ఒక్క మాట

వేడుకున్నా కనికరించలేదు. మరుసటిరోజు ఉదయం వదిలేస్తామని కుటుంబ సభ్యులకు చెప్పిపంపారు. తండ్రీకుమారులిద్దరిని మరుసటి రోజు సాంతాన్‌కుళం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ బట్టలు మార్చారు. వారి శరీరంపై ఉన్న దెబ్బలు కనిపించకుండా చేసి అక్కడనుండి జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి కోయిల్‌పట్టీ సబ్ జైలుకు తరలించా రు. జైల్లో వారికి ఆరోగ్యసమస్యలు తలెత్తడంతో కోయిల్ పట్టీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తనాళాలు చిట్లడంతో ఫెన్నిక్స్ జూన్ 22 అపస్మారస్థితిలోకి వెళ్లి అటునుంచి అటే పరలోకానికి పయనం కట్టారు. మరుసటిరోజు జయరాజ్ ఛాతినొప్పితో ఆస్పత్రిలోనే కన్నుమూశారు. ఈ దారుణ సంఘటనపై సామాన్య కార్యకర్తలు మానవ హక్కుల సంఘాలు పెద్దఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హైకోర్టు మధురై బెంచ్ సుమోటోగా కేసును విచారణ చేపట్టి జ్యూడీషియల్ విచారణకు ఆదేశించింది. అయితే విచారణకు వచ్చిన అధికారులకు పోలీసులు సహకరించలేదు. ఇదే విషయాన్ని పోలీసులు తమకు ఏమాత్రం సహకరించడం లేదని, పైగా బెదరిస్తున్నారని కోయిల్‌పట్టి జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ హైకోర్టుకు నివేదిక సమర్పించారు. దీంతో కోర్టు విషయాన్ని తీవ్రంగా పరిగణించి దర్యాప్తును సిబిఐకి బదలీ చేసింది. అయితేపోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ రాక్షసకాండను అదే రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా హెడ్ కానిస్టేబుల్ రేవతి ప్రత్యక్షంగా చూసింది. ఈవిషయాన్ని చెప్పేందుకు కొంత సంశయించినా కుటుంబ సభ్యులు ఇచ్చిన ధైర్యంతో తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పిస్తే మొత్తం దారుణాన్ని చెప్తానని వివరాలన్నీ సుస్పష్టంగా చెప్పింది. ఆ మహిళా హెడ్‌కానిస్టేబుల్ చెప్పిన విషయాన్ని సీరియస్‌గా పరిగణించి, పోలీసు స్టేషన్‌ను స్వాధీనం చేసుకొని సంబంధిత సామాగ్రిని స్వాధీనం చేసుకోవాలని తూత్తుకుడి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలుఇచ్చింది. సాక్ష్యాలు సేకరించి సిబిఐకి బదలీ చేయాలని ఫొరెన్సిక్ బృందానికి ఉత్తర్వులు ఇచ్చింది. 2020 నుండి 26వరకు సిబిఐ వంద మందికిపైగా సాక్షుల నుంచి వివరాలను సేకరించి రెండువేలకుపైగా పేజీలతో చార్జ్‌షీట్ దాఖలుచేసింది. అందులో తండ్రీకుమారులు కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించలేదని తేల్చింది. పోలీసులనే దోషులుగా నిర్ధారించింది. వివరాలన్నీ పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మొన్న సోమవారం తొమ్మిది మందికి మరణశిక్ష విధించింది. తీర్పు సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇది సాధారణ నేరం కాదు. తండ్రీకొడుకులిద్దరిని ఎదురెదురుగా నగ్నంగా నిలబెట్టి ఇష్టం వచ్చినట్లు కొడుతూ కొందరు పోలీసులు వ్యవహరించినతీరు వివరాలను చదువుతుంటే మనసుకు తీవ్ర బాధ కలిగిందని, దోషులకు రెండు ఉరి శిక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. ఉరి శిక్షతోపాటు బాధిత కుటుంబ సభ్యులకు దోషులైన పోలీసు అధికారుల నుంచి కోటి నలభైలక్షలు నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశించింది. దేశంలో అనేక పోలీసు స్టేషన్లలో నిబంధనలకు విరుద్ధంగా చిత్రహింసలపర్వం కొనసాగుతూనే ఉంది. సాధారణంగా సాక్ష్యాలు చెప్పడానికి ఎవరూ ఉండరు కనుక బాధి తులు చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం కూడా పోలీసులపై యేటా దాదాపు మూడువేలకుపైగా ఫిర్యాదులు అందుతున్నాయి. అందులో అధిక భాగం విచారణకు నోచుకోవడం లేదు. ఇదే విషయాన్ని పదవీ విరమణ పొందిన ఇద్దరు డిజిపిలు ప్రకాశ్‌సింగ్, ఎన్‌కె సింగ్ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఏడు ఆదేశాలను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వాలకు సూచించింది.వాటిలో దేశంలోని అన్నిరాష్ట్రాలు పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ (పీసీఏ)ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ ఆదేశాలను రాష్ట్రాలు పాటిస్తున్నాయా?లేదా అని సర్వోన్నతన్యాయ స్థానం 2008లో ముగ్గురు సభ్యులతో పరిశీలన కమిటీని కూడా నియమించింది. అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో కొంతమేరకు అమలు అవుతున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. పోలీసుస్టేషన్లలో నిందితులు చిత్రహింసలకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో అన్నిటిలోనూ వాటి పరిసర ప్రాంతాల్లో నలుమూలలు కన్పించేలా సిసిటివీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పరమ్‌వీర్ సింగ్ వర్సెస్ బల్జీత్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఆరేళ్ల క్రితమే ఆదేశించింది. వాటిని సరిగ్గా అమలు చేశారా? లేదా అనే అంశంపై జిల్లా రాష్ట్ర స్థాయిల్లో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇలా ఎన్నోసార్లు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినా నేటికీ చాలా పోలీసు స్టేషన్లలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదని, చేసినా అవసరమైన సమయంలో అవి పని చేయడంలేదనే ఆరోపణలున్నాయి. పోలీసు శాఖలో సంస్కరణలు మాటల్లో, కాగితాల్లో కాకుండా చేతల్లో చూపేందుకు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. ప్రధానంగా ప్రజల హక్కులను,భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడే రాజ్యాంగ నిర్మాతల ఆశయాలు నెరవేరుతాయి.

# ఐపిఎల్‌పై మోజు క్రీడా సంస్కృతికి ముప్పు!

సురేష్ కాలేరు

దేశం మళ్లీ ఐపీఎల్ మోజులో మునిగిపోయింది. స్టేడియంలు కిటకిటలాడుతున్నాయి. టెలివిజన్ రేటింగ్స్ రికార్డులు బద్దలవుతున్నాయి. కోట్ల రూపాయల ప్రకటనలు, వేల కోట్ల వ్యాపారం, గ్లామర్, సినీ తారలు, రాజకీయ ప్రముఖులు అన్నీ ఒకే వేదికపై దర్శనమిస్తున్నాయి. ఇది క్రీడా ఉత్సవమా? లేక వ్యాపార మేళామా? అనే ప్రశ్నను మనం తప్పించుకోలేము. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ కూడా ఇదే దిశగా దూసుకుపోతోంది. ఫ్రాంచైజీలు ఆటగాళ్లపై వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఒక్కో మ్యాచ్‌కు వేల రూపాయల టిక్కెట్లు, కోట్ల రూపాయల ప్రసార హక్కులు, సోషల్ మీడియా హైప్ అన్నీ కలిపి ఐపీఎల్‌ను ఒక భారీ వినోద పరిశ్రమగా మలిచాయి. అయితే ఈ ప్రకాశవంతమైన వెలుగుల వెనుక క్రీడా వ్యవస్థలో పెరుగుతున్న అసమతుల్యతను గమనించాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో క్రీడలంటే క్రికెట్ అనే భావన బలంగా ఉంది. ఐపీఎల్ దీనిని మరింత బలపరుస్తోంది. పాఠశాలల నుంచి కాలేజీల వరకు యువతలో ఒకే లక్ష్యం క్రికెటర్ కావడం. ఇతర క్రీడలు క్రమంగా ప్రాధాన్యతను పొందలేకపోతున్నాయి. ఒలింపిక్స్,ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి వేదికలపై భారత్ సాధి స్తున్న ఫలితాలు మనకు అద్దం పడుతున్నాయి. జనాభా పరంగా ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న దేశం, మెడల్స్ విషయంలో మాత్రం వెనుకబడిపోవడం యాదృచ్ఛికం కాదు. ఇది క్రీడా విధానాల వైఫల్యం మాత్రమే కాదు, ఒకే క్రీడకు గుడ్డిగా మనమిస్తున్న మద్దతు. క్రీడల్లో డబ్బు ప్రవే శించడం ఒక సానుకూల పరిణామమే. కానీ అది సమతు ల్యంగా అన్ని క్రీడలకు చేరకపోవడం సమస్య. ఒకవైపు ఐపీఎల్



ఆటగాళ్లు కోట్లలో పారితోషికాలు అందుకుంటుం టే, మరోవైపు ఒలింపిక్ స్థాయి ఆటగాళ్లు కనీస వసతుల కోసం పోరాడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తున్నా, అదే సమయంలో దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ తీసుకురాగల ఇతర క్రీడాకారులు గుర్తింపుకోసం తపిస్తున్నారు. ఇది క్రీడా వ్యవస్థలోని అసమానతకు నిదర్శనం. ఐపీఎల్ మ్యాచ్‌లు ఇప్పుడు కేవలం క్రీడా పోటీలు కావు అవి వినోద ప్రదర్శనలు. క్రీడ అంటే క్రమశిక్షణ, పట్టుదల, జట్టు భావన. కానీ ఐపీఎల్ ప్రభావంతో యువతలో త్వరగా డబ్బు సంపాదించాలి అనే భావనలు పెరుగుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో క్రీడా సంస్కృతికి ముప్పు.దేశంలో అనేక క్రీడా అకాడమీలు ఉన్నా, వాటి పనితీరు ప్రశ్నార్థకమే. ప్రణాళిక లోపం, పారదర్శకత కొరత, రాజకీయ జోక్యం,పోటీ సంఘాలు అన్నీ కలిసి క్రీడాభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. ఈ అడ్డంకులను అధిగమించిన నాడే క్రీడాభివృద్ధి సాధ్యమవుతుంది. మీడియా కూడా ఈ అసమతుల్యతకు కారణం. ఐపీఎల్ ప్రతి మ్యాచ్‌కు గంటల కొద్దీ ప్రసారం, విశ్లేషణలు ఉంటాయి. కానీ ఇతర క్రీడలు వార్తల్లో చోటుపొందడం అరుదు. ఫలితంగా ప్రజల్లో అవగాహన తగ్గిపోతుంది. మనదేశంలో క్రికెట్‌లో చిన్నదైనా పెద్ద ప్రాముఖ్యత ఇచ్చి ప్రచురించడం అన్ని వార్త ప్రసార మాధ్యమాలకు సర్వసాధారణమైపోయింది. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి సమగ్రదృష్టి అవసరం.పాఠశాల స్థాయిలో క్రీడలను తప్పనిసరిచేయాలి. ప్రతి జిల్లాలో బహుళ క్రీడా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఒలింపిక్ క్రీడలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. కార్పొరేట్ రంగాన్ని అన్ని క్రీడల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ఐపీఎల్ ను వ్యతిరేకించడం కాదు అది క్రీడా రంగానికి ఇచ్చిన దోహదాన్ని అంగీకరించాలి. కానీ అదే సమయంలో అది సృష్టిస్తున్న అసమతుల్యతను సరిచేయడం అత్యవసరం. భారతదేశం నిజమైన క్రీడా శక్తిగాఎదగాలంటే, క్రికెట్ మోజునుంచి బయటపడుతూ అన్ని క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. లేకపోతే, ఐపీఎల్ వెలుగుల

# పిల్లలకు నిజాల బోధనా! లేక ప్రతిష్ట పరిరక్షణా?

తిప్పర్తి శ్రీనివాస్

ఇటీవలి కాలంలో విద్యా రంగంలో పెద్ద చర్చకు దారితీసిన అంశం ఎన్సీఈఆర్టీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) రూపొందించిన 8వ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలోని ఒక అధ్యాయం. ఈ అధ్యాయంలో న్యాయవ్యవస్థలో అవినీతి వంటి అంశాలు ప్రస్తావించబడటంతో వివాదం చెలరేగింది. పాఠశాలల నుండి అభ్యంతరాలు రావడంతో పాటు విషయం దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా దృష్టికి వెళ్లింది. దీనితో ఎన్సీఈఆర్టీ ఆ పాఠ్యపుస్తకాన్ని తాత్కాలికంగా తమ వెబ్‌సైట్ నుండి ఉపసంహరించుకుంది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. విద్యా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ, విద్యార్థుల అవగాహన ఈ మూడింటి మధ్య సున్నితమైన సమతుల్యత ఎలా ఉండాలనే ప్రశ్న ముందుకు వచ్చింది. మన దేశ రాజ్యాంగం ప్రకారం న్యాయవ్యవస్థ స్వతంత్ర సంస్థ. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాలు ప్రజల హక్కులను కాపాడే కవచం లాంటివి. ప్రభుత్వంలోని శాసన, కార్యనిర్వాహక శాఖల చర్యలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉంది. ఇలాంటి కీలక స్థానం కలిగిన వ్యవస్థపై పాఠ్యపుస్తకాల్లో వ్యాఖ్యానాలు చేయాలంటే అత్యంత జాగ్రత్త అవసరం. ముఖ్యంగా 8వ తరగతి విద్యార్థుల వంటి చిన్నా రుల ముందు విషయాన్ని ఎలా ఉంచాలో మరింత శ్రద్ధ వహించాలి. అవినీతి అనే సమస్య ఒక్క న్యాయవ్యవస్థకే పరిమితం కాదు. అది సమాజంలోని పలు రంగాల్లో కని పించే సామాజిక సమస్య. దాన్ని చర్చించడం తప్పు కాదు. నిజానికి, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన పెంపొందించడానికి సమాజంలోని లోపాలను కూడా వివరించడం అవసరమే. అయితే, ఒక నిర్దిష్ట వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని, సరైన సందర్భం లేకుండా ప్రతికూలంగా చూపించడం వాస్తవ దృష్టికోణాన్ని దెబ్బతీయవచ్చు. చిన్నారుల మనసుల్లో న్యాయవ్యవస్థపై అవిశ్వాసం పెరగకుండా చూసుకోవడం కూడా విద్యాసంస్థల బాధ్యతే. ఈ సందర్భంలో మరో ముఖ్యమైన అంశం విద్యాస్వాతంత్ర్యం. పాఠ్యపుస్తకాలు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా, విలువలను కూడా బోధిస్తాయి. సమాజంలో ఉన్న సమస్యలను దాచిపెట్టడం మంచిదికాదని కొందరు వాదిస్తున్నారు. విద్యార్థులకు వాస్తవాలను చెప్పాలి, విమర్శనాత్మక దృష్టితో ఆలో



చించేందుకు ప్రోత్సహించాలి అంటు న్నారు. మరోవైపు, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడడం అత్యవసరమని మరి కొందరు భావిస్తున్నారు. ఈ రెండు అభిప్రాయాల మధ్య సంతులనం అవసరం. నిజానికి,పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పారదర్శకత, నిపుణుల సలహాలు, విభిన్న వర్గాల అభిప్రాయాలు కీలకం.విద్యామండళ్లు పాఠ్యాంశాలనురూపొందించేటప్పుడు న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, మానసిక శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలి. ఒక అంశంచిన్నారులపై ఎలాంటి మానసిక ప్రభావం చూపుతుందో అంచనా వేసి, భాషను సున్నితంగా ఉపయోగించాలి. విమర్శ చేయాల్సి వచ్చినా, అది నిర్మాణా త్మకంగా ఉండాలి. ఉదాహరణకు, 'న్యాయవ్యవస్థలో సమ స్యలు ఉన్నాయి' అని చెప్పడం కంటే న్యాయవ్యవస్థను మరింత సమర్థవంతంగా చేయడానికి తీసుకుంటున్న చర్యలు' అనే కోణంలో వివరించడం మంచిది.ఇక్కడ ప్రశ్నఒకటే విద్యార్థులకు నిజాలు చెప్పాలా, లేక వ్యవస్థల ప్రతిష్ఠను కాపాడాలా?సమాధానం రెండింటికీ మధ్యలో ఉంటుంది. ప్రజాస్వామ్యంలో విమర్శఅనేది సహజం. కానీ అది బాధ్యతాయుతంగా ఉండాలి. చిన్నారులకు సరైన సందర్భం, సరైనభాష, సమతుల్య దృష్టితో విషయాన్ని అందించాలి.న్యాయవ్యవస్థలో ఉన్నసవాళ్లను చెప్పేటప్పుడు, అదే సమయంలో న్యాయవ్యవస్థ సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలను కూడా ప్రస్తావించాలి.ఈ వివాదం మనకు ఒక పెద్దపాఠం చెబుతోంది.విద్యారంగం రాజకీయాలనుండి, భావోద్వేగాల నుండి దూరంగా ఉండాలి. పాఠ్యపుస్త కాలు తాత్కాలిక చర్చలకు కాకుండా, దీర్ఘకాలిక విలువలకు సేవ చేయాలి. విద్యార్థుల్లో న్యాయపాలనపై గౌరవం పెంపొందించడమే కాకుండా, సమాజాన్ని మెరుగుపరచాలనే బాధ్యతను కూడా కల్పించాలి. ఎన్సీఈఆర్టీ తీసుకున్న నిర్ణయం తాత్కాలిక ఉపసంహారణ కావొచ్చు. కానీ భవిష్యత్తులో పాఠ్యపుస్తకాల రూపకల్పనలో మరింత జాగ్రత్త అవసరమని ఇది స్పష్టం చేసింది.న్యాయవ్యవస్థ గౌరవాన్నికాపాడుతూ, సమాజంలోని వాస్తవాలను కూడా సున్నితంగా ప్రతిబింబించే విధంగా పాఠ్యాంశాలు రూపొందించాలి. విద్యార్థులు భవిష్యత్ పౌరులు. వారిలో న్యాయం, ధర్మం, పారదర్శకత, సమానత్వం వంటి విలువలు బలపడేలా పాఠ్యపుస్తకాలు ఉండాలి. మొత్తానికి, ఈసంఘటన ఒక వివాదం మాత్రమే కాదు ఇది విద్యా విధానాల పునర్విమర్శకు అవకాశం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి సంస్థ గౌరవనీయమే.అదే సమయంలో విమర్శను స్వీకరించే సామర్థ్యం కూడా ప్రజాస్వామ్య లక్షణం.ఈ రెండు అంశాలను సమన్వయం చేయ

11-4Pg5.qxd:11-4Pg5.qxd 1/1/02 6:11 AM Page 1



# నాటో, ఐరోపా దేశాల నుంచి అమెరికా బలగాలు వెనక్కి?



**వాషింగ్టన్, ఏప్రిల్ 10:** నాటో, ఐరోపా దేశాల నుంచి అమెరికా బలగాలు వెనక్కి తగ్గనున్నాయని సమాచారం. నాటో మిత్ర దేశాల కారణంగా నిరాశకు గురైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ దిశగా అడుగులు వేయనున్నారంటూ ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్, గ్రీన్‌ల్యాండ్ విషయంలో మనస్పర్థల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోనున్నారని వైట్‌హౌస్ సీనియర్ అధికారి చెప్పినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. 'నాటో మిత్ర దేశాలు హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించడంలో ఎలాంటి సాయం చేయలేకపోయాయి. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రణాళిక ముందుకు కదలట్లేదు. ఈ కోపంతోనే నాటో నుంచి వెనక్కి తగ్గే విషయంపై సలహాదారులతో చర్చించారు. అంతర్గత చర్చలు జరిపినప్పటికీ ఈ అంశంపై ఇంతవరకు ఓ నిర్ణయానికి రాలేదు. వాషింగ్టన్-యూరప్ దేశాల మధ్య సంబంధాలు మాత్రం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇటీవల నాటో సెక్రటరీ జనరల్ మార్క్ వాషింగ్టన్‌ను సందర్శించిన సమయంలోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది' అంటూ సదరు కథనం వెల్లడించింది. 1949లోనే ఈ కూటమి (నాటో) స్థాపించినా ఇందులో ఉన్న దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి ఇంతవరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. రెండు ప్రపంచ యుద్ధం జరిగిన తర్వాత నుంచి ఐరోపా భద్రత విషయంలో అండగా నిలిచేందుకు పెద్ద సంఖ్యలో అమెరికా సైన్యం మోహరించింది. జర్మనీ, యుకె, ఇటలీ, స్పానిష్‌లోనూ అమెరికా బలగాలు ఉన్నాయి. 'ట్రంప్ అసంతృప్తి ఇప్పటిది కాదు.. కొన్ని నెలలుగా పెరుగుతూ వస్తోంది. రక్షణ రంగంలో ఐరోపా మిత్ర దేశాలు తగినంత పెట్టుబడులు పెట్టడం లేదని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. అయితే ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి. సీజ్‌ఫైర్ ప్రకటన చేసినప్పటికీ ప్రపంచానికి ఇంధనాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న హార్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరిపించడానికి నాటో దేశాలు ముందుకు రాలేదని అమెరికా అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని' అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

# ఇజ్రాయెల్ పై హెజ్బొల్లా భీకరదాడులు



**టెల్ అవీవ్, ఏప్రిల్ 10:** అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన బలహీనమైన కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం కురవడంతో మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెల కొన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున టెల్ అవీవ్, అష్దోద్ సహా పలు ఇజ్రాయెల్ నగరాల్లో హెచ్చరిక సైరన్లు మోగాయి. తామే ఈ దాడులు చేశామని హెజ్బొల్లా ప్రకటించగా, కొన్ని రాకెట్లను అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఈ దాడులతో శాంతి చర్చలకు విఘాతం కలుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగించింది. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, ఈ మార్గంలో నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. హార్మూజ్ జలసంధి మూసివేతపై యూఏఈ చమురు సంస్థ అధిపతి ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ నష్టానికి పరిహారం డిమాండ్ చేస్తామని, హార్మూజ్ జలసంధిపై తమ నియంత్రణను కొత్త దశకు తీసుకెళ్తామని ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ హెచ్చరించారు. ఈ ఉద్రిక్తతల నడుమ దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగారు. లెబనాన్‌పై దాడుల తీవ్రతను తగ్గించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ సూచించినట్లు తెలిసింది. మరోవైపు, ఇరాన్, దాని అనుబంధ సంస్థలు తమపై డ్రోన్ దాడులు చేశాయని కువైట్ ఆరోపించగా, తమ ఆయిల్ పైప్‌లైన్‌కు నష్టం వాటిల్లిందని సౌదీ అరేబియా తెలిపింది. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. హార్మూజ్ జలసంధిలో తమ నౌకల భద్రతపై చర్చించేందుకు దక్షిణ కొరియా తమ ప్రత్యేక ప్రతినిధిని ఇరాన్‌కు పంపనుంది. అమెరికా నౌకాదళానికి చెందిన అత్యంత ఖరీదైన నిఘా డ్రోన్ ఎంక్యూ4సీ ట్రైటాన్ ఈరోజు హార్మూజ్ జలసంధి సమీపంలో అదృశ్యమవ్వడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి ప్రాంతాల్లో సుమారు మూడు గంటల పాటు నిఘా కార్యకలాపాలు నిర్వహించిన ఈ డ్రోన్, తిరిగి ఇటలీలోని నావల్ ఎయిర్ స్టేషన్ సిగోనెల్లాకు వెళుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫ్లైట్ రాడార్ 24 గణాంకాల ప్రకారం, ఇరాన్ దిశగా స్వల్పంగా మలుపు తిరిగిన తక్షణమే ఈ డ్రోన్ నుంచి కోడ్ 7700 (జనరల్ ఎమర్జెన్సీ) హెచ్చరికలు వెలువడ్డాయి. ఆ తర్వాత అత్యంత వేగంగా ఎత్తును కోల్పోతూ రాడార్ పరిధి నుంచి మాయమైంది. అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన రెండు రోజులకే ఈ ఘటన జరగడం గమనార్హం. సుమారు 200 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,600 కోట్లకు పైగా) విలువైన ఈ ఎంక్యూ4సీ ట్రైటాన్ డ్రోన్, సముద్ర తీర ప్రాంతాల్లో నిరంతర నిఘా కోసం రూపొందించబడింది. 50వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో, 24 గంటల పాటు సుదీర్ఘంగా ప్రయాణించగల సామర్థ్యం ఈ డ్రోన్‌కు ఉంది. సాంకేతిక కారణాలతో కూలిపోయిందా? లేదా ఇరాన్ దళాలు కూల్చివేశాయా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఒకవైపు శాంతి ఒప్పందాలు జరుగుతుండగానే, అమెరికా తన యుద్ధ కార్యకలాపాల కోసం ప్రతి సెకనుకు 10,300 డాలర్లు (సుమారు రూ. 9.8 లక్షలు) ఖర్చు చేస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. కేవలం క్షిపణులు, వాయు, నౌకాదళ కార్యకలాపాల కోసమే రోజుకు వందల కోట్ల రూపాయలు వ్యయం చేస్తూ అమెరికా ఈ ప్రాంతంలో భారీ సైనిక వ్యూహాన్ని కొనసాగిస్తోంది. తాజాగా జరిగిన ఈ డ్రోన్ అదృశ్యం ఇరు దేశాల మధ్య నెలకొన్న తాత్కాలిక శాంతికి విఘాతం కలిగిస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

> ప్రమాదంలో పడిన కాల్పుల విరమణ ఒప్పందం
>
> మధ్యప్రాచ్యంలో మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు
>
> హార్ముజ్ వద్ద పూర్తిగా నిలిచిన రాకపోకలు
>
> హార్ముజ్ జలసంధివద్ద అమెరికా నిఘా డ్రోన్ అదృశ్యం!

# వ్యాజ్యాలు వేయడం కంటే వృత్తిపై శ్రద్ధ పెట్టండి

### పిటిషనర్లకు సుప్రీం కోర్టు సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** దేశంలోని పలు అంశాలపై 25 ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన ఓ న్యాయవాదిపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేయడం కంటే తొలుత సంబంధిత అధికారులను సంప్రదించాలని సర్వోన్నత న్యాయస్థానం పిటిషనర్‌కు సలహా ఇచ్చింది. మీరు మీ వృత్తిపై శ్రద్ధ పెట్టండి. కోర్టులో పిల్ దాఖలు చేయడానికంటే ముందే సంబంధిత అధికారులను సంప్రదించండి. పిల్ వేయదలచుకున్న పిటిషనర్‌కు అవి ఎలా పరిష్కరించాలో అంచనా వేయగలిగే శక్తి కూడా ఉండాలి. సమస్య పరిష్కారం కాకపోతే కోర్టును ఆశ్రయించాలి అని పిటిషనర్ సచిన్ గుప్తాకు ధర్మాసనం సూచించింది. విచారణ చేయాల్సి ఉన్న వ్యాజ్యాలను ఉపసంహరించుకొనేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది. స్నానానికి వాడే సబ్బులో బ్యాక్టీరియాను మాత్రమే చంపే రసాయనాలు వాడాలని, శరీరానికి హాని కలిగించేవి వాడొద్దంటూ ఆదేశాలు జారీ చేయాలని కోరడంతోపాటు పలుఅంశాలపై సచిన్‌గుప్తా వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటి విచారణ నేపథ్యంలో సిజెఐ జస్టిస్‌సూర్యకాంత్ స్పందిస్తూ ఇవన్నీ మీరు అర్ధరాత్రి నిద్రలో లేచి రాశారా? అని అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పిటిషనర్ దాఖలు చేసిన మరో అయిదు అనవసర పిల్స్‌ని సైతం కొట్టి వేశారు. నిజంగా ప్రజలకు ఉపయోగపడే అంశాలపై వ్యాజ్యాలు వేసినప్పుడు వాటి పరిష్కారానికి సుప్రీంకోర్టు ముందు ఉంటుందని ఈ సందర్భంగా సిజెఐ పేర్కొన్నారు.



# అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్‌వర్మ రాజీనామా

### ఔట్‌హౌస్‌లో నోట్లకట్టలు బయటపడిన కేసులో విచారణ!

**అలహాబాద్, ఏప్రిల్ 10:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. తనపై అభిశంసన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఈ లేఖ కాపీని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు కూడా పంపినట్లు తెలిసింది. గతేడాది మార్చి 14న జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్నప్పుడు ఆయన అధికారిక నివాసంలోని ఔట్‌హౌస్‌లో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలతో ఆయన తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ జడ్జెస్ (ఇన్‌క్వైరీ) యాక్ట్, 1968 ప్రకారం ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైంది. తన రాజీనామా లేఖలో తీవ్ర ఆవేదనతో ఈ పదవి నుంచి వైదొలగుతున్నాను.

# ఇరాన్‌పై యుద్ధంలో 650 బాలిస్టిక్ క్షిపణులు వినియోగించాం..

### ఇజ్రాయెల్ సైనిక విభాగం ఐడిఎఫ్ నివేదిక విడుదల



**జెరూసలెం, ఏప్రిల్ 10:** ఇరాన్‌పై 40 రోజులపాటు జరిపినయుద్ధంలో సుమారు 650 బాలిస్టిక్ క్షిపణులను ఫైర్ చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. దీంట్లో సగం కన్నా ఎక్కువ క్లస్టర్ బాంబులు ఉన్నట్లు ఇజ్రాయిల్ మిలిటరీ చెప్పింది. బాంబు వార్‌హెడ్స్‌ను ఆ క్షిపణులు మోసుకెళ్లాయి. ఇరాన్ జరిపిన దాడుల్లో సుమారు 20 మంది ఇజ్రాయిలీ పౌరులు మరణించారు. వెస్ట్ బ్యాంక్‌కు చెందిన నలుగురు పాలస్తీనియన్లు ఉన్నట్లు తెలిసింది. ఇక ఇరాన్ దాడి వల్ల సుమారు ఏడు వేల మంది ఇజ్రాయిలీలు గాయపడినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇరాన్ మొదటి రోజు 80 మిస్సైళ్లు ఫైర్ చేసింది. ఆ తర్వాత రెండో రోజు 60, మూడో రోజు 30 క్షిపణులను వదిలింది. ఇక ఆ తర్వాత వారాల్లో సీజ్‌ఫైర్ కుదిరే వరకు ప్రతి రోజు ఇరాన్ సగటును 10 నుంచి 20 క్షిపణులను రిలీజ్ చేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొన్నది. సుమారు 16 క్షిపణులు వార్‌హెడ్స్‌తో ఇజ్రాయెల్‌పై అటాక్ చేశాయని, వాటిల్లో వందల కిలోల పేలుడు పదార్థాలు ఉన్నట్లు మిలిటరీ పేర్కొన్నది. ఇజ్రాయిల్‌లోని జనసాంద్రత ఉన్న ప్రదేశాలపై ఆ బాంబులతో దాడి చేశారు. క్లస్టర్ బాంబు వార్‌హెడ్స్‌తో ఉన్న సుమారు 50 క్షిపణులను ఇరాన్ ఫైర్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. ఇరాన్ దాడిలో చనిపోయిన 24 మంది పౌరులే అని తెలిపింది. హోమ్ ఫ్రంట్ కమాండ్ ప్రకారం బాంబు దాడుల వల్ల ఇజ్రాయెల్‌లో సుమారు 5500 మంది చెల్లాచెదురయ్యారు. ఇక ఇరాన్‌పై సుమారు వెయ్యికిపైగా జరిగిన వైమానిక దాడుల్లో 18వేల బాంబులను ఇజ్రాయెల్ జార విడిచింది. ఐడీఎఫ్ నివేదికప్రకారం 4 వేల టార్గెట్లపై 10800 దాడులు జరిగినట్లు తెలిసింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, బాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లు, వెపన్ ప్రొడక్షన్ సైట్లు, న్యూక్లియర్ కేంద్రాలు, వివిధ ప్రధాన కార్యాలయాలు, మిలిటరీ కమాండర్లు, నేతలను టార్గెట్ చేస్తూ ఆ దాడులు జరిగాయన్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన వైమానిక దళం ఇరాన్‌పై సుమారు 8500 దాడులు నిర్వహించినట్లు మిలిటరీ పేర్కొన్నది. ఇక ఇరాన్ సైనిక లక్ష్యాలపై అమెరికా సుమారు 13వేల దాడులు చేసినట్లు అమెరికా మిలిటరీ పేర్కొన్నది. ఇరాన్ ప్రయోగించిన 470 క్షిపణుల్లో 60 శాతం క్షిపణులను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయల్ మిలిటరీ తెలిపింది. 200 లాంచర్లను ధ్వంసం చేసింది. టన్నెల్స్‌లో దాడి వల్ల 80 ప్రదేశాలు దెబ్బతిన్నట్లు ఐడీఎఫ్ చెప్పింది. వార్‌కు ముందు ఇరాన్ వద్ద సుమారు 2500 బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు ఐడీఎఫ్ అంచనా వేసింది. ఇరాన్ వద్ద ఇంకా సుమారు వెయ్యి క్షిపణులు ఉన్నట్లు ఐడీఎఫ్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. ఇరాన్‌కు చెందిన 85 శాతం ఎయిర్ డిఫెన్స్, డిటెక్షన్ సిస్టమ్స్‌ను నాశనం చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది.

# 40 రోజుల వార్‌లో ఐదువేలమంది ఇరానీ సైనికుల హాతం!

### నివేదిక విడుదలచేసిన ఇజ్రాయెల్ ఐడిఎఫ్

**జెరూసలెం, ఏప్రిల్ 10:** ఇరాన్‌పై జరిగిన 40 రోజులయుద్ధంలో అనేక మంది ఇరానీ కమాండర్లను అంతంచేసామని ఇజ్రాయెల్ సైనిక విభాగం ఐడీఎఫ్ చెప్పింది. డజన్ల సంఖ్యలో సీనియర్, మీడియా రేంజ్ ఇరానీ ఆఫీసర్లను కూడా ఏరివేసినట్లు పేర్కొన్నది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 5 వేల మంది ఇరానీ సైనికులు మృతిచెందినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. వేల సంఖ్యలో ఇరానీ సైనికులు గాయపడినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. మృతుల్లో అంతర్గత భద్రతా బలగాలు, బసిజి పారామిలిటరీ దళాలు ఉన్నట్లు తెలిసింది. ఇజ్రాయిలీ అటాక్‌లో మృతిచెందిన వారిలో ఖమేనీతో పాటు మిలిటరీ అడ్వైజర్ అలీ శామ్‌ఖానీ, ఐఆర్జీసీ కమాండ్ మొహమ్మద్ పాక్‌పౌర్, ఐఆర్జీసీ నేవీ చీఫ్ అలీరెజా తంగసిరి, ఐఆర్జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మసీద్ ఖాదేమి, బసిజి పారామిలిటరీ దళ కమాండర్ గోలంరెజా సోలేమానీ, ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ నైని, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ హెడ్ అలీ లారిజానీ, డిఫెన్స్ మినిస్టర్ అజిన్ నాసిర్‌జాదెహ్, ఎస్‌పిఎస్సీ చైర్మెన్ హుసేన్ జాబల్ అమేలియన్, ఖమేనీ మిలిటరీ సెక్రటరీ మొహమ్మద్ షిరాజి ఉన్నారు. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. ఇరానీ అణు కేంద్రాలపై దాడులు చేసినట్లు చెప్పింది. ఇరాన్ వద్ద సుమారు 60 శాతం శుద్ధీకరించిన 400 కేజీల యురేనియం ఉన్నట్లు ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ యురేనియంతో దాదాపు 11 అణు బాంబులను తయారు చేయవద్దు అని ఇజ్రాయిల్ అధికారులు అంచనా వేశారు. యాజ్ద్ పట్టణం వద్ద ఉన్న న్యూక్లియర్ ప్లాంట్‌పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అరాక్‌లో ఉన్న హెవీ వాటర్ రియాక్టర్‌పైనా దాడి జరిగింది. టెహ్రాన్‌లోని మలేక్ అస్తార్ యూనివర్సిటీలో ఉన్న న్యూక్లియర్ రీసర్చ్ డెవలప్మెంట్ సైట్, పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని తలేగాన్ 2 కేంద్రం, మిన్‌జాదేహి సీక్రెట్ అండర్‌గ్రౌండ్ కేంద్రంతో పాటు ఇతర అణు కేంద్రాలను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌కు ఆర్థిక నష్టం కలిగించే గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై అటాక్ చేసినట్లు ఐడీఎఫ్ నివేదిక విడుదలచేసింది. రెండు భారీ స్టీల్ ఫ్యాక్టరీలు, పెట్రోకెమికల్ కేంద్రాలు, 10 కీలకమైన రైలు మార్గాలు, బ్రిడ్జ్‌లను పేల్చినట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెట్రోకెమికల్ కేంద్రాల్లో ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. రైలు మార్గాలు, బ్రిడ్జ్‌ల ద్వారా ఆయుధాలను ఇరాన్ సరఫరా చేసినట్లు ఐడీఎఫ్ ఆరోపించింది.



# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

### - 13 లేదా 14న సిఎం పదవికి రాజీనామా - బీహార్ కొత్త సిఎంగా సామ్రాట్ చౌదరి?



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. నితీశ్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా సమక్షంలో హిందీ భాషలో నితీశ్ కుమార్ ప్రమాణం చేశారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘవాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడియు నేత, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జయరాం రమేశ్, బిజెపి ఎంపిలు రాజీవ్ ప్రతాప్ రూఢీ కూడా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ కుమార్ ప్రమాణం చేసిన నేపథ్యంలో.. ఇక బీహార్‌లో ఆయన ప్రస్థానం ముగిసినట్లుగా రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. ఇదిలా ఉండగా, త్వరలోనే బీహార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ "బీహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సిఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు. దీంతో ఈ నెల 13 లేదా 14న సిఎం పదవికి రాజీనామా చేస్తారని తెలుస్తోంది. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయడంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు.

# రాజ్యసభకు మళ్లీ హరివంశ్ నారాయణ్ సింగ్

### - నామినేట్ చేసిన రాష్ట్రపతి.. గెజిట్ విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** ప్రస్తుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ పెద్దల సభకు నామినేట్ అయ్యారు. శుక్రవారం జారీ చేసిన ఒక గెజిట్ ప్రకటన ప్రకారం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హరివంశ్ నారాయణ్ సింగ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేశారు. ఇటీవలే నామినేటెడ్ సభ్యుడు రంజన్ గొగోయ్ పదవీ విరమణ కావడంతో ఏర్పడిన ఖాళీ స్థానంలో హరివంశ్ నారాయణ్ సింగ్‌కు రాష్ట్రపతి అవకాశం కల్పించారు. 2018 నుండి ఉపసభాపతిగా (డిప్యూటీ ఛైర్మన్గా) సేవలందించిన హరివంశ్, బీహార్ నుండి జెడి(యు) సభ్యుడిగా తన పదవీకాలం ఏప్రిల్ 9న పూర్తి కావడంతో, మళ్లీ నామినేట్ అయ్యారు. కాగా, హరివంశ్‌కు విశేషమైన పార్లమెంటరీ అనుభవం ఉంది. ఎగువ సభలో వివిధ కీలక కమిటీలకు ఆయన సేవలందించారు. 2014లో రాజ్యసభకు ఎన్నిక కావడంతో పార్లమెంటరీ జర్నీని ఆయన ప్రారంభించారు. 2020లో తిరిగి ఎన్నికయ్యారు. రాజ్యసభ ఛైర్మన్‌గా, గత బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఆయన సభను నడిపించిన తీరు అధికార, ప్రతిపక్షాల ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను మరికొంత కాలం వినియోగించుకోవాలని కేంద్రం నిర్ణయించింది.

# ట్రంప్ చెప్పినా.. లెబనాన్‌పై వెనక్కి తగ్గని ఇజ్రాయెల్!

**టెల్అవీవ్, ఏప్రిల్ 10:** లెబనాన్‌పై దాడులను ఆపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజ్ఞప్తి చేసినప్పటికీ ఇజ్రాయెల్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రెండు పట్టణాలపై ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు జరిపాయని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని లెబనాన్ ఆరోపించింది. అందుకే హెజ్‌బొల్లా ప్రతీకార దాడులు జరిపినట్లు పేర్కొంది. అయితే, లెబనాన్‌లో దాడులు ఆపకపోతే అమెరికాతో జరిపే శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరించిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇజ్రాయెల్‌లోని మిస్గావ్ ఆమ్ ప్రాంతంలో రాకెట్ దాడులు చేశామని, తమ ప్రజలను రక్షించుకోవడంలో భాగంగానే ఈ ప్రతీకార చర్యలకు దిగినట్లు హెజ్‌బొల్లా ఓ ప్రకటనలో పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోన్న ఇజ్రాయెల్.. లెబనాన్ గ్రామాలపై దాడులు చేస్తుండటం వల్లే తాము ఈ విధంగా ప్రతిస్పందించాల్సి వస్తోందని తెలిపింది. మరోవైపు, రెండు వారాలపాటు కాల్పుల విరమణకు సంబంధించి అమెరికాతో జరిగే చర్చల్లో లెబనాన్ అంశం కూడా ఉందని ఇరాన్ చెబుతోంది. అయినప్పటికీ, ఇజ్రాయెల్ భారీ స్థాయిలో దాడులు జరుపుతోంది. ఇటీవల కేవలం పది నిమిషాల్లోనే 100 లక్ష్యాలపై దాడులు చేసినట్లు సమాచారం.

**మాజీ విదేశాంగ మంత్రి మృతి:** ఇరాన్‌లో ఇటీవల జరిగిన వైమానిక దాడుల్లో గాయపడిన ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి కమాల్ ఖరాజీ మృతి చెందినట్లు టెహ్రాన్ మీడియా పేర్కొంది. ఇరాన్ సంస్కరణవాది, అధ్యక్షుడు మొహమ్మద్ ఖతామీ హయాంలో ఖరాజీ విదేశాంగ మంత్రిగా.. సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీకి విదేశీ వ్యవహారాల సలహాదారుడిగా పనిచేశారు. అణుబాంబు తయారు చేసే సాంకేతిక సామర్థ్యం ఇరాన్‌కు ఉందంటూ 2022లో సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే, దీన్ని రూపొందించడంపై ఇరాన్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని అప్పట్లో ఆయన పేర్కొన్నారు.

# ఉక్రెయిన్ యుద్ధంలో తాత్కాలికకాల్పుల విరమణ

**మాస్కో, ఏప్రిల్ 10:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థడాక్స్ ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఉక్రెయిన్‌తో తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఈ మేరకు క్రెమ్లిన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 11వ తేదీ, శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ఏప్రిల్ 12వ తేదీ, శనివారం అర్ధరాత్రి వరకు ఈ కాల్పుల విరమణ అమల్లో ఉంటుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ కాలంలో అన్ని దిశల్లో పోరాట చర్యలను నిలిపివేయాలని రష్యా సైనిక దళాల జనరల్ స్టాఫ్‌కు అధ్యక్షుడు పుతిన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే, శత్రువుల నుంచి ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు ఎదురైనా వాటిని సమర్థంగా తిప్పికొట్టేందుకు తమ దళాలు సిద్ధంగా ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. రష్యా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉక్రెయిన్ కూడా గౌరవించి, కాల్పుల విరమణ పాటిస్తుందని ఆశిస్తున్నట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. కాగా, కొన్ని రోజుల క్రితం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ కూడా ఈస్టర్ పండుగ సందర్భంగా యుద్ధానికి విరామం ఇవ్వాలని అమెరికా ద్వారా ప్రతిపాదించారు. గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా నేతృత్వంలో జరిగిన పలు దఫాల చర్చలు విఫలమయ్యాయి.

మధ్యప్రాచ్యంలో ఇరాన్ అంశంపై అమెరికా దృష్టి సారించడంతో ఈ చర్చలు మరింత మందగించాయి. భూభాగ, రాజకీయపరమైన డిమాండ్లను రష్యా ముం దుంచగా, వాటిని అంగీకరించడం లొంగిపోవడ మేనని ఉక్రెయిన్ తిరస్కరిస్తోంది. ఈ యుద్ధం కారణంగా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోగా, కోట్ల మంది నిరాశ్రయులయ్యారు.

# ఉగ్రవాదులు నమాజ్‌చేస్తున్నారని దాడిని వాయిదావేసాం!

### ఆపరేషన్ సిందూర్‌పై ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరంపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఎంయూఎన్ వారి బిఫోర్ ఐ బికేమ్ మీ అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయన్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ అదనపు కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ విభాగం ఎస్పీ కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదై, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పిపి అమరనారాయణ కోర్టులో పటిష్టంగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షపడేలా చూశారు. 2017 కేసులో తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన ఆర్.రామరాజన్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ తీర్పు వెలువడించారు. కోర్టు ఆదేశాల మేరకు అతనిని నెల్లూరు జైలుకు తరలించారు.

# హార్యానాలో గుడివాడ టెకీ దారుణ హత్య



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఒక యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హార్యానాలో దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గుడివాడ శివారు బేతవోలుకు చెందిన టెకి బండ్ల ఋషికేష్ (27) ఇటీవలే హార్యానాలోని పంచకుల ప్రాంతంలో ఉన్న ఒక ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. విధుల్లో చేరి పది రోజులు కూడా గడవకముందే ఆయన మరణవార్త వినాల్సి రావడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. కంపెనీ కేటాయించిన నివాస గదిలోనే ఋషికేష్ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను హత్య చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న హార్యానా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. గుడివాడ వన్‌టౌన్ పోలీసులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేయడంతో, ఋషికేష్ తండ్రి హుటాహుటిన హార్యానాకు బయలుదేరి వెళ్లారు. ఈ హత్య వ్యక్తిగత కారణాలతో జరిగిందా? లేక ఆఫీసు గొడవలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కొత్త చోట, కొత్త ఉద్యోగంలో చేరిన కొద్ది రోజుల్లోనే ఇలా జరగడం వెనుక ఏదైనా కుట్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ రీత్యా పంచకుల వెళ్లిన కొద్ది రోజుల్లోనే ప్రాణాలు కోల్పోవడంతో బాధితుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.




# తిరుపతి రుయా ఆసుపత్రిలో ఒపి వేళల్లో మార్పు

తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాయలసీమ జిల్లాలకే తలమానికంగా ఉన్న, నిరుపేద రోగులకు, బాధితులకు మెరుగైన వైద్యసేవలందిస్తున్న తిరుపతి రామ్‌నారాయణ రుయా ఆస్పత్రిలో ఒపి వేళలు మార్పు చేస్తూ ఆస్పత్రి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రోజువారీగా అన్ని విభాగాలతో కలిపి సుమారు 1,500 మంది వరకు ఒపిలు నమోదవుతూన్నాయి. ఇప్పటికే రాయలసీమ జిల్లాల్లోనే గాక నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో రోడ్డుప్రమాదాలు జరిగినా, అత్యవసర కేసులు తిరుపతి రూయా ఆస్పత్రికి వస్తున్నాయి. ఇలా రోగుల సంఖ్య పెరగడంతోబాటు ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు మెరుగైన వైద్యసేలందిస్తున్నారు. వేసవికాలంలో ఎండ తీవ్రత పెరగడంతో ఒపి వేళల్లో మార్పుచేశారు. ఎంతో దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలుగా సోమవారం 13వ తేదీ నుండి ఉదయం 8గంటలకు ఒపిలు కౌంటర్లు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుండి సాయంత్రం 4గంటల వరకు ఒపిలు తీసుకొని వైద్య సేవలు పొందవచ్చని రుయా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రుయా ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఒపిలు జారీచేస్తున్నారు. ఆ తర్వాత అత్యవసర కేసుల ఒపిలే జారీ అవుతాయి. రోగులు, బాధితులు ఈ వేళల మార్పును గమనించి ఆస్పత్రికి చేరుకోవాలని కోరారు.

# సీమకు అన్యాయంపై ఐక్య ఉద్యమం

**● రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర ● గతంలో నీరుచెట్టులో దోపిడీ చేసుకున్నట్లే ఇప్పుడు నీటి భద్రత ● సాగునీటి సంఘాలకు పనులు- రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు సమాలోచన సదస్సులో మాజీ మంత్రి కాకానీ గోవర్ధన్ రెడ్డి**




అనంతపురం, ఏప్రిల్10 ప్రభాతవార్త బ్యూరో: గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు నీరు చెట్టు పథకం కింద టిడిపి కార్యకర్తలకు దోపిడీకి అవకాశం ఇచ్చినట్లే ఇప్పుడు కూటమి ప్రభుత్వం సాగునీటి భద్రత సాగునీటి సంఘాలకు పనులు పేరుతో టిడిపి కార్యకర్తలు దోచుకునేందుకు అవకాశం ఇస్తుందని, చంద్రబాబు సర్కార్ ఏ స్కీమ్ అమలు చేసినా అందులో కమిషన్లు ఉంటాయని వైసిపి నేత, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు పని ఎక్కువ చేసిన ప్రచారం తక్కువ చేసుకునేవారని, ఇప్పుడు సీఎం చంద్రబాబు పని తక్కువ చేసి ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి కార్యకర్తలు జనం దృష్టికి తీసుకోవడంతో పాటు సాగునీటి పథకాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను తక్షణం పూర్తి చేయడంతో పాటు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు – సమాలోచన పేరుతో శుక్రవారం అనంతపురంలోని గుత్తిరోడ్డులో ఉన్న కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో సిఎం చంద్రబాబు వైఖరిని మాజీ మంత్రి కాకాని తూర్పారపట్టారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటల మేరకే ఈ ప్రాజెక్టు పనులు ఆపేశారన్న వ్యాఖ్యలపై చంద్రబాబు ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట సీమలోని ఇతర ప్రాజెక్టులకు ఇన్సూరెన్స్‌లా పనిచేస్తుందని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయం గురించి ఆలోచించిన ఒకే ఒక్క నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు మెడలు వంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయించుకుందామన్నారు.

వైఎస్‌ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీమ అభివృద్ధికి కీలకమైన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని, సీమ ప్రజల ప్రయోజనాల కోసం పోరుబాటను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమపై ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

అమరావతి రాజధాని పేరుతో ఒకే చోట నిధులు ఖర్చు పెడితే వెనుకబడిన ప్రాంతాల పరిస్థితి ఏంటని అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. రాయలసీమ అభివృద్ధి కోసం గతంలో బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి ఇప్పుడు మౌనంగా ఉండడం ఏంటని ప్రశ్నించారు. సీమ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్, మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్, వైసిపి అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వ యకర్తలు రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, వై.వెంక ట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌నాథ్ రెడ్డి, కెవి రమణ మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎపి సిఎం చంద్రబాబు మౌనం అనుమానాస్పదమన్నారు. ఒకవైపు ఈ ప్రాజెక్టును దొంగ ప్రాజెక్టు అని అంటూనే, మరోవైపు వేల కోట్ల రూపాయల బిల్లులు ఎందుకు చెల్లించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితేనే రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుందని పేర్కొన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగించాలన్నారు. రాయలసీమకు సాగు, తాగునీటి విషయంలో జరుగుతున్న అన్యాయంపై ఐక్య ఉద్యమాలే మార్గమని స్పష్టం చేశారు. అన్ని శాసనసభ స్థానాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు సమావేశానికి భారీగా రావడం విశేషం.

# సీమకు అసలైన ద్రోహి జగన్ రెడ్డే

**- టిడిపి జిల్లా నేతలు అంబికా లక్ష్మినారాయణ, శ్రీధర్ చౌదరి ధ్వజం**




అనంతపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త బ్యూరో: రాయలసీమలోని 102 నీటి ప్రాజెక్టులకు రద్దుచేసి సీమ బిడ్డ అని చెప్పుకునే జగన్‌రెడ్డి సీమరైతుల పట్ల క్షమించారని ద్రోహం చేశాడు అని, ఇప్పుడు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు డైవర్షన్ కోసం ఈ రోజు రౌండ్ టేబుల్ సమావేశం పెట్టి కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు అని అనంతపురము ఎంపి అంబికా లక్ష్మినారాయణ, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్ చౌదరి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపి అంబికా లక్ష్మినారాయణ, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిలు సంయుక్తంగా ఎంపి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్ మోద్దీన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కృష్ణకుమార్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్‌లతో కలిసి ఘాటుగా వైసిపి నాయకులకు బదులిచ్చారు. ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయలసీమకు జగన్ రెడ్డి ద్రోహం చేస్తే తెలుగుదేశం ప్రభుత్వం న్యాయం చేసింది. అందుకు సాక్ష్యం నేడు రాయలసీమలోని అన్నీ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే అందుకు నిదర్శనమన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పై అనంతపురంలో జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాయలసీమకు ఏం చేశాడనే విషయాన్ని చెప్పాలి. జగన్ రెడ్డి పిచ్చి తుగ్లక్ పాలనలో రాయలసీమ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేయలేదన్నారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, బిటి ప్రాజెక్ట్ లాంటి 102 రాయలసీమ ప్రాజెక్టుల పనుల్ని జీఓ 365 తో జగన్ ప్రభుత్వం ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. రాయలసీమ రైతులకు ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని కూడా జగన్ రద్దీ చేశారన్నారు. 2026-27 ఆర్థిక బడ్జెట్‌లో రూ.10,014 కోట్లు ఒక్క రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తో సహా నేటి రాయలసీమ ప్రాజెక్టుల్లో 80శాతం ఎన్టీఆర్, చంద్రబాబు నిర్మించినవేనని అంబికా గుర్తు చేశారు. టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి మాట్లాడుతూ జగన్ పాలనలోనే ఆగిపోయిన రాయలసీమ లిఫ్టును ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎలా అపివేస్తుందన్నారు. జగన్ జమాన 2021లో ఆగిపోయిన లిఫ్ట్ నిర్మాణాలకు నాలుగేళ్ళల్లో అనుమతులు ఎందుకు జగన్ ప్రభుత్వం సాధించలేకపోయారన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందడానికి కుట్ర చేసింది మన రాయలసీమ వాసులు ఇంకా మర్చిపోలేదన్నారు. దాదాపు రాయలసీమ హార్టికల్చర్ హబ్ కోసం రూ.30 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం శుభపరిణామని పేర్కొన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే ఒక యజ్ఞానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పూనుకున్నారని, దానికి ఇప్పుడు రాక్షసుల్లా వైసిపి నాయకులు అడ్డుపడకుండా సహకరించాలని హితువు చెప్పారు.

# వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ మరో యేడాది పొడిగింపు

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్‌ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంఎస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిఓ ఎంఎస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది. మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్‌ను మరో ఏడాది కాలానికి అనగా 2026- 27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ (ఐఅండ్ పిఆర్) విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పల్నాడు అత్యాచార ఘటనలో నిందితుడు అరెస్టు



గుంటూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త ప్రతినిధి: మాచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో మహిళపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేపట్టినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 2వ తేదీన మాచర్ల పట్టణంలో నివాసం వుండే మహిళా తన ఇంటిలో ఒంటరిగా వున్న సమయంలో మంచి నీళ్ల కోసం వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె పై అత్యాచారం చేసి దారుణంగా దాడి చేశాడన్న ఫిర్యాదు పై పోలీసులు విచారణ జరిపి గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు నామాల శ్రీనివాస్ కు సోషల్ మెసేజ్ యాప్ ద్వారా బాధితురాలితో గత కొంతకాలంగా పరిచయం వుంది. ఇంస్టాగ్రామ్ ద్వారా ఆమెతో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బాధితురాలు అతనిని తన ఇంటికి రావాలని ఆహ్వానించి అతను ఇంటికి చేరుకునే వరకు మార్గ నిర్దేశం చేసినట్లు పోలీసులకు బాధితురాలు తెలిపినట్లు సమాచారం. ఆ విధంగా మహిళ ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు ఆమె పై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. మహిళలు , బాలికల భద్రత రక్షణకు పల్నాడు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను ఏమాత్రం సహించబోమని, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# అచ్చెన్నాయుడూ.. నీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకో!

**వైఎస్సార్ మరణంపై నీ వ్యాఖ్యలు సరికాదు**

**మీడియా సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**

ఆముదాలవలస, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మరణంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యల పట్ల మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమదాలవలస తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ఉనికి కోసం చనిపోయిన వ్యక్తిపై బురద చల్లడం అచ్చెన్నాయుడి దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. వైఎస్సార్ మరణించిన సమయంలో జగన్మోహన్ రెడ్డి విదేశాల్లో ఉన్నారంటూ అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ, ఆనాడు తండ్రి మరణవార్త విని కుప్పకూలిపోయిన కుటుంబానికి జగన్ అండగా ఉండి,అంత్యక్రియల వరకు అన్ని తానై చూసుకున్న విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని, నీ రాజకీయ లబ్ధి కోసం ఇన్ని అబద్ధాలు ఆడతావా అని నిలదీశారు. మంత్రి అచ్చెన్నాయుడి విమర్శలకు కౌంటర్ ఇస్తూ, గార మండలం సింగపురం దగ్గర ఎర్రన్నాయుడుపై జరిగిన బాంబ్ బ్లాస్ట్ ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ సంచలన ప్రశ్నలు సంధించారు. విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో రణస్థలం మండలం వద్ద ఎర్రంనాయుడు వాహన ప్రమాదంలో మృతి చెందిన ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ తమ్మినేని ప్రశ్నించారు. వైఎస్సార్ పాదయాత్ర ద్వారా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని, ఆయన ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు తరాల జీవితాలను మార్చాయని గుర్తు చేస్తూ, అలాంటి మహనీయుడిపై విమర్శలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడమేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మావిగన్ ప్లాన్ బికి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోందని, అమరావతిలో జరుగుతున్న దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఆదేశాలతో అచ్చెన్నాయుడు ఇటువంటి నీచమైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'అమరావతి వద్దు.. మావిగన్ ముద్దు' అని ప్రజలు అంటున్నారని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అచ్చెన్నాయుడు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తమ్మినేని సీతారాం ఘాటుగా హెచ్చరించారు.

# స్వచ్ఛ తిరుమలకు మరింత ప్రత్యేక శ్రద్ధ



**- కొండపై భక్తులకు దాహార్తి తీర్చుతున్న కదిలే మినీ నీళ్ల ట్యాంకులు**

తిరుమల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమలను మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు తిరుమల తిరుపతి దేవస్థానమ్ ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యంత పరిశుభ్ర పుణ్యక్షేత్రాల్లో తిరుమలకు మొదటిస్థానం లభించింది. రోజూ లక్షమంది వరకు వస్తున్న భక్తుల ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సుమారు 4.5 చదరపు కిలోమీటర్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా కొనసాగుతోంది. ఇందుకు తిరుమలను మూడు జోన్లుగా, ఏడు వార్డులుగా విభజించి, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. నో స్టాక్ – నో గోడౌన్ లైసెన్సులను జారీ చేయడం జరుగుతోంది. వార్డు1 పరిధిలో ప్రధానమైన శ్రీవారి ఆలయం పరిధిలో విభాగ సిబ్బంది ప్రత్యక్షంగా పనిచేస్తున్నారు. వార్డు2 నుండి 7 వరకు పారిశుద్ధ్య పనులు మూడు కాంట్రాక్ట్ సంస్థల ద్వారా నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణకు తొమ్మిది టిప్పర్ వాహనాలు పనిచేస్తున్నాయి. రోజుకు సుమారు 45 ట్రిప్పులు చేసి, దాదాపు 3,056 చెత్త డబ్బాల నుండి చెత్త సేకరణ జరుగుతోంది. 2025 సంవత్సరానికి సంబంధించి హానికర రసాయనాలు లేకుండా మట్టిలో కలిసిపోయే వ్యర్థాలు 16,689.04 మెట్రిక్ టన్నులు. నాన్‌బయో డిగ్రేడబుల్ వ్యర్థాలు 8,221.97 మెట్రిక్ టన్నులు సేకరణ జరుగుతోంది. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో విస్తృతంగా మరుగుదొడ్ల బ్లాకులు ఏర్పాటు చేశారు. శాశ్వత మరుగుదొడ్లు 210. సంస్థల మరుగుదొడ్లు 130. తాత్కాలిక మరుగుదొడ్లు 14 అందుబాటులో ఉన్నాయి. వేసవికాలంలో భక్తులకు దాహార్తి కలిగించకుండా శ్రీవారి సేవకులతో మొబైల్ వాటర్ డ్రమ్స్‌తో తాగునీరు పంపిణీ జరుగుతోంది. వేసవి ప్రారంభమవ్వడంతో భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నేరుగా భక్తుల వద్దకే శ్రీవారి సేవకులు వెళ్లి తాగునీరు అందిస్తున్నారు. ఎన్‌ఎబిఎల్ గుర్తింపు పొందిన ఈ ల్యాబ్ భక్తులకు అందించే నీరు, ఆహారం నాణ్యతను కఠినంగా పరీక్షిస్తోంది. ప్రతిరోజూ లడ్డూ, అన్నప్రసాదం తయారీలో ఉపయోగించే పదార్థాల పరీక్షలు, నీటి నమూనాల విశ్లేషణ (రోజుకు సుమారు 20 నమూనాలు), నెలకు 1,200 నమూనాల పరీక్షలు, నెయ్యి నాణ్యత పరీక్షలకు ఆధునిక హెచ్‌పిఎల్‌సి, జిసి యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ద్వారా ఇటీవల 19.75 కోట్లతో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు జరిగింది. తిరులలో నాణ్యమైన పారిశుద్ధ్య సేవలపై భక్తుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా టిటిడి ఎప్పటికప్పుడు చెత్తను సేకరిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడం, మరుగుదొడ్లను అనునిత్యం పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలపై భక్తులు టిటిడిని ప్రశంసిస్తున్నారు.

# తిరుపతి పద్మావతి మహిళ వర్సిటీకి ఐఎస్‌ఓ గుర్తింపు

**- మెరుగైన విద్యాబోధన, అత్యుత్తమ విధానాల అమలు**



తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్‌ఓ) గుర్తింపు సాధించింది. ఈ గుర్తింపుతో విశ్వవిద్యాలయం మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. నాణ్యమైన విద్య, సమర్థవంతమైన పరిపాలన, నిరంతర అభివృద్ధి పట్ల విశ్వవిద్యాలయానికి ఉన్న నిబద్ధతకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ నిదర్శనమని వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం తెలిపారు. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య రెండురోజులు విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, ఈ నూతన ధ్రువీకరణ పత్రాలను విశ్వవిద్యాలయ అధికారులకు అందజేశారు. విశ్వవిద్యాలయ పురోగతిపై ఆయన విద్యాసంస్థ పారదర్శకత, అత్యుత్తమ విధానాల అమలులో అత్యున్నత స్థాయి నిబద్ధతను ప్రదర్శించిందని కొనియాడారు. ఉపకులపతి ఆచార్య ఉమ ఈ సాధన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సర్టిఫికేషన్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సమ్మిళితత్వం, విద్యాపరమైన విశిష్టత కోసం వర్సిటీ నిరంతరం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష మాట్లాడుతూ ఐఎస్‌ఓ ధ్రువీకరణ విశ్వవిద్యాలయంకు విద్య, పరిపాలనా ప్రక్రియల్లో నాణ్యత, పారదర్శకత, నిరంతర మెరుగుదలకు లభించిన గుర్తింపు అని తెలిపారు. విద్య ద్వారా మహిళా సాధికారతకు నిరంతరం కట్టుబడి ఉందని డైరెక్టర్ ఐక్యూఎసి ఆచార్య టి.త్రిపురసుందరి పేర్కొన్నారు.

# యుపిఎస్‌సి సంయుక్త రక్షణ సేవల పరీక్షకు ఏర్పాట్లు



తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: యుపిఎస్‌సి ద్వారా తిరుపతి కేంద్రాల్లో రేపు ఆదివారం జరిగే సంయుక్త రక్షణ సేవల పరీక్ష (1)కు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. 2026 జాతీయ రక్షణ అకాడమీ నావల్ అకాడమీ పరీక్షకు తిరుపతిలో నాలుగు కేంద్రాలున్నాయన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు లైజనింగ్ అధికారులు, సంబంధిత ఆదికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలలో 1,535 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతిలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్ –ఎ), పద్మావతి గెస్ట్ హౌస్ సమీపంలో, పద్మామవతి మహిళ డిగ్రీ కళాశాల ప్రక్కన, తిరుపతి, పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్ –బి), పద్మావతి గెస్ట్ హౌస్ సమీపంలో, ఎస్.వి ఆర్ట్స్ కళాశాల, (టి.టి.డి.), (వింగ్ ఎ,బి), బాలాజీ కాలనీ సమీపంలో కేంద్రాలన్నారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు జితేంద్ర కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 23న తిరుపతి, చిత్తూరు జిల్లాలలో తమిళనాడు ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా తిరుపతి, చిత్తూరు జిల్లాలలో పనిచేసే ఆ రాష్ట్రంలో అర్హులైన ఓటర్లుగా ఉన్న ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్ రోజైన ఏప్రిల్ 23న, ఎపిలో పనిచేస్తున్న తమిళనాడు ఓటర్లకు, రోజువారీ వేతన కార్మికులతో సహా అందరికీ వేతనంతో కూడిన సెలవు వర్తిస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 135బి ప్రకారం ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ నిబంధనను ఉల్లంఘించి, ఓటు వేయడానికి సెలవు ఇవ్వని యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుని, తమిళనాడులో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు ఓటును వినియోగించుకోవచ్చు.

# ఘనంగా చందనోత్సవ సన్నాహాలు శ్రీవారి చందనం సేకరణ ప్రారంభం

**సింహాచలం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిజరూప దర్శన మహోత్సవానికి (చందనోత్సవం) దేవస్థానం అత్యంత వైభవంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 20వ తేదీన అక్షయ తృతీయ పర్వదినం జరగనున్న చందనోత్సవం కోసం స్వామివారికి సమర్పించే పవిత్ర చందనాన్ని సేకరించే ప్రక్రియను ఈరోజు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ నెల 13వ చైత్ర బహుళ ఏకాదశి పర్వదినాన ఉదయం 6:30 గంటలకు చందనం సాన్ల కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు, సహాయ కార్యనిర్వాహణాధికారి కె తిరుమలేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం వంటి కార్యక్రమాలు నిర్వహించి చందనం సానను ప్రారంభిస్తారు. శ్రీకార్యపురులు ముఖ వస్త్రాలను ధరించి అత్యంత నిష్ఠతో ఈ సేవలో పాల్గొంటారు. ఏడాది పొడవునా చందనపు పూతలో దర్శనమిచ్చే స్వామివారు, కేవలం అక్షయ తృతీయ రోజున మాత్రమే తన నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆ రోజున తొలి విడత చందన సమర్పణ కోసం ఈ సన్నాహాలు జరుగుతున్నాయి. అని ఆలయ కార్య నిర్వహణ అధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదిదారులతో మాట్లాడిన గంటా

**మధురవాడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



మధురవాడ జోనల్ కార్యాలయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. గతంలో అధికారులు నిర్వహించిన పీజీఆర్ఎస్ లో పరిష్కారం అయినట్టు చూపించిన ఫిర్యాదిదారులతో ఆయన ఫోన్ లో మాట్లాడారు. వీధి లైట్లు వెలగడం లేదని.. డ్రైన్ శుభ్రం చేయలేదని.. సుందరయ్య పార్కులో లైట్లు పని చేయడం లేదని ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యాయా అని



ప్రశ్నించారు. పరిష్కారమయ్యాయని ఫిర్యాదిదారులైన ఎం.అప్పారావు, ఈటి శేషగిరిరావు, వి.వి. ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎమ్మెల్యేకు తెలియజేశారు. దివ్యాంగ పెన్షన్ కోసం ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాలేదని కరిమిరెడ్డి సాయికుమార్ చెప్పారు. రోడ్లు, డ్రైయిన్లు, విద్యుత్తు తదితర సమస్యలపై పలువురు వినతి పత్రాలు సమర్పించారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, డీసీపీ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మొల్లి లక్ష్మణరావు, గరే గుర్నాథ్, లొడగల అప్పారావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, కె.రామానాయుడు, తాత్రాజు అప్పారావు, లొడగల జానకిరామ్, చెట్టుపల్లి గోపీ, కురుమిన లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి తొలగించిన నైట్ ఫుడ్ కోర్టును తెరిపించాలి

*- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బాధితులు బిక్షాటన*

*- 17వ రోజుకు చేరుకున్న చిరు వ్యాపారుల రిలే నిరాహారదీక్ష*

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వం తొలగించిన నైట్ ఫుడ్ కోర్ట్ ను తిరిగి తెరిపించాలని చిరు వ్యాపారులు వినూత్నంగా బిక్షాటన చేపట్టారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సెంట్రల్ పార్క్ ఫుడ్ ట్రక్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ కోర్ట్ వ్యాపారులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష శుక్రవారం కి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టు బాధితులు ప్లేట్లను పట్టుకొని దీక్షా శిబిరం నుండి రోడ్డు మీదకు వచ్చి బిక్షాటన చేశారు. కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం వ్యక్తం చేసిన సీఐటీయూ నాయకులు వెంకట్రావు, సింహాచలం సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ గత 12 రోజులుగా నిరాహార దీక్షలు చేపడుతున్న నేటి వరకు అధికారులు గాని, నాయకులు గాని వారిని పట్టించుకోకపో వడం దారుణమన్నారు. గత సారత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టిన సామా న్యులు కష్టాల్లో ఉంటే దక్షిణ నియోజకవర్గానికి చెందిన నాయకులు కనీసం తమ కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఫుడ్ కోర్ట్ తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణలను వేడుకున్న ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ నాయకులు వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ పార్క్ ఫుడ్ ట్రక్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో అసోసియేషన్ అధ్యక్షులు కె శ్రీకాంత్, ఎం ప్రసాద్, కార్యదర్శి ఎం. లలిత కుమారి, సభ్యులు దుంగ శ్రీను, బొగ్గ శ్యామ్, లక్ష్మీ, ఫుడ్ కోర్టు వ్యాపారులు పాల్గొన్నారు.

# డీఎస్ఎన్ఎల్ యూ ఫ్యాకల్టీ నీలిమ బొగాదికి అరుదైన అవకాశం

- ప్రపంచ వేదికపై టాప్-20లో ఆమె రూపొందించిన వీడియో కలరిపయట్టుకు చోటు
- మీర వేసే ఓటు దేశశనికి గుర్తింపు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ మేధో సంపత్తి సంస్థ నిర్వహించిన వరల్డ్ ఐపీడే-2026 గ్లోబల్ వీడియో పోటీల్లో మన దేశానికి అరుదైన గౌరవం దక్కింది. ముఖ్యంగా దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ ఫ్యాకల్టీ డాక్టర్ నీలిమబొగాది రూపొందించిన ఖికలరి పయట్టుఖి వీడియో ప్రపంచ వ్యాప్తంగా టాప్ 20లో నిలిచింది. 43దేశాల నుంచి అందిన

మిగతా 8..లో

# మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు 6 నెలల సాధారణ జైలు శిక్ష

- రూ.5 వేలు జరిమానా కూడా..

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



జీవీఎంసీ వద్ద 2016లో చేపట్టిన ధర్నా విషయంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ హై కోర్టు అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అపీల్ చేస్తానని వివరించారు.







విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు
26
వార్త

## రేపటి తరానికి స్ఫూర్తిదాతలు..

# బంగారు భవితకు మార్గదర్శకులు..

- ముఖ్యమంత్రి పిలుపునందుకొని పీ4లో చేరిన 7,539 సమాజ సేవకులు ..
- పేదరిక నిర్మూలనలో విజయగాథగా నిలుస్తున్న పీ4 ఆదర్శ కార్యక్రమం ..
- వివిధ రూపాల్లో సుమారు రూ20.86 కోట్ల సాయమందించిన సంస్థలు, వ్యక్తులు ..
- 66,103 కుటుంబాలను దత్తత తీసుకున్న విశాఖ జిల్లాలోని మార్గదర్శకులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



పేదరికం లేని సమాజ నిర్మాణం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం విశాఖపట్నం జిల్లాలో విజయగాథగా నిలుస్తోంది. అందరిలో స్ఫూర్తిని నింపుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా అమలు అవుతున్న ఈ కార్యక్రమం, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రతీకగా మారింది. జిల్లా అధికారుల సమన్వయం, దాతల దాతృత్వం కలిసి విశాఖను సామాజిక సేవలో ముందంజలో నిలిపాయి. ముఖ్యమంత్రి పిలుపునందుకొని పీ4లో 7,539 చేరిన సమాజ సేవకులు.. 66,103 కుటుంబాలను దత్తత తీసుకున్నాయి. జిల్లాకు చెందిన పలు సంస్థలు, వ్యక్తులు వివిధ రూపాల్లో రూ.20.86 కోట్ల సాయమందించి పీ4 కార్యక్రమ స్ఫూర్తిని నలుమూలలా ఇనుమడింపజేశాయి. ఇటీవల విశాఖపట్టణంలో నిర్వహించిన పీ4 వార్షిక మహోత్సవంలో అత్యంత సేవాస్ఫూర్తిని కొనసాగించిన 20 మంది దాతలకు జిల్లా ఇన్చార్జి మంత్రి, భీమిలి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అభినందన పత్రాలు అందించటంతో పాటు, సత్కారం చేశారు. ఇంతకీ వారంతా ఏం చేశారు.. సమాజానికి ఎలాంటి

మిగతా 8..లో

## ప్రతీ హామీ నెరవేరుస్తాం.. అపోహలు వద్దు

# తర్లువాడ రైతులకు గంటా హామీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



పరిహారం విషయంలో గూగుల్ డేటా సెంటర్ కోసం భూములిచ్చిన రైతులకు ఎలాంటి అపోహలు అవసరం లేదని, ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం తర్లువాడ రైతులతో సమావేశమైన ఆయన రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్ తో సమావేశమై అనుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ కోసం భూములిచ్చిన రైతుల పట్ల సీఎం చంద్రబాబు అనుకూలంగా ఉన్నారని, పరిహారం పెంపులో ఉదారంగా వ్యవహరించారని గుర్తు చేశారు. డి.పట్టా భూములకు ఎకరానికి 20 సెంట్ల భూమి, షాపింగ్ కాంప్లెక్స్ లో షాపు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగం సహా 520 మందికి 3 సెంట్ల ఇంటి స్థలాన్ని ఇస్తామని ఉద్ఘాటించారు. సమాచార లోపం కారణంగా రైతులు ఆందోళనకు గురై.. పనులు అపారని పేర్కొన్నారు. డి.పట్టా మాదిరిగానే జిరాయతీ భూమికి పరిహారం ఇవ్వడం పట్ల బాధితులు వ్యక్తం చేసిన అభ్యంతరంతో గంటా ఏకీభవించారు. వారికి న్యాయం చేసేలా సీఎంతో మాట్లాడుతానని భరోసా ఇచ్చారు. వివిధ అంశాలపై గంటా ఇచ్చిన హామీతో సంతృప్తి చెందిన రైతులు తమ గ్రామంలో కొన్ని శక్తులు దుష్ప్రచారాన్ని ప్రారంభించాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డేటా సెంటర్ వల్ల

మిగతా 8..లో

# కొత్త రైలు సేవలు ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పాటు

- డిఆర్‌యుసిసి సభ్యులు చలసాని గాంధీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**



విశాఖపట్నం డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు శ్రీ చలసాని గాంధీ గారు, తిరుపతి – శ్రీకాకుళం రోడ్ మధ్య కొత్తగా ప్రవేశపెడుతున్న హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్ (17439/17440) రైలు సేవలను హృదయ పూర్వకంగా స్వాగతించారు. రైల్వే శాఖ ప్రకటించిన ప్రకారం, ఈ రైలు ఏప్రిల్ 13 నుండి ప్రారంభమై ప్రతి ఆదివారం తిరుపతి నుండి, ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్ నుండి నడవనుంది. ఆధునిక కోచ్‌లతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సుఖవంత మైన ప్రయాణాన్ని అందించనున్న ఈ సేవ, రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌలభ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా చలసాని గాంధీ రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కొత్త రైలు సేవ ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులు సహా వివిధ వర్గాల ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం దువ్వాడ మీదుగా నడవనున్న ఈ రైలును ఉత్తరాంధ్ర ముఖద్వారమైన విశాఖ పట్నం మీదుగా నడిపితే మరింత మంది ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం – తిరుపతి మధ్య ఇప్పటికే నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని, రెండో రైలు కోసం చాలా కాలంగా ప్రజలనుండి డిమాండ్ ఉన్నదని గుర్తు చేశారు. కాబట్టి, కొత్తగా ప్రవేశపెడుతున్న హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను విశాఖపట్నం మీదుగా మళ్లిస్తే, ప్రయాణికుల రద్దీ తగ్గి, మరింత సౌకర్యవం తమైన సేవ అందించవచ్చని శ్రీ చలసాని గాంధీ గారు తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## కళాభారతిలో 12 నుంచి

# పైడా కౌషిక్ నాటకోత్సవాలు



**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ఈ నెల 12, 13, 14, 15, 16 తేదీల్లో పితాపురం కాలనీలోని కళా భారతిలో పైడా కౌషిక్ నాటకోత్సవములు నిర్వహిస్తున్నట్టు వి.ఎమ్.డి.ఎ. ట్రస్టీ నాటకోత్సవాల అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 21 సంవత్సరాలుగా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి మొత్తం 38 ఎంట్రీలు ఈ ఏడాది వచ్చాయని, వాటినన్నింటిని ప్రోగ్రాం కమిటీ సభ్యులందరూ అధ్యయనం చేసి 9 నాటికలను ఎంపిక చేశారని తెలిపారు. మొదటి నాలుగు రోజులు, రోజుకు రెండు నాటికలు, చివరి రోజు 1642026న ఒక నాటిక ప్రదర్శించబడి, ఆ తరువాత బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. వి.ఎమ్.డి.ఎ. ట్రస్టీ నాటకోత్సవాల ప్రధాన కార్యదర్శి డా.జి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ ఈ పోటీలలో నాటికలను ప్రదర్శించే స్థానికేతర సమాజముల వారికి ప్రదర్శన పారితోషికం రూ. 16,000లతో పాటు లోకల్ కన్వేయన్స్ నిమిత్తం రూ.4000లను అదనంగా అందజేస్తామని తెలిపారు. అలాగే ప్రదర్శన రోజున వారికి వసతి ఉచితంగా వసతి కల్పిస్తున్నామని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి, ఉత్తమ ప్రదర్శనకు రూ.20,000లు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.15,000లు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.12,000లు చతుర్థ ఉత్తమ ప్రదర్శనకు

మిగతా 8..లో

# సృష్టి క్షేత్రం నిర్మాణానికి అడ్డంకులు తొలగాలి

- శ్రీ దుర్గమల్లేశ్వరి ఆలయంలో విశేష పూజలు

**నర్సీపట్నం, ప్రభాతవార్త**





నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద ఖిసృష్టి క్షేత్రంఖి పేరిట ప్రతిష్టాత్మ కంగా నిర్మించతలపెట్టిన 108 అడుగుల శివపార్వతుల విగ్రహాల నిర్మాణానికి అడ్డంకులు తొలగాలని కోరుతూ శ్రీ దుర్గమల్లేశ్వరి స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహిం చారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంకల్పం తో ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపడు తున్న ఈ బృహత్తర కార్యక్రమానికి ఎలాంటి విఘ్నాలు కలగ కూడదని ఆకాంక్షిస్తూ.. దేవస్థానం చైర్మన్ జంప నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ జంప నాగరాజు మాట్లాడుతూ నర్సీపట్నంలో నిర్మిస్తున్న సృష్టి క్షేత్రానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్, వైఎస్సార్సీపీ నాయకులు దుష్ట శక్తుల్లా మారి అడ్డుతగులుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శిం చారు. 108 అడుగుల భారీ శివపార్వతుల విగ్రహాల ఏర్పాటుతో ఈ ప్రాంతం మహోన్నత ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, పర్యాటక కేంద్రంగా కూడా విశేషంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల కాలంలో నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారని, కానీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సంకల్పంతో కేవలం ఆరునెలల్లోనే ఆ పనులు పూర్తయ్యా యని గుర్తు చేశారు. సృష్టి క్షేత్రం వంటి పవిత్రమైన కార్యక్రమానికి ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తున్న అడ్డంకులు సత్వరమే తొలగిపోవాలన్న సదుద్దేశంతోనే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ong-8_ong-8.qxd 4/11/2026 12:56 AM Page 1



మొదటిపేజీ తరువాయిలు

## రేపట్టి తరానికి స్ఫూర్తి దాతలు.. బంగారు భవితకు మార్గదర్శకులు







సాయమందించారు.. పీ 4లో ఎలాంటి పాత్ర పోషించారో.. ఓ సారి తెలుసుకుందాం..గ్రామాలను దత్తత తీసుకుంటూ.. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ..దివిస్ ఫౌండేషన్, హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్, లుపిన్ ఫౌండేషన్, స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వంటి సంస్థలు సమాజ సేవలో విశేష పాత్ర పోషించగా, ఎన్‌టీపీసీ, ఐఓసిఎల్, కోరమాండల్ ఇంటర్నేషనల్, నాల్కో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ గంగవరం పోర్ట్ వంటి సంస్థలు ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకంగా సహకరించాయి. దివిస్ ఫౌండేషన్ భీమిలి నియోజకవర్గంలో చిప్పాడ గ్రామాన్ని దత్తత తీసుకొని ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత రంగాల్లో విశేష కార్యక్రమాలు కొనసాగిస్తోంది. దీని కోసం రూ.7 కోట్లను వ్యయం చేసింది. హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ సంస్థ గాజువాక నియోజకవర్గంలో 15 అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకుంది. లుపిన్ ఫౌండేషన్ అగనంపూడి ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కోసం రూ.18 లక్షలు అందించింది. స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ భీమిలి నియోజకవర్గంలో ఏటా రూ.15.7 లక్షలు వెచ్చిస్తూ స్కిల్ డెవలప్మెంట్, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించటంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఎన్‌టీపీసీ సంస్థ కింగ్ జార్జ్ ఆసుపత్రి అభివృద్ధికి రూ. 5 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందించగా, ఐఓసిఎల్ క్యాన్సర్ ఫౌండేషన్‌కు రూ. 97.5 లక్షల సహాయం అందించింది. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రూ. 3.6 కోట్ల వ్యయం చేసింది. నాల్కో సంస్థ క్షయవ్యాధి రోగులకు రూ.6.83 లక్షలతో పోషకాహార కిట్లు అందించగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బక్కన్నపాలెం వద్ద ఐటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.13.83 లక్షలు సమకూర్చింది. అదానీ గంగవరం పోర్ట్ సంస్థ కలెక్టరేట్ భవన మరమ్మత్తులకు రూ.50 లక్షలు సాయం రూపంలో ఖర్చు చేసింది. భీమిలి నియోజకవర్గంలో ధాన్ ఫౌండేషన్ యంగ్ ఇండియా, శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూషన్స్, మాజిక్ బస్ వంటి సంస్థలు విద్య, స్వచ్ఛత, యువత అభివృద్ధికి విశేష సేవలు అందించాయి. ముఖ్యంగా మాజిక్ బస్ సంస్థ 1700 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, 927 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రశంసనీయం. విస్కో సంస్థ బీసీ స్టడీ సర్కిల్ మరమ్మతుల కోసం రూ.10.50 లక్షల ఆర్థిక సహాయం అందించింది. పోర్టు, వేదాంత గ్రూప్ సంస్థలు తమదైన రీతిలో పేదరిక నిర్మూలను వివిధ కార్యక్రమాలు చేపట్టాయి. వీటితో పాటు పలు దాతలు వివిధ రూపాల్లో పేదరిక నిర్మూలనకు తమవంతు సాయమందించారు. కందులనాగరాజు కె.ఎస్.ఆర్. ఫౌండేషన్ ద్వారా దక్షిణ నియోజకవర్గంలో మహిళల సంక్షేమం కొరకు రూ.6.60 లక్షలు వెచ్చించారు. పీకే జోష్ అనే వ్యక్తి పశ్చిమ నియోజకవర్గంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జగన్మోహన్ అనే దాత భీమిలి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ కోసం రూ.5లక్షలు అందించారు. సూరిశెట్టి కిరణ్ కుమార్ ఉత్తర నియోజకవర్గంలో సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి రూ.15.7 లక్షలు సాయం చేశారు.ఇంతమంది మార్గదర్శకులు ముందుకు రావటం గర్వకారణం : డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లా ఇన్చార్జి మంత్రిప్రభుత్వ విధానాలు, ముఖ్యమంత్రి ఆలోచన, ఆశయాలకు అనుగుణంగా పీ4 కార్యక్రమంలో ఏడువేలు పైచిలుకు మంది చేరటం గర్వకారణం. విశాఖ జిల్లాలో 1.5 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించాం. వాటిలో 66,103 కుటుంబాలను ఇప్పటికే దత్తత తీసుకోవడం అభినందనీయం. 7,539 మంది మార్గదర్శకులు సమాజ సేవలో నిబద్ధతతో పనిచేస్తుండటం ప్రశంసనీయం. ఇంకా మిగిలిన కుటుంబాల దత్తత కోసం మరింత మంది మార్గదర్శకులు ముందుకు వస్తే.. శతశాతం ఫలితాలను సాధించగలుగుతాం. ప్రభుత్వం చూపిన మార్గదర్శకత్వం, జిల్లా అధికారుల చొరవ, దాతల ఉదారత కలిసివచ్చినప్పుడు సమాజంలో సార్థక మార్పులు సాధ్యమవుతాయని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

## డీఎస్ఎన్ఎల్ యూ ఫ్యాకల్టీ నీలిమ బొగాదికి అరుదైన అవకాశం

182ఎంట్రీల్లో భారత దేశం నుంచి షార్ట్ చేయబడిన ఏకైక వీడియో ఇదే కావడం విశేషం. ఆ వీడియో గేమ్ ఛేంజర్స్.. ఐపీ పవరింగ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ అన్నట్టుంది. మన దేశ ప్రాచీన యుద్ధ కళ ఖికలరిపయట్టుఖిను మేధో సంపత్తి హక్కుల ద్వారా ఎలా కాపాడుకోవచ్చో ఈ వీడియో వివరిస్తుంది. అదే విధంగా ఈ పోటీలో విజేతను ఖిహెచ్ టీపీపీఎస్://డబ్ల్యూఐపీడీ2026వీడియో కాంపిటేషన్. డబ్ల్యూపీవో. ఐఎన్టీ/ఎంట్రీ/ఓట్/ఈఎల్జెపీఎంఎల్ఓఓ ద్వారా ప్రజలు వేసే ఓటే ఈ వీడియోలకు బహుమతులు ప్రకటిస్తారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ 5ఓట్లు వేయవచ్చు. ఈ ఐదు ఓట్లను ఒకే వీడియోకు కూడా వేసే అవకాశం ఉందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6నుంచి 19వ తేదీ అర్ధరాత్రి వరకు ఓటేయొచ్చని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ పోటీలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక వీడియో ఇదేనని, భారతీయ వారసత్వానికి, మన ప్రాచీన క్రీడలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకు రావడానికి భారతీయులంతా ఓట్లేసి మద్దతు తెలపాలని డాక్టర్ నీలిమ ఆ ప్రకటనలో కోరారు. ఓటేసేందుకు పై లింక్ను పరిశీలించాలన్నారు. భారతీయ సంస్కృతిని ప్రపంచ వేదికపై గెలిపించేందుకు మీ వంతు మద్దతును అందిస్తారని ఆశిస్తున్నట్టు నీలిమ విజ్ఞప్తి చేశారు.

## కళాభారతిలో 12 నుంచి పైడా కౌశిక్ నాటకోత్సవాలు

రూ.10,000లు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఇదిగాక 12 వ్యక్తిగత బహుమతులు ఒక్కొక్కరికి రూ.1500లు, జ్ఞాపికలు అందజేయడంతో పాటు మూడు జ్యూరీ బహుమతులు ఒక్కొక్కరికి రూ.1000ల నగదుతో పాటు జ్ఞాపికలు అందిస్తామన్నారు. ప్రోత్సాహక బహుమతుల క్రింద నాటికలలో పాల్గొన్న ప్రతి బాల, నటీ నటులకు రూ.1000ల నగదుతో పాటు జ్ఞాపికలు బహూకరించబడతాయని తెలిపారు. ఈ పోటీలలో ప్రదర్శించిన ప్రతి నాటిక రచయిత, దర్శకుడికి మల్టీ కలర్డ్ లామినేటెడ్ సర్టిఫికెట్స్ లను నాటిక ప్రదర్శన అనంతరం, వేదిక మీద అతిథుల చేతుల మీదుగా అందజేయబడుతాయని వెల్లడించారు. నాటకోత్సవాల మహారాజపోషకులు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేల మీద ప్రఖ్యాతి గాంచిన ఈ నాటకోత్సవాలకు మహారాజ పోషకులుగా వుండటం తనకు సంతోషాన్ని కలిగిస్తోందని, రాబోయే కాలంలో కూడా ఈ నాటకోత్సవాల నిర్వహణకు తనవంతు సహాయ సహకారాలు ఇలాగే కొనసాగిస్తానని తెలిపారు. అన్ని రోజులు నాటికల ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని, వచ్చిన నాటక ప్రేక్షకులకు ప్రతిరోజు లాటరీ తీసి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఛీఫ్ అడ్వైజర్ ఆచార్య బాబివర్ధన్ మాట్లాడుతూ ఈ నాటకోత్సవాల విజయంలో పాత్రికేయుల పాత్ర చాలా విశిష్టమైనదని, ఈ ఉత్సవాల సమాచారాన్ని రెండు రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాల వారికి తెలియజేసే బాధ్యతను వారు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో నాటకోత్సవాల ఎగ్జిక్యూటివ్ కన్వీనర్స్ బొడ్డేటి జగ్గ్రావు, పి.నరసింగరావుతో పాటు ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## ప్రతీ హామీ నెరవేరుస్తాం.. అపోహలు వద్దు తర్లువాడ రైతులకు గంటా హామీ

పర్యావరణానికి హాని కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తప్పుడు ప్రచారం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొదటినుంచి ఎమ్మెల్యే అండగా ఉండడంతో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది రాలేదని వ్యాఖ్యానించారు. రైతుల తరపున వైసీపీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు మజ్జి వెంకట్రావు పాల్గొని డేటా సెంటర్ పనుల విషయంలో సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, ఏసీపీ అప్పలరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, బాలి అయ్యప్ప, బంకు రాజు, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో పాడేరు చెందిన మోర్యకు ప్రతిభ పురస్కారం

**పాడేరు,ఏప్రిల్10, ప్రభాతవార్త:**



అల్లూరి జిల్లా పాడేరు ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటి అరుదైన గుర్తింపును దక్కించుకున్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఖిటెక్నో కౌన్సిలర్ లిటరరీ మరియు స్పోర్ట్స్ ఫిష్ బెక్టగాన్ 2కె26ఖి కార్యక్రమంలో సిద్ధానాతి మోర్య అద్భుత ప్రదర్శన కనబరిచి ప్రతిభ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మోర్యకు ఆంధ్రప్రదేశ్ లీగల్ అండ్ సైబర్ క్రైమ్ ఐజీ రవికృష్ణ (ఐపీఎస్) చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికృష్ణ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందిస్తూ జ్ఞాపికను ప్రదానం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్రీడలు మరియు సాహిత్య రంగాల్లో విద్యార్థులు రాణించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని మోర్యను అభినందనలతో ముంచెత్తారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చి జాతీయ స్థాయి వేదికపై అవార్డు అందుకోవడం పట్ల స్థానిక ప్రజలు మరియు మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా కలెక్టర్ నిశాంతిని మర్యాదపూర్వకంగా కలిసిన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

**పాడేరు,ఏప్రిల్10, ప్రభాతవార్త**



అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ని పాడేరు ఎమ్మెల్యే,వైసిపి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించవలసిందిగా కలెక్టర్ ని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి ఆలయ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని మే 10.11.12 తేదీల్లో జరగ నున్న పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలను కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, కొణతాల ప్రశాంత్ , బోనగి వెంకటరమణ, కూడా సురేష్ కుమార్ , కురుస పార్వతమ్మ, లకే సత్యవతి, ఊర్వశి రాణి, మత్స్యరాస కిషోర్ కుమార్ రాజు పాల్గొన్నారు.

## ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలి

### - రోడ్డుపైకి ఇరువైపుల ఉన్న దుకాణాలు తొలగించాలి

**హుకుంపేట ఏప్రిల్ 10,ప్రభాత వార్త:**



మండలంలోని ఆటో యూనియన్ నాయకులు తమకు ఉన్న కనీస సదుపాయాలను కల్పించాలని కోరుతూ మండల తహసీల్దార్ వారికి, సర్కిల్ ఇన్స్పెక్టర్ వారికి మరియు పంచాయితీ సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు యూనియన్ పూర్వపు నాయకులు టి క్రిష్ణరావు ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు కె సూరి,డి మధు, కె గోవింద్ లు తెలపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 150200మందివరకు ఆదివాసి నిరుద్యోగులు ఆటోలు ద్వార స్వయం ఉపాధి పొందుతున్నారని అలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సబ్సిడీ పై రుణాలు ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా స్థానిక ఐటిడిఎ గాని, ప్రభుత్వం గానీ దృష్టి సారించి ట్రైకర్ రుణాలు అందించలేదన్నారు.ప్రైవేటు వడ్డీ వ్యాపారులు వద్దనుండి అధిక వడ్డీలతో అప్పులుచేసి సొంతంగా ఆటోలు కొనుక్కొని వాటిద్వారా జీవనోపాధి పొందుతున్నారని వారు తెలియజేశారు. మండలకేంద్రంలో ఆటోలు పార్కింగ్ కోసం స్థలం లేదన్నారు, స్థిరమైన సీరియల్ పాయింట్ కూడా లేకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే ఆటోలు పార్కింగ్ కోసం అలాగే సీరియల్ పాయింట్ కోసం స్థలం కేటాయించాలనీ వారు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోనీ వర్తకులు వారి వారి షాపుల్లోని సరుకులు ప్రధాన రోడ్డుపైకి ఇరువైపుల దుఃఖాణాలు పేర్చుకొని వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు.ఈ క్రమంలో ఏదేని ఆటో డ్రైవర్ కస్టమర్లను దించడమో,లేక ఎక్కించడమో చేస్తే పోలీసులు ప్రత్యక్షమై వారినే వాహనాలు పక్కకు తీయుమంటారు తప్పా రోడ్డుపై దుకాణాలు జోలికి వెళ్ళారని తక్షణమే రోడ్డుకీరువైపుల ఉన్న దుకాణాలు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ నాయకులు డ్రైవర్లు పాల్గొన్నారు

## నందివలస ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిలకు రక్తహీనతపై పరీక్షలు. డాక్టర్ పి.రాంబాబు

**డుంబ్రిగూడ: ఏప్రిల్: 10: (ప్రభాతవార్త)**



మండలంలోని అరమ పంచాయతీ పరిధిలోనున్న నందివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రక్తహీనతపై పరీక్షలు నిర్వహించడం జరిగిందని, స్థానిక వైద్యాధికారి పాంగి. రాంబాబు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి మండలంలోని నందివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కొలువుంటూ విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థినులకు శుక్రవారం పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. అయితే అక్కడి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థిని కు ఆర్ బి ఎస్ కే, రక్తహీనత, హెచ్ బి వంటి వ్యాధుల పై పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఆయన తెలిపారు. ఈ జీవికార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్ రావు శెట్టి., సిహెచ్ఓ హరిని ఏఎన్ఎం నీలిమ ఆశా కార్యకర్తలు, ఆ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లోతుగడ్డ పంచాయతీలో బూత్ అబ్జర్వర్ పసుపులేటి నాగమణి పర్యటన

**గూడెం కొత్తవీధి/చింతపల్లి ఏప్రిల్ 10 (ప్రభాతవార్త)**



చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీలో బూత్ అబ్జర్వర్ పసుపులేటి నాగమణి విస్తృతంగా పర్యటించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు, లోతుగడ్డలోని 67, 68 నంబర్ల బూత్‌ల పరిధిలో ఆమె పర్యటించి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే మన అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగమణితో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు చింతర్ల సునీల్ కుమార్ లోతుగడ్డ మాజీ సర్పంచ్, పాంగి బాబురావు ఎంపీటీసీ, భీమన్న క్లస్టర్ ఇంచార్జ్, పాంగి బాబురావు గ్రామ కమిటీ అధ్యక్షులు, బి. దుర్గాప్రసాద్ గ్రామ బీసీ సెల్ అధ్యక్షులు,కోర్ర నర్సింగరావు గ్రామ తెలుగు యువత అధ్యక్షులు, వీరితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వంచుల, జెర్రిల, మొండిగడ్డల్లో "స్వచ్ఛ భారత్ స్పెషల్ డ్రైవ్"

**గూడెం కొత్తవీధి ఏప్రిల్ 10 (ప్రభాతవార్త)**



మండలంలో వంచుల, జెర్రిల, మొండిగడ్డ గ్రామాల్లో నిర్వహించిన "స్వచ్ఛ భారత్ స్పెషల్ డ్రైవ్" గురించి ఎం.పి.డి.ఓ రమణ బాబు ఇంటింటికి తిరిగి తడి చెత్త మరియు పొడి చెత్తను వేరువేరుగా సేకరించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్, పాత బట్టలు, ఐరన్ స్క్రాప్, అట్టపెట్టెలు మరియు గాజు సీసాల వంటి పొడి చెత్తను ఖిస్వచ్ఛ రథంఖి వాహనానికి అప్పగించాలని సూచించారు. తడి చెత్తను క్లాప్ మిత్రులకు అందించాలి. దీనిని సంపద కేంద్రాలకు తరలించి, అక్కడ సేంద్రీయ ఎరువుగా తయారు చేస్తారు. పొడి చెత్తను ఇచ్చినప్పుడు, దానికి బదులుగా అవసరమైన వస్తువులను పొందవచ్చు లేదా కిలో లెక్కన నగదును కూడా తీసుకోవచ్చు. తయారైన ఎరువులను తిరిగి ప్రజలకు అందించడం ద్వారా సారవంతమైన పంటలు పండించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ రమణ బాబు, డిప్యూటీ ఎం.పి.డి.ఓ (బాలకృష్ణ) మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి రోడ్లపై చెత్త వేయకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

## దానిరంగిని గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

**అరకులోయ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**



అరకులోయ మండలంలోని దానిరంగిని గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం పాడేరు గ్రీవెన్స్ లో మహిళలు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. అరకులోయ మండలం లోని మాడగడ పంచాయతీ దానిరంగిని గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా వేసిన బోరు పూర్తి చేయకుండా అసంపూర్తిగా ఉండడం తో గ్రామంలో మంచినీరు సమస్య తీవ్రంగా ఏర్పడుతుందని మహిళలు పాడేరు ప్రజావాణికి చేరుకొని ఫిర్యాదు చేసారు. మండల స్థాయి అధికారులు ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడంతో జిల్లా సంబంధికారులకు కలిసి సమస్య పరిష్కారం చేయాలని విన్నవించినట్లు తెలిపారు. దాని రంగిని మహిళలు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మంచినీరు సమస్య సత్వరమే పరిష్కారం చేయకపోతే నిరసన కార్యక్రమానికి బిందెలు తో సిద్ధమవుతామని అన్నారు. వేసవికాలం కావడంతో నీటి ఎద్దడి తీవ్రంగా ఎదుర్కొంటున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక దఫాలుగా మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని వినతులు ఇస్తున్నా నామమాత్రంగా సమస్య పరిష్కారానికి సహకరిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పంచాయతీ నాయకులు ఎస్. సత్యారావు టి. దామోదర్, బాబురావు, రంభమని, ధనముత్తి, జమున, నొయిన, రాములమ్మ, సుమంతి, మాలతి, హరి, ప్రమీల , లక్ష్మి,కమల తదితరులు పాల్గొన్నారు.

## సీలేరులో ఘనంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం

### - వైద్యాధికారి డాక్టర్ సృజనారాయ్

**గూడెం కొత్తవీధి/సీలేరు, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త)**



వివిధ వ్యాధులను నయం చేసే హోమియోపతి వైద్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సీలేరు హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ సృజనారాయ్ అన్నారు. శుక్రవారం గూడెం కొత్తవీధి మండలం సీలేరులో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని (హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి) పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజనారాయ్ మాట్లాడుతూ హోమియోపతి వైద్యంలోని విశిష్టతలను వివరించారు: సమగ్ర చికిత్స: హోమియోపతి కేవలం వ్యాధికి మాత్రమే కాకుండా, వ్యక్తి యొక్క శారీరక, మానసిక స్థితిగతులను మరియు భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని ఖిసంపూర్ణ వ్యక్తికిఖి చికిత్స అందిస్తుంది. సురక్షితం : ఈ మందులు అత్యంత సున్నితమైనవి మరియు విషరహితమైనవి. ఎటువంటి దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్ ) ఉండవు కాబట్టి శిశువులు, గర్భిణీలు మరియు వృద్ధులకు ఇవి ఎంతో సురక్షితం.దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం : అలెర్జీలు, చర్మ వ్యాధులు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) వంటి దీర్ఘకాలిక సమస్యలను హోమియోపతి సమర్థవంతంగా నయం చేస్తుంది.అందుబాటులో వైద్యం : సాధారణ జలుబు, జ్వరం నుంచి క్యాన్సర్ చికిత్సలో కలిగే దుష్ప్రభావాలను తగ్గించడం వరకు హోమియోపతి తోడ్పడుతుంది. పైగా ఇది తక్కువ ఖర్చుతో కూడిన వైద్య విధానం. ఈ కార్యక్రమంలో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్టాఫ్ నర్స్ హేమ, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఫార్మాసిస్ట్ సాయి, హెల్త్ సెక్రటరీ గౌరీ, ఆశా కార్యకర్తలు వసంత, తులసి, దోయిమోతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నూకాంబిక జాతరలో నృత్యాల హంగామా...

**అనకాపల్లి,ఏప్రిల్ 10;( ప్రభాత వార్త)**



ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ నూకాంబిక రాష్ట్ర జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్ మైదానంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో, జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కి పర్యవేక్షణలో జాతర వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు.జాతరలో భాగంగా శుక్రవారం పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆనందోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం కళాకారులైన రాజేష్ శ్యామల డాన్స్ అకాడమీ, కృతిపూడి బృందాల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే శ్రీ సిద్ధేంద్ర యోగి కళానిలయం కళాకారుల నృత్యాలు సభను ఉత్సాహభరితంగా మార్చాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొణతాల రత్నకుమారి, రమణాజీ, అగ్రహారం ఆశ, దొండ కుసుమ, శనివాడ లక్ష్మి, రెడ్డి ధనలక్ష్మి, చద్రావతి, బుద్ధ చంద్రవాణి, సాలాపు సంధ్య, కుక్కల సత్యవాణి పాల్గొన్నారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, కళాకారులను ప్రశంసా పాత్రలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీలా నాగ శీను, ఈవో శ్రీధర్, ధర్మకర్తల మండల సభ్యులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ లు తిమ్మ పాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, మరియు గండేపల్లి మురళి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు


SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SME సెంటర్, కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్, మహారాణిపేట, విశాఖపట్నం జిల్లా-530002

**ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం**

ఋణగ్రహీత పేరు : ధనాల సురేంద్ర కుమార్

| రిజిస్ట్రేషన్ నెం. | కంపెనీ / ఫ్యూయల్ | మోడల్/కలర్ | కిలోమీటర్లు | రిజర్వు ధర | ధరావత్తు |
|---|---|---|---|---|---|
| AP 39 US 2269 | MARUTI DZIRE VXI / PETROL | 2023/ PEARL ARCTIC WHITE | 32001 | రూ. 4,60,000/- | రూ. 46,000/- |

ఇ-వేలం తేది మరియు సమయం : 29-04-2026 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 12.00 గం॥ల వరకు

బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం :28-04-2026 సా॥ 04.00 గం॥లకు

బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.5,000/-లతో గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) వాహనమును "ఎక్కడ ఎలా వున్నది అక్కడ" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకరణతో ఆధార్ కార్డు / ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా కాపీ జతపరచవలెను. అవి లేనిచో బిడ్డు తిరస్కరణకు గురికాగలదు. 5) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 6) తేది. 15-04-2026 నుండి 28-04-2026 వరకు బ్యాంక్ పనివేళలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ యూనిట్, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్ దగ్గర, విశాఖపట్నం వద్ద తనిఖీ చేసుకోగలరు. వాహనము తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబరు: 8019416342, 9630834566. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: + 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.

తేది : 10-04-2026, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, SBI, SMEC, విశాఖపట్నం

## గారా సత్యనారాయణకు డాక్టరేట్
### - సోషల్ సర్వీసెస్ కోటాలో ఏసియన్ యూనివర్శిటీ అందజేత

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



నగరానికి చెందిన వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగి గారా సత్యనారాయణ సోషల్ సర్వీస్,రూరల్ ప్రాంతాల్లో గారా చారిటబుల్ ట్రస్టు ద్వారా చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తుగా ఏసియన్ యూనివర్శిటీ సంస్థ గోవాలో సోషల్ సర్వీసెస్ డాక్టరేట్‌ను అందించింది. గోవాలోని ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం రావత్ కామత్ చేతుల మీదుగా ఈ డాక్టరేట్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 32 యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు. అయితే సత్యనారాయణ నగరంలోనే అంబేద్కర్ భవన్ ద్వారా పేద విద్యార్థుల చదువుకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆరోగ్యశాఖలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విశేష సేవలందించారు. తన ట్రస్టు ద్వారా పేద ప్రజలకు నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఆయన సేవలను గుర్తించిన ఈ సంస్థ సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించడంతో వారి కుటుంబ సభ్యులు, అభిమానులు, వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగులు పలువురు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ఈ ఏడాది ఖరీఫ్‌లో వేయనున్న పంటలపై శాస్త్రవేత్తలు,రైతులు చర్చాగోష్ఠి

**పద్మనాభం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**





మండల కాంప్లెక్స్ లో ఉన్న వెలుగు కార్యాలయంలో శుక్రవారం భీమిలి డివిజన్ స్థాయిలో ఎలినినో కారణంగా రానున్న ఖరీఫ్‌లో వేయనున్న పలు రాకాల పంటల సాగుపై శాస్త్రవేత్తలు, రైతులు చర్చాగోష్ఠి కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషు విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త ఎన్ రాజుకుమార్,సౌజన్య, ఎడిఎ విజయప్రసాదు, మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న ఎనిలినో ప్రభావంతో ఏర్పడనున్న వర్షాబావ పరిస్తితులలో దీర్ఘకాలిక పంటలు కాకుండా స్వల్పకాలిక పంటలను సాగుచేసుకోవాలని వారు రైతులకు సూచించారు. తక్కువ నీటితో పండే కొర్రలు, గంటిలు, సజ్జలు తదితర పంటలను వెయ్యాలని కోరారు. అలాగే ఈ నెలలో వెయ్యనున్న నువ్వుల పంట యాజమాన్య పద్దతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ ఒ లు సింహాచలం, శివకోమలి, సంద్యారత్నప్రభ, శశికల, రైతులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా అండిబోయిన లక్ష్మీ

**గాజువాక,ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



గాజువాక బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా అండిబోయిన లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. గత 14 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న లక్ష్మి, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తూ గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తోటి న్యాయవాదులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మహిళా న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. లక్ష్మి ఎన్నిక పట్ల పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ఘనంగా అభినందించారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం

**గాజువాక,ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



పెన్షనర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని పారిశ్రామిక ప్రాంత ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మల్కాపురంలో సిపిఎం కార్యాలయంలో సిహెచ్. అమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కె. నూకరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. హుస్సేన్ మాట్లాడారు. మే 10 లేదా 17 తేదీల్లో గాజువాకలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్, వైద్య సదుపాయం, హయ్యర్ పెన్షన్ అంశాలపై యాజమాన్యానికి వినతిపత్రం అందజేశామని, అవసరమైతే కోర్టును ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన

**గాజువాక, ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



ఆర్టీసీ సిబ్బంది తమ ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు సూచించారు. గాజువాక డిపో వద్ద శుక్రవారం డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందికి నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య బృందాలు సిబ్బందికి పలు ఆరోగ్య సూత్రాలపై శిక్షణ ఇచ్చాయి. విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలితే అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా అందించాలో సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం 108 సాయంతో బాధితులను ఆసుపత్రికి తరలించే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, వైద్యులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయి జీతాల కోసం క్లాప్ ఆటో కార్మికుల ధర్నా

**గాజువాక, ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద క్లాప్ ఆటో కార్మికులు శుక్రవారం మెరుపు నిరసన చేపట్టారు. ఉదయాన్నే విధులను బహిష్కరించడంతో చెత్త తరలింపు వాహనాలు నిలిచిపోయాయి. కార్మికులకు మద్దతుగా సిఐటియు నేతలు గొలగాని అప్పారావు, పి.మణి పాల్గొని మాట్లాడారు. ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్ స్పందిస్తూ.. వారం రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు. అనంతరం పి.మణి మాట్లాడుతూ.. కాలుష్య నివారణ కోసం 12న వైజంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

## సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న సినీ నటులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**



నగరంలోని ఆశీలమెట్ట జంక్షన్ సమీపంలో ఉన్న సంపత్ వినాయగర్ ను శుక్రవారం రాత్రి డెకైట్ హీరో అడవి శేషు, మృనాల్ ఠాకూర్ తదితరులు దర్శించుకున్నారు.

# గ్యాస్ బండ్ల దందా మంటలు..!

- బుకింగ్‌లకు బ్రేక్.. బ్లాక్‌కు గ్రీన్ సిగ్నల్?
- మధురవాడలో బ్లాక్ మార్కెట్ విస్తృతింపు
- బుక్ చేసిన వారికి 15 రోజుల నిరీక్షణ
- దళారుల వద్ద పదుల సంఖ్యలో సిలిండర్ల నిల్వ
- హోటల్స్, దుకాణాలకు అధిక ధరలకు విక్రయం
- బ్యాక్‌లాగ్ అంటున్న గ్యాస్ ఏజెన్సీలు..
- ఫీల్డ్‌లో భిన్న పరిస్థితులు
- పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ దృష్టి సారించాలని ప్రజల డిమాండ్




**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త):**

అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం దేశంలో ఇంధన సరఫరాపై పడుతుండగా, అదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని గ్యాస్ బండ్ల బ్లాక్ మార్కెట్ దందా విస్తరిస్తోంది. ఒకవైపు సామాన్య ప్రజలు గ్యాస్ కోసం రోజుల తరబడి వేచి చూస్తుంటే, మరోవైపు దళారులు మాత్రం భారీగా సిలిండర్లు నిల్వ చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.విశాఖపట్నం నగర పరిధిలోని మధురవాడ ప్రాంతంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని వినియోగదారులు చెబుతున్నారు. గ్యాస్ బుక్ చేసిన తర్వాత సాధారణంగా 2 నుంచి 5 రోజుల్లో డెలివరీ కావాల్సి ఉన్నా, ప్రస్తుతం 15 నుండి 20 రోజుల వరకు ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వినియోగదారులు 20 రోజులు గడిచినా సిలిండర్ అందక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ బండ్ల ధరలు అమాంతం పెరిగి రూ.4000 నుంచి రూ.6000 వరకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు పదుల సంఖ్యలో సిలిండర్లు నిల్వ చేసుకుని అవసరాన్ని ఆసరాగా చేసుకుని యథేచ్ఛగా విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కొంతమంది కిరాణా దుకాణాలు, టిఫిన్ సెంటర్లు వద్ద కూడా ఈ సిలిండర్లు అధిక ధరలకు లభించడం సర్వసాధారణంగా మారింది. బుక్ చేసిన సిలిండర్లు వినియోగదారులకు అందకపోయినా, అదే సిలిండర్లు ఇతరులకు విక్రయమవుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డెలివరీ బాయ్స్ ఇంట్లో ఎవరూ లేరు అడ్రస్ దొరకలేదు వంటి కారణాలు చూపించి సిలిండర్లను తిరిగి తీసుకెళ్లి, తరువాత అధిక ధరలకు విక్రయిస్తున్న ఘటనలు ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కొంతమంది వినియోగదారులు బుక్ చేసిన గ్యాస్‌ను తీసుకోకపోతే, వాటిని సిస్టంలో నమోదు చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు మళ్లిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.ముఖ్యంగా మధురవాడలోని కొమ్మాది శివశక్తి నగర్ రోడ్డులో ఉన్న "దివ్య లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీలో ఈ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెలివరీ సిబ్బంది సిలిండర్లను అనధికారికంగా హోటల్స్, వ్యాపారులకు విక్రయిస్తూ భారీగా లాభాలు పొందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.దేశంలోని పలు నగరాల్లో కూడా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తుండటం గమనార్హం. "ఘోస్ట్ డెలివరీల్లు, అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలు, డీలర్లు-డెలివరీ సిబ్బంది కుమ్మక్కై బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్న ఘటనలపై జాతీయ స్థాయిలో వార్తలు వస్తున్నాయి. దీంతో గ్యాస్ సరఫరా వ్యవస్థలో లోపాలపై ఆందోళన వ్యక్తమవుతోంది.ఇంత జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు నిమ్మక నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దళారులు బహిరంగంగా సిలిండర్లు నిల్వ చేసుకుని విక్రయిస్తున్నా, తనిఖీలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. వంటగ్యాస్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు, మరోవైపు అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ ప్రజలు కోరుకుంటున్నారు..పౌర సరఫరాల శాఖతో పాటు లీగల్ మెట్రాలజీ అధికారులు కూడా రంగంలోకి దింపి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ బండ్ల బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా అరికట్టి, సరఫరాలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఈ దందాపై వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వినియోగదారుల రక్షణకు అమెజాన్ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్

**ఆరిలోవ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

నకిలీ వస్తువుల నుండి వినియోగదారులను, బ్రాండ్లను రక్షించాలనే తన ప్రపంచ స్థాయి నిబద్ధతలో భాగంగా అమెజాన్ తమ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్‌ను (సి సి యు) భారత దేశానికి విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విభాగం అమెజాన్‌కు చెందిన స్థానిక నిపుణులను ఒక చోటకు చేర్చి భారతీయ బ్రాండ్లు అమ్మకదారులు, పోలీసు విభాగాలతో కలిసి పనిచేస్తుంది. భారత దేశానికి కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్ విస్తరణ అనేది అమెజాన్ ఇండియాలో (అమెజాన్.ఇన్) కస్టమర్లు, అమ్మకందారుల రక్షణ పట్ల సంస్థకు ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. కస్టమర్లను, బ్రాండ్లను నకిలీ వస్తువుల నుండి రక్షించడం అనేది మా స్టోర్‌పై నమ్మకాన్ని నిలబెట్టడానికి విక్రయదారులను కాపాడటానికి చాలా ముఖ్యం" అని అమెజాన్ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్ డైరెక్టర్ కెబారు స్మిత్ పేర్కొన్నారు. నకిలీ వస్తువులకు వ్యతిరేకంగా తాము ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న పోరాటం వల్ల మిలియన్ల కొద్దీ డాలర్ల నష్టాన్ని నివారించగలిగామని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4సి) భాగస్వామ్యంతో ఇప్పటికే చేపట్టిన స్కామ్ స్మార్ట్ ఇండియా వంటి కార్యక్రమాలకు ఈ కొత్త ప్రయత్నం మరింత బలాన్ని చేకూరుస్తుంది.

## అభివృద్ధి దిశగా పెంపుడు జంతువుల సంరక్షణ ఆర్థిక వ్యవస్థ

**ఆరిలోవ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ప్రస్తుత రోజుల్లో ఇళ్లలో పెంపుడు జంతువులను కుటుంబ సభ్యుల్లా ప్రేమిస్తూ, సంరక్షిస్తూ, పోషిస్తున్నారు. ఈ గాఢమైన భావోద్వేగ బంధం భారతదేశం అంతటా "పెట్ పేరెంట్స్ వృద్ధికి అద్దం పడుతోంది. ఈ మార్పు కేవలం భావోద్వేగపరమైనది మాత్రమే కాదు. ప్రజలు తమ రోజువారీ జీవితంలో ఎలా షాపింగ్ చేస్తున్నారు, ఖర్చు చేస్తున్నారు, తమ పెంపుడు జంతువుల శ్రేయస్సుకు ఎలా ప్రాధాన్యత ఇస్తున్నారు అనే దానిలోనూ ఇది ప్రతిబింబిస్తుంది. భారతదేశపు పెంపుడు జంతువుల సంరక్షణ పరిశ్రమపై ఐ బి ఈ ఎఫ్ రిపోర్ట్ ప్రకారం, పెరుగుతున్న ఖర్చు చేయగల ఆదాయాలు, పట్టణ జీవనశైలి, పెంపుడు జంతువుల శ్రేయస్సుపై బలమైన దృష్టి కారణంగా ఈ రంగం దాదాపు 20 శాతం వృద్ధిని సాధిస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌లో, పెంపుడు జంతువుల సంరక్షణ పట్ల పెరుగుతున్న, జీవనశైలి ఆధారిత విధానంలో ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విభాగం 50శాతం కంటే వార్షిక వృద్ధిని సాధిస్తోంది. కుక్కలు, పిల్లుల నుండి చేపలు, పక్షులు, ఇతర పెంపుడు జంతువుల వరకు, వినియోగదారులు రోజువారీ అవసరాల నుంచి ప్రీమియం ప్రత్యేక ఉత్పత్తుల వరకు అన్నింటికీ ఈ ప్లాట్‌ఫామ్‌ను ఒక ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు. నేడు జెన్ జీ, మిలీనియల్ వినియోగదారులు ఫ్లిప్‌కార్ట్‌లోని మొత్తం డిమాండ్‌లో 80 శాతం కంటే వాటాను కలిగి ఉన్నారు. వీరు పెంపుడు జంతువుల సంరక్షణ పట్ల మరింత అవగాహన కలిగిన, పరిణతి చెందిన దృక్పథాన్ని తీసుకువస్తున్నారు. బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలు కీలక డిమాండ్ కేంద్రాలుగా ఆవిర్భవిస్తున్నాయి.

## విశాఖ ట్రాఫిక్ ఏసీపీగా సిహెచ్ రవికాంత్ నియామకం

**(విశాఖక్రైం, ప్రభాతవార్త)**






రాష్ట్ర పోలీసు శాఖలో పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయి. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫార్సుల మేరకు పలువురు డీఎస్పీలకు బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ క్రమంలో డీఎస్పీగా ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న సిహెచ్ రవి కాంత్‌ను విశాఖపట్నం ట్రాఫిక్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా బదిలీ చేశారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న ఎస్. వాసుదేవ్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.ఇదే ఉత్తర్వుల్లో భాగంగా మరికొంతమంది అధికారులకు కూడా బదిలీలు చేపట్టారు. పోలీసు శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందిం చేందుకు ఈ మార్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.సంబంధిత అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## విశాఖలో హెచ్‌సీలు, పీసీల బదిలీలు

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**

నగర పోలీసు కమిషనరేట్‌లో సివిల్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుళ్లు , పోలీసు కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. సంబంధిత సిబ్బంది అభ్యర్థనల మేరకు ఈ మార్పులు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఉత్తర్వుల ప్రకారం ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ చి. లోవ రాజును ద్వారకా లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే పెందుర్తి లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్. నూకరాజును మహిలా పోలీస్ స్టేషన్‌కు పంపించారు. ఇక టూ టౌన్ సీసీఎస్‌లో ఉన్న కె. శంకర్‌ను, త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో పనిచేస్తున్న ఎం. సురేష్ కుమార్‌ను, భీమిలి క్రైమ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎం. రాజేష్‌ను కూడా మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే తమ కొత్త స్థానాల్లో హాజరుకావాలని, సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు.

## ఆరిలోవ లో టీబీ ముక్త భారత్ అభినయ కార్యక్రమం

**ఆరిలోవ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

జాతీయ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు ఆరిలోవ ఎర్ని దుర్గా నగర్ లో అధ్యక్షులు పి ఐ బాలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ హరిత (డబ్ల్యూ హెచ్ ఎస్ ) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స ను తెలియజేశారు. రెండు వారాల మించి జ్వరం ఉన్నట్లయితే, అదేవిధంగా కఫంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం వంటివి టీవీ వ్యాధి లక్షణాలని అవగాహన కార్యక్రమంలో తెలియజేశారు. టీవీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయిలో మెరిసిన ఎన్‌బిఎమ్ విద్యార్థి

- పవర్ లిఫ్టింగ్‌లో భవాని ప్రసాద్‌కు స్వర్ణ విజయం
- విశాఖలో జరిగిన ఏపీ స్టేట్ పోటీల్లో ఘనత
- డెడ్‌లిఫ్ట్‌లో 210 కేజీలతో అద్భుత ప్రదర్శన
- కళాశాలలో ఘన సన్మానం
- డీన్, ప్రిన్సిపల్ అభినందనలు..విద్యార్థులకు స్ఫూర్తి
- క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని పిలుపు

**(విశాఖపట్నం, ప్రభాతవార్త)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్.బి.ఎమ్ లా కళాశాల విద్యార్థి వి. భవాని ప్రసాద్ ప్రతిభ చాటుతూ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. 2026 సంవత్సరానికి సంబంధించిన ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించిన డెడ్‌లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో ఆయన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు.విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మార్చి 28, 29 తేదీలలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించగా, 105 కేజీల మాస్టర్స్ విభాగంలో భవాని ప్రసాద్ తొలి స్థానం సాధించారు. అదే విభాగంలో 210 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తి ప్రత్యేకంగా నిలిచారు. ఈ విజయానికి గుర్తింపుగా ఆయన్ను మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరించారు.ఈ సందర్భంగా శుక్రవారం ఎన్.బి.ఎమ్ లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డీన్ రమణ, ప్రిన్సిపల్ గాయత్రి చేతుల మీదుగా భవాని ప్రసాద్‌కు సర్టిఫికెట్ అందజేసి, బంగారు పతకాన్ని ప్రదానం చేశారు.డీన్ రమణ మాట్లాడుతూ, క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం గర్వకారణమని, క్రమశిక్షణతో ముందుకు సాగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించే అవకాశం ఉందని అభినందించారు. ప్రిన్సిపల్ గాయత్రి మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం సమగ్ర అభివృద్ధికి దోహదమని పేర్కొన్నారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు భవాని ప్రసాద్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

**మాధవధార, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



వ్యాపారుల మోసాలకు పలువురు వినియోగదారులు బలవుతున్నారని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్.ఎస్.రామానుజ స్వామి తెలిపారు. మురళీనగర్ లో గల సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించకుండా పలు సంస్థలు, వాపార వర్గాలు ప్రజల నుంచి అక్రమంగా అధిక ధరలకు తమ వస్తువులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. తమ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు కూడా ఏ వస్తువు కొన్న బిల్లు తీసుకోకపోవడం వ్యాపారాలకు అనుకూలంగా మారిందన్నారు. బిల్లు ఇవ్వకపోతే ఆయా వ్యాపార సంస్థలు ప్రభుత్వానికి జిఎస్టీ ఎగ్గొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయం తాము ప్రజలను చైతన్యం చేసేందుకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. పలువురు వినియోగదారులకు న్యాయ సహాయం చేసినట్లు వెల్లడించారు. ఏ వస్తువు కొనుగోలు చేసిన తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. నిర్విరామ సేవా కార్యక్రమాలు, ఎంతోమందికి తను చేసే మంచి కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తూ, సేవా రంగంలో మంచి గుర్తింపు పొందిన తమ సంస్థ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ గారా సత్యనారాయణ గోవాలో డాక్టర్ తీసుకోవడం అభినంద నీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ డాక్టర్ గారా సత్యనారాయణ, సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ మార్టిన్ ఫేరీరా, సౌత్ ఇండియన్ వైస్ చైర్మన్ డాక్టర్ రజనీకాంత్, సౌత్ ఇండియా ఆర్గనైజేషన్ సెక్రటరీ డి.దేముడు, అనకాపల్లి జిల్లా చైర్మన్ డాక్టర్ శేషు కుమార్ పాల్గొన్నారు.

## చందనోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష
### - కళ్యాణమండపాల ప్రారంభోత్సవం ఈఓ జె. వెంకట్రావు

**సింహాచలం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక చందనోత్సవ (ఏప్రిల్ 20న) ఏర్పాట్లపై శనివారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, మరియు కమిషనర్, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పాల్గొని ఉత్సవ ఏర్పాట్లపై చర్చించనున్నారు. ఉదయం 11:30 గంటలకు కలెక్టరేట్‌లో మంత్రుల బృందం మరియు అధికారులతో కలిసి చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు. సమీక్ష అనంతరం కొండపైన భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను మంత్రుల బృందము పరిశీలిస్తారు. ముఖ్యంగా ఎండ తీవ్రత దృష్ట్యా క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది కలగకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, స్కానింగ్ పాయింట్ల వద్ద సిబ్బంది కేటాయింపు, ఎంట్రన్స్ పాయింట్ల వద్ద రద్దీ నియంత్రణ చర్యలను సమీక్షిస్తారు. అనంతరము మధ్యాహ్నం 3:00 గంటలకు సింహాచలం దేవస్థానం వారిచే కొండ దిగువన శ్రీనివాసనగర్‌లో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాలను మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

## ఎన్ ఏ డి పరిధిలో నేడు పవర్ కట్

**మాధవధార :ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ లో తేన్నేటి నగర్,కరసా,సీతన్న గార్డెన్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం నాడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ 2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.దీంతో తేన్నేటి నగర్, కనక దుర్గ కళ్యాణ మండపం,సమాజం, గాయత్రి స్కూల్, సీతన్న గార్డెన్స్, నరసింహ నగర్,విద్య నగర్, ఎం ఎన్ ఆర్ పార్క్,ఓల్డ్ కరసా,న్యూ కరసా, ఎన్ ఏ డి, సాయిబాబా గుడి,రామాలయం గుడి పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

vsp10:vsp10.qxd 10-04-2026 22:48 Page 1






## నూతన పంచాయతీ కార్యదర్శిని కలిసిన గోవిందరావు



గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని సంకాడ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రాజుబాబును టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలగుచ్ఛం అందజేసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల పరిస్థితిని, స్థానిక అంశాలను కార్యదర్శికి వివరించారు. యూనిట్ ఇన్‌చార్జ్ మామిడి చంటిబాబు, పిసా (శిశీతి) ఉపాధ్యక్షులు సద్ద బొజ్జిపడల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సృష్టి క్షేత్రం నిర్మాణానికి ఆటంకాలు తొలగాలని పూజలు



నర్సీపట్నం,ఏప్రిల్ 10, ప్రభాతవార్త: నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద సృష్టి క్షేత్రం పేరిట ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 108 అడుగుల శివపార్వతుల విగ్రహాల నిర్మాణానికి అడ్డంకులు తొలగాలని కోరుతూ శ్రీదుర్గామల్లేశ్వరి స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ జంపెన నాగేంద్రరాజు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ మాట్లాడుతూ నర్సీపట్నంలో నిర్మిస్తున్న సృష్టి క్షేత్రానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, వైసీపీ నాయకులు దుష్టశక్తుల్లా మారి అడ్డు తగులుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్యక్రమంలో నర్సీపట్నం టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మూడు లారీలు సీజ్




(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): నక్కపల్లి టోల్ ప్లాజాను తప్పించుకుని ఇతర రహదారి మార్గాల ద్వారా వెళుతున్న భారీ వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న భారీ వాహనాలు శుక్రవారం చట్టపరమైన చర్యలు నిమిత్తం ఆర్టీవోకు అప్పగించారు. సిఐ మురళి,ఎస్సై సన్నీ బాబులు మాట్లాడుతూ మండలంలోని ఉపమాక ప్రాంతం నుంచి వేంపాడు మీదిగా ఈ విధంగా భారీ వాహనాలు ఈ రహదారిలో వెళితే చర్యలు తప్పు అని హెచ్చరించారు.

## రోడ్డు మధ్యలో గుంతలు.. పట్టించుకోని అధికారులు





ఎలమంచిలి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు డ్రైనేజీలు నిర్మాణాలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్న స్థానిక 8, 7 వార్డులు మధ్యలో గొల్ల వీధి రోడ్డు మధ్యలో కల్వర్టుకు రంధ్రం పడి ఉన్న ఇప్పటికీ అధికారులు పట్టించుకోలేదంటూ ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప కల్వర్టు నిర్మాణ పనులు మాత్రం చేపట్టడం లేదని మరి ఎవరికి చెబితే ఈ నిర్మాణ పనులు చేపడతారో ఆ ప్రాంత ప్రజలకు అర్థం అవటం లేదు. మున్సిపాలిటీలో అధికారులు అవసరమైన చోటు తప్ప అవసరం లేని చోటు నిర్మాణ పనులు కాలవనిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్డు వేసిన దాని మీదే కూడా రోడ్లు వేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఎర్రవరం కాలువ నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఆ కాలువ నిర్మాణ పనులను ప్రవేశించే అధికారులు కరువయ్యారు అనేది ఆ కాలువ నిర్మాణం చూస్తేనే అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మధ్యలో రంధ్రం పడిన కల్వర్టుకు వెంటనే నిర్మాణం పనులు చేపట్టాలని, ఎన్టీఆర్ కాలనీలో కూడా కల్వర్టునిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాదర్బార్‌లో ప్రతి సమస్యకూ పరిష్కారం : సియ్యారి



అరకులోయ, ఏప్రిల్ 10, ప్రభాత వార్త : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు అనూహ్య స్పందన లభిస్తుందని, ఇక్కడికి వచ్చే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ప్రజల్లో పెరిగిందని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు అరకులోయ లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కు వచ్చే ప్రతి సమస్యకూ పరిష్కారం చూపారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి గెమ్మెలి బిమల, పార్లమెంట్ టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు శంకర్ నాయుడు, అరకువేలి ఎస్ టి సెల్ అధ్యక్షులు బురిడీ కొములు నాయుడు, ప్రధానకార్యదర్శి కొర్ర సంతోష్, టి ఎన్ టి యు సి అధ్యక్షులు తాంగుల రాజకుమార్, అరకులోయ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనంద్, పెదలబుడు మాజీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, నాయకులు పాడి బాలన్న,, సోమెలి లక్ష్మయ్య, వి ఈశ్వర్ రావు, సుబ్బారావు, కృష్ణారావు, పెదలబుడు మాజీ ఎంపీటీసీ కిల్లో కుమార్, కుంతురు సుబ్బారావు, రాంబాబు, కొర్ర సుబ్బారావు, వంతల వెంకట్ రావు, పాంగి భగత్ రామ్, సిరాగం, పూజారి మాణిక్యం, బోయి దామోదర్, పూజారి లక్ష్మినారాయణ, కొర్ర శేఖర్, కిల్లో నాగరాజు, కిల్లో మోహన్ దాస్, కొర్ర బాలరాజు, జన్ని సీతారాం, కర్రిబాబు, దుంబరి లచ్చన్న, రాజారావు, వంతలా బుద్దు, పాంగి కిరణ్, కొర్ర ఓనోతి రామ్, సివేరి బీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు ప్రణాళిక తయారుచేయాలి : కలెక్టర్



పాడేరు,ఏప్రిల్10, ప్రభాతవార్త: జిల్లాలో భూగర్భ జలాలను పెంచే విధముగా ప్రణాళికలు తయారు చేయాలని, చెక్ డ్యాములు, ఫారం పాండ్స్, సోక్ పిట్ల నిర్మాణాలకు మండలాల వారీగా మ్యాపులను తయారు చేసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ నిశాంతి. టి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరం నందు అధికారులతో జిల్లాలో నీటి భద్రత, సంరక్షణ కొరకు చేపట్టవలసిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదవుతుందని, దానికి అనుగుణంగా భూగర్భ జలాలను పెంచే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లాలో అత్యధిక ప్రజలు లబ్ది పొందే విధముగా అధికారులు నీటి నిల్వనకు చెక్ డ్యాములు, ఫారం పాండ్స్, సోక్ పిట్స్, వర్షపు నీటిని నిల్వ చేయడానికి నిర్మాణాలను అధిక మొత్తంలో చేపట్టాలన్నారు. నీటి సంరక్షణకు ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్మాణాలు ఎక్కడెక్కడ చేపట్టవలసిన ఉంటుందో అధికారులతో సమన్వయం చేసుకొని మండలాల వారీగా మ్యాపులు తయారు చేసుకోవాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా జిల్లాకు ఎక్కువ ప్రయోజనం జరిగే విధంగా నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా నీటి నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు. ప్రతి రైతు వ్యవసాయ పొలం దగ్గర నీటి బావులను తవ్వించడం ద్వారా నీటి నిల్వతో పాటు సంవత్సరం పొడవునా పంటలు పండించడానికి వీలు కలుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఇంకుడు గుంతలను ఎక్కువ మొత్తంలో నిర్మించాలన్నారు. అధికారులందరూ అంకితభావంతో పనిచేసి ఈ కార్యక్రమం ద్వారా భరోసా కలిగే విధంగా రైతులకు ఎక్కువ లబ్ది చేకూరే విధముగా పనిచేయాలన్నారు. జిల్లాలో ఎక్కువ వర్షపాతం నమోదు కొరకు ఎక్కువ మొత్తంలో చెట్ల పంపకాన్ని చేపట్టాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. సాగునీటి సంఘాలను బలోపేతం చేసి జలదార జల హారతి పథకంలో భాగ్యస్వాములు చేయడం ద్వారా జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి విద్యాసాగర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాలు నోడల్ అధికారి పిఎస్. కుమార్, జిల్లా ఇంచార్జ్ అటవీ శాఖ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం కీలకం



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని జీకేవీధి వైద్యాధికారులు శివరామ్, రుషశ్రీ తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తహసిల్దార్ అన్నాజీరావు సమక్షంలో శుక్రవారం జీకేవిధిలో పోషణ పక్వాడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. సున్నా నుండి రెండేళ్ల పిల్లలుకు సరైన పోషణ అందిస్తే వారి మేధాశక్తి పెరుగుతుందన్నారు. పిల్లలు భవిష్యత్తుకు అదే సరైన సమయమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఎక్కువగా ఫోన్ ఇచ్చి వారి మెదళ్లను పాడు చేయవద్దని సూచించారు. పిల్లలు అధికంగా స్క్రీన్ టైమ్‌లో ఉండటం వల్ల కంటితో పాటు మెదడు సంబంధ వ్యాధులకు గురవుతారని పేర్కొన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక హోదా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకులు వలసమ్మ, మోహిని, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాపై అవగాహన



అరకలోయ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : అరకులోయ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాల్లో శుక్రవారం ఖిపోషణ పక్వాడఖి పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యం, గర్భిణులు, బాలింతల పోషణపై సంపూర్ణ అవగాహన కల్పించడమే పోషణ పక్వాడ ప్రధాన ఉద్దేశం అని అరకులోయ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని లక్ష్మి లావణ్య, సుంకరమెట్ట సెక్టర్ సూపర్వైజర్ రామకృష్ణమ్మ లు ఈ సందర్భంగా తెలియజేశారు. దీనిలో భాగంగా మండలంలోని జనం గూడ, సుంకరమెట్ట కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల మేధో శక్తి అభివృద్ధికి తల్లిపాలే శ్రేష్టమని, దీంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు గర్భిణీలు బాలింతలకు తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె అన్నారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలో అన్నదానిపై సంపూర్ణ అవగాహన కల్పించారు. అదే విధంగా పిల్లలు మొబైల్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. ఈ విషయంపై ప్రతి తల్లి జాగ్రత్త వహించవలసి ఉంటుందని ఆమె సూచించారు చిన్నారుల మెదడు అభివృద్ధిలో 90 శాతం తల్లిపాల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని వారు గుర్తుచేశారు. ఆహార నియమాలలో బాలింతలు జంక్ ఫుడ్ (బయటి ఆహారం) కు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. కేవలం ఇంట్లో తాజాగా తయారుచేసిన పౌష్టికాహారాన్ని మాత్రమే తీసుకోవాలని ఆమె సూచించారు. అంగన్వాడీలు భాగ్యలక్ష్మి, లలిత కుమారి, అప్పలమ్మ, శాంతి, వెంకటలక్ష్మి, భాను, జ్యోతి,జమ్మి బిమల, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో సీఎంను కలిసిన కిడారి శ్రావణ్



పాడేరు, ఏప్రిల్10, ప్రభాతవార్త: అమరావతి సచివాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన వివాహ శుభలేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసి పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలని ఆహ్వానించారు. శ్రావణ్ కుమార్‌తో ఆత్మీయంగా మాట్లాడిన ముఖ్యమంత్రి పెళ్లి తేదీని తన షెడ్యూల్‌లో నమోదు చేయాలని సిఎం సూచించారు. అలాగే వధువు వివరాలను తెలుసుకుంటూ, ఆమె స్వగ్రామం, విద్యార్హతలు, ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాలపై ఆసక్తిగా సిఎం శ్రావణ్ అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

## బీజేపీ బలోపేతమే లక్ష్యం



గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) : గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని శ్యామగడ్డ గ్రామంలో మన ఊరు మన జెండా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. చల్లంగి అచ్యుత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనపై ఆకర్షితులై గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు, గ్రామస్తులు బిజెపిలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ముఖ్య అతిథులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి మఠం శాంతకుమారి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు సైతం వైద్యం, విద్య, రహదారి సౌకర్యాలను కల్పించిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. బిజెపి కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అణగారిన వర్గాల గొంతుకగా ఒక శక్తిలా ఎదుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో వార్డు మెంబర్ నుండి ఎంపీ స్థానం వరకు బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కాకూరు శేఖర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి సరభ వేమన బాబు, చల్లంగి అచ్యుత్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేజీయ రాణి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ (జీకే వీధి ఎంపీటీసీ) రీమల రాజేశ్వరి, సీనియర్ నాయకులు బోండ్ల చిరంజీవి, జిల్లా గిరిజన మోర్చా కార్యదర్శి ముట్టడం లక్ష్మణ్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి లకే ప్రసాద్, గ్రామ పెద్దలు కోపూరి కొత్తయ్య, పోత్తూరు వెంకట్రావు మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రబీ వేరుశనగతో అధిక లాభాలు



గూడెం కొత్తవీధి ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): ధారకొండ పంచాయతీ పరిధి దారాలగొందిలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు వేరుశెనగ పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగుపై పలు సూచనలు చేశారు. రబీ సీజన్ కోసం ప్రభుత్వం 90 శాతం రాయితీపై వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండటం వల్ల వేరుశెనగ పంటకు మేలు జరుగుతుందన్నారు. వర్షాలు తక్కువగా ఉంటే మొక్క శాఖీయ పెరుగుదల తగ్గి, భూమి గుల్లబారుతుం దని. దీనివల్ల ఊడలు సులభంగా భూమిలోకి వెళ్లి కాయలు ఎక్కువగా ఊరుతాయని వివరించారు. నీటి వసతి ఉన్న చోట వేరుశెనగ సాగు అత్యంత లాభదాయకమని, రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జోసెఫ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పిల్లల కదలికలపై నిఘా ఉంచాలి : ఎమ్మెల్యే రేగం



అరకులోయ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : అరకు నియోజకవర్గం, హుకుంపేట మండలం, బూర్జ గ్రామ పంచాయతీ, జంబవలస గ్రామ పరిధిలోగల మల్లంగుమ్మి జలపాతంలో ఈతకు వెళ్లిన త్రిష, పవిత్ర, రత్నకుమారి మృతి చెందిన విషయం విధితమే. పోస్టుమార్టం నిమిత్తం మృతి దేహాలను అరకు ఏరియా ఆసుపత్రికి తరలించగా ..విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం ఉదయం ఆసుపత్రి కి చేరుకుని ప్రమాద ఘటనకు గల కారణాలు తెలుసుకొని తీవ్ర దిగ్భ్రాంతి చెంది, మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మృతుల కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా చెరో 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం ను అందజేశారు. కాగా రెవెన్యూ శాఖ నుండి ఒక్కో కుటుంబానికి 10 పదివేల రూపాయలు చెప్పున అందజేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్, అరకు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ రాము, వైసీపీ అరకు నియోజకవర్గం సోషల్ మీడియా ఇంచార్జ్ కొర్ర రామ్, వైసీపీ అరకు వ్యాలీ మండలం ఎస్టి సెల్ అధ్యక్షుడు పాంగి నగేష్, పోలీస్ సిబ్బంది, మృతుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐటీడీఏ పీవోగా ఆదిత్యవర్మ బాధ్యతల స్వీకరణ





పాడేరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా ఐఏఎస్ 2022 బ్యాచ్ కేడర్‌కు చెందిన ఆదిత్యవర్మ శనివారం ఉదయం ఏడు గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే ఇప్పటి వరకు పీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2022 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన తిరుమాని శ్రీపూజను జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించడంతో జేసీగా నేడు పూర్తి స్థాయి బాధ్యతలు శనివారం స్వీకరించనున్నారు. పాడేరు ఐటిడిఎ పీఓగా భర్త ఆదిత్య వర్మ, జిల్లా జేసి శ్రీ పూజ దంపతులు ఒకేరోజు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ





పాడేరు, ఏప్రిల్10, ప్రభాతవార్త: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జిఆర్ఎస్) కు 136, రెవెన్యూ క్లినిక్ కు 28 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఇంచార్జి డిఆర్ఓ, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు, ఇంచార్జి ఆర్డిఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడంలో పాడేరు, వివిధ మండలాల తాసిల్దార్, డిటి వి.ధర్మారావు, పి.పోతురాజు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది పాల్గొని అందుబాటులో ఉండి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదుల నుండి అర్జీలు స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీదారులకు తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారి మాత్రమే హాజరుకావాలని అలా హాజరుకాలేని అధికారి ముందుగానే అనుమతి పొందాలని కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది అధికారులు ఒకటి, రెండు జిల్లాల్లో ఇన్చార్జిలుగా విధులు నిర్వహిస్తున్న వారు వారానికి మూడు రోజులు ఇక్కడ, మూడు రోజులు అదనపు జిల్లాల పని చేయాలని ఆమె స్పష్టం చేసారు. శాఖపరమైన ఏ అనుమతులు కైనను అధికారి మాత్రమే వచ్చి అనుమతి పొందాలన్నారు. పి జి ఆర్ ఎస్ లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని నమోదు కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారి ఉండాలని ఆమె అన్నారు.ప్రతి సోమవారం జరిగే జిల్లా అభివృద్ధి సమావేశంలో సంబంధిత శాఖకు సంబంధించిన ప్రణాళిక రూపొందించుకొని సమావేశానికి హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి అధికారుల సమన్వయాన్ని సిపిఓ కో ఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో ఎక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు రారని, అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ప్రతి ఒక్కరికి జిల్లా అధికారుల వివరాలు తెలిసి ఉండాలని, మండల తాసిల్దార్, ఎంపీడీవో, మండలనికి సంబంధించిన అధికారుల వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే గ్రీవెన్స్ ను కూడా నిర్ణీత గడువులోపు అర్జీ దారునితో మాట్లాడి సమస్యను పరిష్కరించి, గ్రీవెన్స్ పోర్టర్ లో అప్లోడ్ చేసి ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. అలా క్లియర్ చేసినప్పుడు మాత్రమే పోర్టల్ లో పెండింగ్ లేకుండా ఉంటుందని లేకుంటే పదే పదే అప్లికేషన్ రిపీట్ అవుతుందన్నారు. గ్రీవెన్స్ లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్ ను సంప్రదించవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందన్నారుఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ , జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి. మురళి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. కృష్ణమూర్తి నాయక్ , స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, పలువురు తాహాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి : దొన్నుదొర



అరకులోయ, ఏప్రిల్10, ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీని గ్రామీణ స్థాయిలో మరింతగా బలోపేతం చేసే దిశగా శ్రేణులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర సూచించారు. అరకులోయ లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కేడర్ తో సమావేశం నిర్వహించారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. పార్టీ విధి విధానాలు పార్టీ తెలియజేసే ఆదేశాలను సిరసా పాటించాలని చెప్పారు. పంచాయతీల పరిధిలో జరిగే ప్రతి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సమస్యల గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామీణ సమస్యల పరిష్కారంతో ప్రజలతో సత్సంబంధాలు పెరుగుతాయని పార్టీ బలోపేతం అయ్యే దిశగా అడుగులు పడతాయని చెప్పారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పిఎం జన్ మన్ గృహాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మన ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పలానా అభివృద్ధి చేశామని చెప్పుకునే విధంగా పార్టీ శ్రేణులంతా దృష్టి సారించాలని సూచించారు. పార్టీ బలోపేతం చేయాల్సిన అవసరం ఎక్కడైతే ఉందో అక్కడ ఎక్కువ దృష్టి సారించాల్సిన ఉందన్నారు. బూత్ అబ్జర్వర్ ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేసి దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్త అధినేతని చెప్పారు. ఆ విషయాన్ని ఎవరూ మరవద్దని చాలా క్రమశిక్షణ గల పార్టీలో ఉంటున్నామని గౌరవంతో మనమంతా కూడా ఒక కుటుంబ సభ్యుల బతుకుతున్నామన్నారు. చిన్నచిన్న ఇబ్బందులు వచ్చినా సమన్వయం చేసుకొని ముందుకు నడుద్దాం అని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి పోరా వైభవం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గెమ్మెలి బిమల, శంకర్‌నాయుడు, బురిడీ కొములు నాయుడు, కొర్ర సంతోష్, తాంగుల రాజకుమార్, పార్టీ మండల అధ్యక్షులు లోక్కోయ్ మహాదేవ్, కిల్లో ఆనంద్, పెట్టేలి దాసు బాబు, పాడి బాలన్న, సొమెలి లక్ష్మయ్య, భీంపోలు ఈశ్వర్ రావు, సుబ్బారావు, కృష్ణారావు, కిల్లో కుమార్, కుంతురు సుబ్బారావు, తాంగుల రాంబాబు,, కొర్ర సుబ్బారావు, వంతల వెంకట్ రావు, పాంగి భగత్ రామ్, పూజారి మాణిక్యం, బోయి దామోదర్, పూజారి లక్ష్మినారాయణ, శేఖర్, కిల్లో నాగరాజు, కిల్లో మోహన్ దాస్, కొర్ర బాలరాజు, జన్ని సీతారాం, సీసా కర్రిబాబు, దుంబరి లచ్చన్న, రాజారావు, వంతలా బుద్దు, పాంగి కిరణ్, కొర్ర ఓనోతి రామ్, సివేరి బీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు ఐటీడీఏ సందర్శన



పాడేరు,ఏప్రిల్ 10, ప్రభాతవార్త : కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోట) డైరెక్టర్ డాక్టర్ వర్ణాలి దేక అల్లూరి జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా పాడేరు ఐటీడీఏ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్, ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి నిశాంతి, జాయింట్ కలెక్టర్ శ్రీ పూజా పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా ఇన్చార్జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గిరిజన ప్రాంతంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలపై క్షుణ్ణంగా వివరించారు. ముందుగా మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ డైరెక్టర్ వారిని పుష్పగుచ్ఛ అందించి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి.స్వాగతం పలికారు. అనంతరం పాడేరు మండలం, ముంతమామిడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాడేరు ఐటిడిఎ ద్వారా రూ. 60 లక్షల పీఎం జన్మన్ నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజక భవనాన్ని ఆమె సందర్శించారు. భవన నిర్మాణ తీరును, అందుబాటులో ఉన్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వనధన్ వికాస్ ఉత్పత్తుల పరిశీలించి, అదే భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన డైరెక్టర్, వనధన్ వికాస్ కేంద్రం ద్వారా తయారవుతున్న వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తుల నాణ్యత, వాటి మార్కెటింగ్ వివరాల గురించి ఆరా తీశారు. స్థానిక గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఇటువంటి కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఐటీడీఏ అధికారి, జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ , కందమామిడి గిరిజన బాలికల పాఠశాలను సందర్శించి విద్య, వసతి పై ఆరా తీసి, భోజనశాలను సందర్శించి పిల్లలకు అందిస్తున్న భోజన సౌకర్యం పై పిల్లలని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి.బి.కె పరిమళ, ఐ సి డి ఎస్ పి డి ఝాన్సీరామ్ పాడల్, ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ మరియు భవనాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి మెడకు బిగిసుకున్న తాడు



పాడేరు,ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గిరిజన సంప్రదాయ ఇటుకలు పండుగ సందర్భంగా తాచేరు వసూలు కోసం కట్టిన తాడు అటుగా వస్తున్న సాయి అనే యువకుడు మెడకు తగిలి బిగుసుకుపోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ యువకుడ్ని హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రి తరలించి తాడు తొలగించి చికిత్స అందజేశారు.




## ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలి : జడ్పీ సీఈవో



గొలుగొండ, ఏప్రిల్10, ప్రభాతవార్త: ప్రభుత్వం అన్ని రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తుందని ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేసేలా అధికారులు పాటుపడాలని పరిషత్ సీఈవో నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం విశాఖపట్నం నుంచి విచ్చేసిన ఆయన గొలుగొండ మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛరథం పనితీరును జోగుంపేటలో ఆయన స్వయంగా పరిశీలించారు. అన్ని అంశాల్లో ప్రజా భాగస్వామ్యం పెంచాలని ప్రభుత్వం ఆలోచన చేసి ముందుకు సాగుతుందన్నారు. ఇంటిదగ్గర ఉపయోగం లేని ప్లాస్టిక్ ఇతర వస్తువులను స్వచ్ఛర దానికి అప్పగిస్తే నిత్యవసర సరుకులు తగినవి అందిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల స్వచ్ఛత కోసం ప్రభుత్వం నేరుగా వ్యర్థాలను సేకరించి ఇంటికి ఉపయోగపడే వస్తువులను అందిస్తుంది అన్నారు. ఇళ్ల వద్ద తడి పొడి చెత్తను వేరు చేసి క్లాత్ మిత్రాలకు అందిస్తే వాటిని సంపద కేంద్రాలకు తరలించి ఆదాయ వనరులుగా మార్చే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రభుత్వం విజన్ 2047 లక్ష్యంగా పనిచేస్తుందని ఇందులో పొందుపరిచిన సంస్కరణలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం మండల పరిషత్ భాను ఆధునికరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేసి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడే స్థానిక జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఎంపీడీవోతో స్థానిక పరిస్థితులపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మహేష్, జోగంపేట కార్యదర్శి రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగపర్చుకోండి



చోడవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పీఎం సూర్యగర్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగ పరుచుకో వాలని స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సూర్యగర్ మఫ్త్ బిజిలి యోజన ఎస్సీ ఎస్టీ గృహ వినియోగదారుల పథకంలో బాగంగా గురువారం చోడవరం ఎమ్మెల్యే కే.ఎస్.యన్.ఎస్ రాజు చోడవరం నియో జవర్గంకు సంబంధ్నిచిన కార్యక్రమాన్ని ప్రారంభోత్సవ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలకి 200 రూపాయలు అద్దె చెల్లించ డం జరుగుతుందని ఇంటిపై ఉన్న ఖాళీగా ఉన్న పైకొప్పుని నియోగించు కోవడం ద్వారా ఈ సౌకర్యాన్ని ఎస్సీ ఎస్టీ వినియోగదారులు అందరూ విని యోగించుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం కుసుం కార్యక్రమం గురించి తెలియజేశారు. పి ఎం కుసుం పథకంలో భాగంగా వినియోగదారులు తమ భూమిని లీజుకి ఇవ్వడం ద్వారా సంవత్సరమునకు 31వేలు రూపాయలు లీజు చెల్లించిపడుతుందని ప్రతి రెండు సంవత్సరాలకు ఐదు పర్సెంట్ పెరుగుతుందని ఈ స్కీంని వినియోగించుకోవాల్సిందిగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఇందులో ఎస్సి 4626, ఎస్టి 1553 మొత్తం కలిసి 6179 మంది ఉన్నారని. ఇంకా ఎవరైనా సంసిద్ధంగా ఉన్నాయెడల త్వరితగతిన ఇస్తామని చెప్పారు. నియోజవర్గం లో నాలుగు మండలాలు కలిపి అగ్రికల్చర్ కనెక్షన్లు ఇప్పటివరకు 360 రిలీజ్ చేశామని మిగతావి త్వరలో రిలీజ్ చేస్తామని అన్నారు. అలాగే అభివృద్ధి పనులు నిమిత్తం డ్యామేజ్ అయిన పోల్స్ ని మార్చడం,5 అదనపులోడు లోడ్ కలిగిన ట్రాన్స్ఫార్మర్‌కు అదనపు ట్రాన్స్ఫార్మర్ వేయడం జరిగింది దానికి సుమరుగా రూపాయిలు 24 లక్షలు, ఏ బి స్విచ్లు వాటిని పునరుద్ధరించడం, పాడైపోయిన కండక్టర్, కేబుల్ మార్చడం, నాణ్య మైన విద్యుత్తు సరఫరా కోసం ఆర్‌డిఎస్ఎస్ పథకంలో భాగంగా ఫీడర్ల విభజన పనులు జరుగుతు న్నామని తెలియజేసారు. అలాగే పిఎం సూర్య ఘర్ ద్వార సోలార్ ప్యానల్ ను నియోజవర్గం మొత్తం 657 బిగించినారని తెలియజేస్తూ వినియోగదారులకి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తూ అలాగే నియోజవర్గం కూడా అభివృద్ధిలో తీర్చిదిద్దుకుంటూ ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఆఫీస్ జి.ప్రసాద్,నర్సీపట్నం ఈ ఈ ఎస్ రామకృష్ణ, చోడవరం డీఈఈ వై. సురేష్ కుమార్, మాడుగుల డీఈఈ ఏ. సురేష్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పోషకాహార పక్షోత్సవ కార్యక్రమాలు



చోడవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల చోడవరం సెక్టార్ వెంకయ్య గారి పేట అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే అనర్ధాలు గురించి అలాగే పిల్లలను ఫోన్ కి దూరంగా ఉంచడానికి తల్లిదండ్రులు చేయవలసిన కార్యక్రమాల గురించి అలాగే తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి పుట్టిన పిల్లవానికి ఆరు ఏళ్ళు నిండిన వరకు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తల కోసం తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లలలో ఆరు ఏళ్ల లోపే వాళ్ల మెదడు అభివృద్ధి అనేది 90 శాతం జరుగుతుంది కాబట్టి ఆ సమయం చాలా కీలకమైనదని తెలిపారు. ఈ సమయంలో మంచి ఆహారం, సరైన రక్షణ, మంచి ఆరోగ్యం ఉండేలా చూసుకోవాలని సూపర్వైజర్ బి శాంతిప్రియ తల్లిదండ్రులకు సూచించారు. చోడవరం సెక్టార్ అంగన్వాడి టీచర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రాజుపేటలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



గొలుగొండ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలంలో కొత్త ఎల్లవరం పంచాయతీ రాజుపేట గ్రామంలో ఫార్మాజెల్ వారి సహకారంతో ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. .15లక్షల ఆర్థిక సహాయంతో ఫార్మా జెల్ సమకూర్చి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా ప్లాంట్ నిర్మాణం చేసినట్టు తెలిపారు. శుక్రవారం తాగునీటి ప్లాంటును నర్సీపట్నం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి రాజాన సూర్య చంద్ర ఫార్మా జెట్ ప్రతినిధులు శ్రీనివాసరావు, అప్పారావు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఫార్మా జెల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇక్కడ ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు మాజీ సర్పంచ్ రాంబాబు ప్రత్యేకమైన చొరవ చూపారని అన్నారు. ఈ ప్లాంట్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గంలో నీటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లు రాంబాబు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాద హరినాధ్, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## స్ప్రేయింగ్ పిచికారీపై శిక్షణ



చోడవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో స్ప్రేయింగ్ పిచికారి చేయు విధానాలపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 15 నుంచి స్ప్రేయింగ్ పిచికారి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జిల్లా మలేరియా అధికారి కే వరహాలు, అసిస్టెంట్ మలేరియా అధికారి ఏజే సత్యనారాయణ సమక్షంలో సిబ్బందికి ఐఆర్ఎస్ స్ప్రెయింగ్ పిచికారిపై అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి ఎస్వి రమణతోపాటు వివిధ పీహెచ్సీల నుంచి వచ్చిన సూపర్వైజర్లు, హెచ్‌వీలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కసింకోట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త; కశింకోట సెక్షన్ పరిధిలోని 33/11 కె.వి బయ్యవరం సబ్ స్టేషన్ మరియు 33/11 కె.వి కశింకోట సబ్ స్టేషన్ పరిధిలో 11 కె.వి కశింకోట ఫీడర్ ఇండస్ట్రియల్ ఫీడర్ తేగాడ ఏజీఎల్ ఫీడరు కశింకోట ఎంహెచ్ క్యు ఫీడర్ హెచ్టి లైను క్రింద ఉన్న తగులుతున్న చెట్లు, కొమ్మలు కొడుతున్న కారణంగా శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు, బయ్యారం, కశింకోట సబ్ స్టేషన్ పరిధిలోని కశింకోట, బయ్యవరం , తెగడ , వెదురుపర్తి, గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందనీ ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ టి మురళీకృష్ణ తెలిపారు. కావున ఆయా గ్రామాల ఏపీ ఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా రోడ్లు



ఎలమంచిలి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పట్టణంలోనే ఉదయం నుండే భానుడి ప్రతాపానికి పట్టణ ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 8 గంటల నుండి సూర్య భగవానుడు తన విశ్వరూపం చూపించాడు. పిల్లల మొదలుకొని పెద్దల వరకు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. ఎండ తీవ్రత దృశ్య తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వైద్యాధికారులు సూచనలు చేస్తున్నారు.

## రైతులు సుస్థిర వ్యవసాయం చేయాలి : ఏవో ఉమాప్రసాద్



నక్కపల్లి, ప్రభాతవార్త : గుల్లిపాడు గ్రామంలో ధర్తీ మాతా బచావో అభియాన్ (భూమాత రక్షణ ప్రచారం) పై రైతులకు అవగాహన కార్యక్రమము నిర్వహించారు. మేరకు రైతులకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సుస్థిర వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని, సారాన్ని పునరుద్ధరించడానికి ఉద్దేశించిన ఒక ఉద్యమం. ఈ చొరవ కింద, నేల పరీక్షలు, సమతుల్య ఎరువుల వాడకం, కార్బన్ ఎరువులు ప్రోత్స హించడం ద్వారా రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు అవలబించేలా ప్రోత్సహించడం జరుగు తుంది అన్నారు. ధర్తీ మాతా బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశ్యాలు తెలియజేశారు. నేల సంరక్షణ: రసాయన ఎరువులు (యూరియా) వాడకాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడటం. సుస్థిర వ్యవ సా యం రైతులు రసాయన రహిత లేదా తక్కువ రసాయనాలతో వ్యవసాయం చేసేలా ప్రోత్సహించడం పట్ల అవగాహన, నేల సారాన్ని పెంచడం పంట ఉత్పాదకతను స్థిరంగా పెంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. కమిటీల ఏర్పాటు విషయమై ఈ ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి గ్రామ/పంచాయతీ స్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ ప్రచారం వలన నేల ఆరో గ్యాన్ని మెరుగుపరచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు రైతు ఆదాయాన్ని పెంచడానికి సహాయప డుతుందని రైతులకు తెలియజేశారు. గ్రామపెద్దలు, గ్రామవ్యవసాయ సహాయకులు లావణ్య పాల్గొన్నారు.

## సీతయ్యపేటలో బెల్ట్ షాపు కలకలం...అధికారుల నిర్లక్ష్యం



బుచ్చయ్యపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : సీతయ్యపేట గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాప్‌పై గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ ఇందిరా శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు కూడలిలో ఉన్న ఈ బెల్ట్ షాప్ కారణంగా ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణించే వారు, రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. బెల్ట్ షాప్ పక్కనే రెండు మెడికల్ షాపులు, అలాగే స్టేట్ బ్యాంక్ ఉండటంతో అక్కడికి వచ్చే కస్టమర్లు, డ్వాక్రా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం విద్యార్థులు తరచూ వెళ్లే మార్గం కావడంతో వారి భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై స్పందించిన మాజీ సర్పంచ్ వజ్రపు ఇంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ, "గ్రామం మధ్యలో బెల్ట్ షాప్ ఉండటం అనేది పూర్తిగా అనుచితం. వెంటనే ఈ షాపును గ్రామానికి దూరంగా తరలించాలి. లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతాం" అని హెచ్చరించారు. గ్రామ ప్రజలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

## వైసీపీ మండల అధ్యక్షుడిగా గొర్లె గోవింద్.. పలువురు సత్కారం



(నక్కపల్లి, ప్రభాతవార్త): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా పెద్ద దొడ్డిగల్లు ఎంపీటీసీ భర్త గొర్ల గోవిందు ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించినట్లు కేంద్ర కమిటీ నియామకం ఉత్తర్వులను అందజేసింది. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా కమిటీలో నక్కపల్లి మండలానికి కేంద్ర కమిటీ పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారు. పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయ కర్త ,మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ,విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి వీసం రామకృష్ణ నాయకత్వంలో మండలంలోని పలువురు నాయకులను మండల కమిటీలో ఎంపిక చేశారు. మండలంలోని సీతంపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గొర్ల గోవిందరావును అధ్యక్షుడుగా నియమిం చడంతోపాటు ఉపాధ్యక్షు లుగా సాదిరెడ్డి శ్రీను, జుల్లూరి లక్ష్మిపతి రాజు, ప్రధాన కార్యదర్శులుగా అల్లు రమణ, కొల్నాటి దుర్గా ప్రసాద్, ఏరిపల్లి నగేష్, దమ్ము అప్పారావు లను నియమించడంతో పాటు 6 సభ్యులకు అదనపు కార్యదర్శులుగా 18 మందికి కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎంపికైన గొర్ల గోవిందును పార్టీ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ నాయకత్వంలో పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ రామకృష్ణ నాయకత్వంలో నక్కపల్లి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. నియామకం పట్ల రామకృష్ణతో పాటు మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రసాద్ ,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర కన్వీనర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు లతోపాటు దంతులూరి దిలీప్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవింద్ సత్కరించువారిలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అయినంపూడి బంగారాజు ,విద్యార్థి విభాగం కన్వీనర్ ఎలమంచిలి చందు, ఎల్లేటిసత్యనారాయణ ,ముద్ద శ్రీను, మాజీ సర్పంచ్ గొర్ల నాగఅప్పలరాజు ,మాజీఉప సర్పంచ్ వీసం రాజు తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

## ఎస్. రాయవరంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



ఎస్. రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఎస్ .రాయవరం గ్రామంలో నూకంబిక అమ్మవారి గంధ అమావాస్య జాతర సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ పోటీలను నక్కపల్లి రూరల్ సీఐ ఎల్.రామకృష్ణ,ఎస్సై ఏ.విభీషణ్ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలకు సుమారు 30 జట్టులు పాల్గొంటు న్నాయని క్రికెట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 30వేల రూపాయలు రెండో బహుమతి 20 వేల రూపాయలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొణతాల శ్రీనివాసరావు, సోమిరెడ్డి రాజు. తాజా మాజీ ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, క్రికెట్ కమిటీ సభ్యులు వీసం సాయి ,పితాని సతీష్ ,కర్రి తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథాన్ని సద్వినియోగపర్చుకోండి : ఎంపీడీవో



ఎస్.రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: వమ్మవరంలో రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన స్వచ్ఛరథంను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో మీనా కుమారి అన్నారు. శుక్రవారం వమ్మవరం, సైతారుపేట ,సర్వసిద్ధి గ్రామాల్లో పర్యటించారు. ఇంటి వద్ద ఉపయోగపడలేన టువంటి వాడుకులో లేనటువంటి ఉన్న వస్తువులను స్వచ్ఛ రథం అప్పగిస్తే వాటికి తగ్గట్టు నిత్యవసర వస్తువులను పొందవచ్చు అన్నారు. ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలను పరిశీలించి గ్రామాల్లోని చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య వంతులుగా ఉంటామనన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలతో సమావేశాలు నిర్వహించారు . కార్యక్రమంలో సర్వసిద్ధ స్పెషలాఫీసు మనోరమ ఆయా గ్రామ అధికారులు, సిబ్బంది,పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పెనుగొల్లు గ్రోయిన్ పరిశీలన



ఎస్.రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాత వార్త: మండలంలోని వరాహనది సమీపంలోని పెనుగొల్లు గ్రోయిన్‌ను పాయకరావుపేట డివిజన్ ఇరిగేషన్ డి ఈ సురేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు .గ్రోయిన్ మరమ్మతులు చేయడానికి ఇటీవల 99 లక్షలు మంజూరు కావడం నిర్మాణ పనులు ప్రారంభించడంతో అందులో భాగంగా పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. నిర్మాణ పనులు సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఏఈ భాను, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత




అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 10 : (ప్రభాత వార్త) జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఉత్తర్వుల మేరకు అనకాపల్లి సబ్ డివిజనల్ డీఎస్పీ ఎం. శ్రావణి ఆదేశాల మేరకు రోడ్డు భద్రత, డ్రగ్స్ వ్యతిరేకతపై అనకాపల్లి రూరల్ పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్ర మాలు విరివిగా చేపడుతున్నారు. శుక్రవారం మామిడిపాలెం, రేబాక, మారేడుపూడి, కొప్పాక, కూండ్రం, సంపతిపురం, పిసినికాడ తదితర 15 చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కలుగజేస్తున్నారు. ప్రధానంగా హెల్మెట్ లేని డ్రైవింగ్ ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు ప్రయాణించరాదని, ఓవర్ లోడ్ వెహికల్స్, లైసెన్స్ లేని డ్రైవింగ్, చిన్నపి ల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణం కాకూడదని ఎక్కడికక్కడ ప్రజల్లో చైత న్యం కలిగేలా విశేష కృషి చేస్తున్నారు. యువత మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చైతన్యం కలిగిస్తున్నారు. రూరల్ సీఐ జి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.రవికుమార్ తన సిబ్బందితో గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో విశేషంగా కృషి చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసమే లక్ష్యం



ఎస్. రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాత వార్త : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసమే మా లక్ష్యం పిఆర్‌టియు మండల అధ్యక్షులు బాలు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ కు విద్యార్థుల నుండి అనుహ్య స్పందలభిస్తుందని తుని,ఎలమంచిలి, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, అచ్యుతాపురం, ఎస్ రాయవరం మండలాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారన్నారు. వారు గత కొన్ని సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీట్లు సాధించడం, ఉద్యోగాలు పొందడం పట్ల సమాజంలోని వివిధ వర్గాల నుండి ప్రశంసలు పొందుతుందని చదువుకోవడం వలన జూనియర్ ఇంజనీర్ లేదా టెక్నిషియన్ స్థాయి ఉద్యోగాలను పొందవచ్చని, ఎస్ ఎస్ సి పిఎస్యు వంటి రంగాలలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు సివిల్ మెకానికల్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ సైన్స్ వంటి అనేక విభాగాలలో స్పెషలైజేషన్ చేసే అవకాశం లభిస్తుందని మన ప్రాంతం పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సమయం కాబట్టి వివిధ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయని సూచించారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు బాలు, ఆదర్శ కాలేజ్ ప్రిన్సిపల్ సీతారామరాజు పిఆర్‌టియు నాయకులు శ్రీను ,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా బీసీ విభాగ అధ్యక్షుడిగా గొర్ల నరసింహమూర్తి



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంద విభాగమైనజిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా మాజీ నక్కపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు ,ప్రస్తుత దేవవరం ఎంపీటీసీ భర్త గొర్ల నరసింహమూర్తికి చోటు దక్కింది. ఆయనతో పాటు రాష్ట్ర అనుబంధ విభాగాలైన వైసీపీ అనుబంధ విభాగంలో పలువురు సీనియర్ నాయకులకు రాష్ట్రస్థాయిలో పలు కమిటీల్లో మాజీ ముఖ్యమంత్రి ,జాతీయ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించినట్లు కేంద్ర కమిటీ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు మండలంలోని డిఎల్ పురం గ్రామానికి చెందిన మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు లొడగల చంద్రరావుకి రాష్ట్ర ప్రచార విభాగంలో సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఆయనతోపాటు బుచ్చిరాజుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొర్ల బాబురావు రాష్ట్ర బూత్ కమిటీల వింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారి నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తో పాటు రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు,మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ ,శాసన మండల ప్రతిపక్ష నేత, మాజీ మంత్రిబొత్స సత్యనారాయణ ,జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడు ప్రసాద్ ,పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ,పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకు శోభ హైమావతి,నియోజకవర్గ పరిశీలకులు దంతులూరు దిలీప్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సిరం నరసింహమూర్తి ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తలు నాయకులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా ఎన్నికైన గొర్ల నరసింహమూర్తి ,రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమితులైన లోడగల చంద్రరావు, గొర్ల బాబురావులు మాట్లాడుతూ జాతీయ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ గ్రామాన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ,రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున విజయం సాధించినట్లు ఇప్పటినుంచి గ్రామాల్లో పనిచేస్తామని చెప్పారు .వారి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## పోషణ పక్వాడా ప్రారంభం



నర్సీపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండలం ధర్మసాగరం గ్రామంలో శుక్రవారం 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ పీడీ ఎన్. సూర్యలక్ష్మీ హాజరై మాట్లాడారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని చెప్పారు. గర్భిణీలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. మన పిల్లల అభివృద్ధి, ఆరోగ్యం మనమే కాపాడుకోవాలని చెప్పారు. అలాగే పిల్లలు ఎక్కువగా సెల్ఫోన్లు చూడటం వల్ల మాటలు ఆలస్యంగా వస్తాయన్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని చెప్పారు. నెల 23వ తేదీ వరకు ఈ పోషణ పక్వాడా కార్యక్రమాలు జరు గుతాయని వివరించారు. జెడ్పీటీసీ సుకల రమణమ్మ, సీడీపీఓ జీవీ.రమణి, టీడీపీ మండల అధ్యక్షులు సుకల అప్పలనాయుడు, సెక్రటరీ సూర్య కళ, వీఆర్వో పి.పార్వతి, పాఠశాల హెచ్‌ఎం వెంకటలక్ష్మీ, సూపర్వైజర్ పి.అప్పలనర్స,అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నడపాలి



నర్సీపట్నం,ఏప్రిల్10,ప్రభాతవార్త: మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వమే నడపాలని సీఐటీయు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 4వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వం పాఠశాలల్లో వంటలు చేస్తున్నారన్నారు. వీరిని తీసేసి స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకి ఇవ్వాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు. కావున ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని పథకాన్ని ప్రభుత్వమే కొనసాగింపు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్నం భోజన కార్మికులకి కనీస వేతనాలు రూ.10వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, భీమా సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీన జీతాలు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ చిన్నికృష్ణుడ్ని కలిసిన కొప్పిశెట్టి వెంకటేష్



(నక్కపల్లి, ప్రభాతవార్త): అనకాపల్లి మండలానికి నూతన తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చిన్ని కృష్ణని శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మర్యాదపూర్వ కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం మండలానికి సంబంధించిన పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏపీఐఐసీలో కొంతమంది రైతులకు సాంకేతిక కారణాలవల్ల భూపరిహారం అందే విషయంలో నష్టం జరిగిందని ఆయన చేయాలని వెంకటేష్ కోరారు. స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే కాకుండా ఆర్డిఓ వివి రమణ



దృష్టికి కూడా వెంకటేష్ తాసిల్దార్ చిన్ని కృష్ణని కలిసిన వారిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు ,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయినవెంకటరమణ, మాజీ సర్పంచులు కాళ్ల శ్రీను, మండల మహిళా అధ్యక్షురాలు మునిషా బేగం, దార్ల కృష్ణ గణేష్ ,జగన్నాధపురం శ్రీను, ఎరుపల్లి అప్పలరాజు తదితరులు ఉన్నారు .

## ఎంవీఆర్ రాకతో అనకాపల్లిలో మారిన పాలిటిక్స్



అనకాపల్లి, ఏప్రిల్ 10, (ప్రభాత వార్త) : నూతన జిల్లా రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు "ఎంవిఆర్ " నామస్మరణే వినిపిస్తోంది. తన సేవా దృక్పథంతో ఇప్పటికే వేలాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఎం వి ఆర్, ఇప్పుడు ఆ ప్రజాబలాన్ని బీజేపీ బలోపేతానికి మళ్లించడంతో కాషాయ దళంలో కొత్త కళ కనిపిస్తోంది. ఎం వి ఆర్ అభిమాన గణం , యువసేన సభ్యులు ఏకతాటిపైకి వచ్చి బీజేపీ సభ్యత్వం స్వీకరించడం అనకాపల్లి రాజకీయాల్లో ఒక సంచలనంగా మారిందని చెప్పవచ్చు. ఎంవీఆర్ రాజకీయం అంటే కేవలం పదవులు, ప్రసంగాలు మాత్రమే కాదు.. అది నిరంతర ప్రజాసేవ అని ఆయన అభిమానులు చాటిచెబుతున్నారు. వేసవి వేడి నుంచి ప్రజలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు మొదలుకొని, ఆధ్యాత్మిక చింతనతో కూడిన తీర్థయాత్రల వరకు.. ఆయన చేస్తున్న పనులు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఎవరు పిలిచినా పలకడం, కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా ఇవ్వడం ఎం వి ఆర్ ప్రత్యేకత. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని యువత ఎం వి ఆర్ నాయకత్వం వైపు ఆకర్షితులవుతున్నారు. ఆయనలో ఉన్న కార్యదక్షత, పారదర్శకత యువసేనను బీజేపీ వైపు అడుగులు వేయించాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఒక పక్క సక్సెస్ ఫుల్ గా బిజినెస్ రన్ చేస్తూనే, మరోపక్క సామాన్య ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం అరుదైన విషయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎం వి ఆర్ ఎంట్రీతో అనకాపల్లిలో బీజేపీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించడంలో ఆయన సక్సెస్ అయ్యారని చెప్పవచ్చు.

11-4Pg7exHMNWJQE.qxd:11-4Pg7exHMNWJQE.qxd 1/1/02 7:43 AM Page 1



## కుటుంబ కలహాలతో అత్తను చంపేశాడు



కొయ్యలగూడెం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం పరిధిలోని తారక రామానగర్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, అనుమానం ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. తన భార్యను కాపురానికి పంపడం లేదన్న కోపంతో, మద్యం మత్తులో ఉన్న అల్లుడు కన్నతల్లి లాంటి అత్తను కత్తితో పొడిచి అతి దారుణంగా హత్య చేశాడు. ఘటన వివరాల్లోకి వెళ్తే స్థానిక తారకరామానగర్‌కు చెందిన పోల మంగమ్మ (68), ఆమెకు 8 మంది సంతానం అందులో ఐదుగురు కొడుకులు ముగ్గురు కుమార్తెలు వారిలో రెండవ కుమార్తె భర్త అయిన కేదారి పుల్లయ్యకు అత్త పోలా మంగమ్మకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన పుల్లయ్య ప్రవర్తన నచ్చక అతని భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. అయితే, తన భార్య కాపురానికి రాకుండా అత్త మంగమ్మ అడ్డుపడుతోందని, ఆమె తన భార్యను తప్పుదోవ పట్టిస్తోందని పుల్లయ్య గట్టిగా నమ్మాడు. అత్తను చంపితేనే తన భార్య తిరిగి వస్తుందని పథకం వేశాడు. ఈ క్రమంలో, అర్ధరాత్రి సమయంలో మంగమ్మ నిద్రిస్తుండగా పుల్లయ్య కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావమై మంగమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు.

**పోలీసుల దర్యాప్తు:** ఘటనపై సమాచారం అందుకున్న కొయ్యలగూడెం ఎస్పై చంద్రశేఖర్ సిఐ బాల సురేష్ తమ సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. నిందితుడు కేదారి పుల్లయ్యపై కేసు నమోదుచేశారు, త్వరలోనే అతడిని పట్టుకుంటామని సిఐ బాలసురేష్ మీడియాకు వెల్లడించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు ప్రధాన కారణమని తెలిపారు.

## యువ న్యాయవాది అనుమానాస్పద మృతి



గుంటూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా చిలకలూరి పేట రూరల్ పోలీస్టేషన్ పరిధిలోని యడ్లవల్లిలో ఒంగోలుకు చెందిన యువ న్యాయవాది శ్రీరామ్ హరి ప్రసాద్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రోడ్డు పక్కన హరి ప్రసాద్ మృతదేహంపై స్కూటీ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహంపై స్కూటీ పడినట్టుగా ఉండటంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద స్థలంలో బండరాళ్లతో కొట్టిచంపినట్టు పోలీసులు గుర్తించారు. హరిప్రసాద్ 2018లో న్యాయవాదిగా ఒంగోలులో ప్రాక్టీస్ ప్రారంభించారు. వీరి కుటుంబం ప్రస్తుతం ఒంగోలులో ఉంటోంది. యువకుడి తల్లి ఒంగోలు జిల్లా కోర్టులో పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం హైకోర్టు పని మీద బయటకు వెళుతున్నానని తల్లి తిరుపతమ్మకు చెప్పి ఒంగోలు నుండి బయలుదేరిన వ్యక్తి ఉదయానికి చనిపోయినట్లు కోడలుకు ఫోన్ వచ్చిందని తల్లి కన్నీరు మున్నీరయ్యారు. ఎక్కడో చంపి యడవల్లి వద్ద తన కొడుకును పడేశారని, తన కొడుకుది ముమ్మాటికీ హత్యే అని తల్లి తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే హరిప్రసాద్ వివాదాలు జోలికి వెళ్ళే వ్యక్తి కాదని, ఎవ్వరితో ఎటువంటి శతృత్వాలు లేవని చెబుతున్నారు. ఈ క్రమంలో హరిప్రసాద్ మరణం ప్రమాదం వల్ల జరిగిందా లేక హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హీల్‌లో 11వ తరగతి ప్రవేశాలకు ప్రకటన

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి, భోజనం అందించే హీల్ ప్యారడైజ్ పాఠశాలలో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హీల్ సిఇఓ కె.అజయ్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 90 ఎకరాల సువిశాల ప్రాంగణంలో డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆంగ్ల మాధ్యమంలో ఎంపిసి, బైపిసి, ఎంఇఐ గ్రూపుల్లో 2026-27 విద్యా సంవత్సరం ప్రవేశాలకు హీల్ ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత తప్పనిసరి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతిలో 480 మార్కులు, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ విద్యార్థులు 400 పైన మార్కులు సాధించి ఉండాలి. తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం తప్పనిసరి అని విజయ్ కుమార్ వివరించారు. ఈ అర్హతలు ఉన్నవారు మే 18లోపు క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 91000 24438, 91000 24435 నంబర్లలో సంప్రదించవచ్చు.

## ఆయుష్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి ఆయుష్ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి మెంబర్ సెక్రటరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఆయుష్ శాఖ కమిషనర్ నియంత్రణలో గల వివిధ ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మొత్తం 59ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేశామని, డాక్టర్ ఎన్ఆర్ఎస్‌జిఎసి, విజయవాడ, డాక్టర్ ఎఆర్‌జిహెచ్‌ఎంసి, రాజమండ్రి, డాక్టర్ జిజిహెచ్‌ఎంసి, గుడివాడ జిహెచ్‌ఎంసి, కడపలో పనిచేయవలసి ఉంటుందన్నారు. సంబంధిత విభాగంలో అర్హత కలిగిన డిగ్రీ, పర్మనెంట్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం పైన పేర్కొన్న అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునని ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి మెంబర్ సెక్రటరీ ఆ ప్రకటనలో కోరారు.

## 18న కొండపల్లిలో హెరిటేజ్ ట్రెక్కింగ్



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ప్రపంచవారసత్వ దినోత్సం సందర్భంగా ఈనెల 18న విజయవాడ, కొండపల్లిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా హెరిటేజ్ ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ, ఎన్‌టిఆర్ జిల్లా యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికారసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమాల వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. 18వ తేదీ ఉదయం 6గంటలకు కొండపల్లి ఖిల్లా పైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందన్నారు. క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ భాగస్వామ్యంతో విజయవాడలో హెరిటేజ్‌వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండపల్లిలో మూడురోజులపాటు కొండపల్లి బొమ్మలతో మేళా ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల 8వ తేదీ నిర్వహించిన బొమ్మలపోటీలో విజేతలకు లక్షరూపాయల విలువచేసే బహుమతులు అందచేస్తామన్నారు. 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో సంగీతఝురితో వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు ఎస్‌పి చరణ్, సునీత, తదితరులు పాల్గొంటారని కలెక్టర్ వివరించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌టాక్ విజయవాడ చాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని, ఆర్‌టిహెచ్ విజయవాడ సిఇఓ జి.కృష్ణన్, జిల్లా పర్యాటక అధికారి ఏ.శిల్ప, కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు

● మైనారిటీ సంక్షేమ శాఖ శాఖల మంత్రి ఫరూక్ ● పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళిక బద్ధ చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ శాఖల మంత్రి ఎస్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖలో తప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం సకాలంలో ప్రభావంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానంపై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రుల విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనసరమైన వాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్దతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లు న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలు కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్దంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్యకుమార్‌లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.




# బిజెపి మరింత బలపడాలి

● ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నబిన్‌తో మాధవ్ భేటీ ● ఎపి కార్యక్రమాలపై అభినందనలు, మాధవ్ కృతజ్ఞతలు

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్, హస్తినాపురంలో జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను కలిసి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముందుగా అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన బస్సు యాత్రకు సంబంధించిన చిత్రమాలిక పుస్తకాన్ని నితిన్ నబిన్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆయన అభినందనలు తెలియజేయగా, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలతో సమన్వయం, రాబోయే కార్యక్రమాల అమలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి 15 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయడం, కొత్త సభ్యులను చేర్చడం వంటి కార్యక్రమాలు కూడా ఈ ప్రణాళికలో భాగంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంతో రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఉత్సాహం లభిస్తుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ జీ, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ జీ, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతురమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రవేశద్వారం జగ్గయ్యపేటకు మహర్దశ

● అమరావతి ఇండస్ట్రియల్ హబ్ తొలి నగరంగా జగ్గయ్యపేట ● విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్



గౌతమ బుద్ధ ప్రతిమతో ఏర్పాటుచేసిన ప్రగతిపథం స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

జగ్గయ్యపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రవేశద్వారంగావున్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి మహర్దశ వచ్చిందని, అమరావతి ఇండస్ట్రియల్ హబ్ తొలి నగరంగా జగ్గయ్యపేట అవతరించబోతోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిదేందుకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) గ్రాంటు నుండి విడుదలైన రూ.7.15 నిధులతో పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గౌతమ బుద్ధ ప్రతిమతో ఏర్పాటుచేసిన ప్రగతిపథం స్తూపాన్ని, శిలాఫలకాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా తొలుత మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల మున్సిపల్ చరిత్రలో ఏ పాలకవర్గానికి లభించని కీర్తి తమను వరించిందన్నారు. వందల కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి పర్చుకోవటం గర్వకారణమన్నారు. ఆధునాతన రహదారుల నిర్మాణం, మురుగునీటి పారుదల కల్వర్టులు, ఆధునీకరణ, ప్రతి ఇంటికి మంచినీటి పంపు నూరుశాతం మౌళిక సదుపాయాల కల్పన కూటమి ప్రభుత్వంలో నేతలు ఎంపి శివనాథ్, ఎమ్మెల్యే రాజగోపాల్, కెడిసిసి చైర్మన్ రఘురామ్ సహకారంతో అమలులోకి వస్తుండటం ఎంతో సంతోషాని న్ కలిగించిందన్నారు. ఎంపి శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సిఎం చంద్రబాబు అహర్నిశలు పరిశ్రమిస్తున్నారన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు సమకూర్చి దేశంలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ పట్టణంలో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.7.15 కోట్లు మంజూరు చేయటం ద్వారా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి- సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతుందన్నారు. యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ మాట్లాడుతూ విజయవాడకు సాటిగా జగ్గయ్యపేటలో అభివృద్ధి పనులు జరుగుతుండటం నాయకుల గొప్పతనానికి నిదర్శనమన్నారు. కాగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సచివాలయ సిబ్బంది ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నేతలు ఉద్యోగుల భద్రత, బంగారు భవిష్యత్తు గురించి వివరించి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నేతలు శ్రీరాం ధనుంజయ, నూకల కుమారరాజ, ధూళిపాళ లక్ష్మణరావు, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, కట్టా వెంకట నరసింహారావు, కె కిషోర్, నజీమూన్, కౌన్సిలర్లు బుజ్జిబాబు, వెంకట్, సైదేశ్వరరావు, కంచేటి గీతారాణి, నాగరాజు, వెంకట్రామయ్య, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి 47 అర్జీలను స్వీకరించారు.

# ఇంద్రకీలాద్రి కొండచరియల పటిష్టతపై ఎన్ఐఆర్ఎం అధ్యయనం



ఇఓతో ఎన్ఐఆర్ఎం బృందం సమావేశం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వెలసిన ఇంద్రకీలాద్రి కొండ చరియల పటిష్టతపై ఎన్ఐఆర్ఎం (నేషనల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్) బృందం అధ్యయనం చేసేందుకు బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ నుండి సాంకేతిక బృందం శుక్రవారం దేవస్థానానికి చేరుకుంది. ప్రముఖ శాస్త్రవేత్త ప్రసన్న జైన్ నేతృత్వంలోని ఈ బృందం ఇఓ శీనా నాయక్‌ను కలిసి, క్షేత్రస్థాయి పరిశీలనపై కావలసిన ఏర్పాట్లు పై చెక్ లిస్ట్ సమర్పించి, చర్చించారు. కొండపై తరచుగా రాళ్ల జారిపడుతున్న ప్రాంతాలు, ప్రస్తుతం పటిష్టంగా ఉన్న రాళ్ల విస్తీర్ణం, మట్టితో మిళితమై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బృందం విశ్లేషించనుంది. భవిష్యత్తులో కొండపై నిర్మించతలపెట్టిన పాశుపాతాలయం ప్రదేశం భూగర్భ పటిష్టతను, అలాగే 2వ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది. దేవస్థాన అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యయన నివేదికను సిద్ధం చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతను నిర్ధారించడానికి, శాశ్వతమైన నిర్మాణాలను చేపట్టడానికి ఎన్ఐఆర్ఎం ఇచ్చే సాంకేతిక నివేదిక ఒక బ్లూ ప్రింట్ లాగా పనిచేస్తుంది. ఇది దేవస్థానానికి భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ కవచం లాంటిదని ఈవో పేర్కొన్నారు. ఈ బృందంతో సాంకేతిక సలహాదారు సుబ్రహ్మణ్యం, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ ఆలయంలో ఇఓ పలు విభాగాల తనిఖీ:** దుర్గమ్మవారి ఆలయంలో ఈవో వీకే శీనా నాయక్ వివిధ విభాగాలను శుక్రవారం తనికీ చేశారు. దేవాదాయ కమిషనర్ ఆదేశాల ప్రకారం రద్దీ సమయంలో భక్తులకు అందుబాటులో ఉంటే సమస్యలు తెలుస్తాయన్న అభిప్రాయంతో అన్ని ప్రదేశాలు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. దుర్గా స్నానఘాట్ నిత్యం పరిశుభ్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రేవు అంచుల్లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. దుర్గా ఘాట్ నుండి కేశ ఖండనశాల వైపు ఉన్న అండర్ పాస్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, కేశ ఖండనశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో అన్ని ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది సిబ్బంది గమనించి, రిపేర్లు ఉంటే చేయించాలని ఆదేశించారు. అక్కడ నుండి కాలినడకన కొండపైకి చేరి, భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్‌లో ఈ టాయిలెట్స్ సంఖ్య పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బస్ షెల్టర్, ఓం టర్నింగ్ ఏరియాలో భక్తుల సౌకర్యార్థం అప్పటికప్పుడు కాయిర్ మ్యాట్ వేయించారు. ఆలయం చుట్టూ వేస్తున్న చలువ పందిరి పరిశీలన చేసి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సిఐ గుణరామ్, ఇంజినీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రవీంద్ర, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మవారి సేవలో మంత్రి వాసంశెట్టి:** దుర్గమ్మవారిని శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ఏఈవో అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాన్ని బహుకరించారు.

**శానిటరీ ఇన్‌స్పెక్టర్ తొలగింపు:** ఇంద్రకీలాద్రి కొండదిగువున శ్రీ కనకదుర్గానగర్ మరుగుదొడ్లులో గుర్తు తెలియని యాచకునిగా భావిస్తున్న వ్యక్తి మరణించిన సంఘటనలో విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారించిన దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజినీ ప్రియను విధులు నుండి తాత్కాలికంగా తొలగించినట్లు ఇఓ వికె శ్రీనానాయక్ తెలిపారు.



## జులైలో అందుబాటులోకి భోగాపురం విమానాశ్రయం

**ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానికి ప్రభుత్వం ఆహ్వానం**

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్మాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జులై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులు.. 9.62 లక్షల ఉద్యోగాలు

**- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్‌ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపు. ఎపిఐఐసీ, టిసిఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఎపిఐఐసి, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం లభించినట్లు వివరించారు.

## అమరావతి 40ఏళ్ళయినా పూర్తి కాదు: సజ్జల

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్న ప్రాంతంలో రాజధాని అనేది 30-40 ఏళ్లు అయినా పూర్తి కాదని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. దీనికి ఛత్తీస్‌గఢ్‌లో నిర్మించిన నవ రాయ్‌పూర్ ఉదాహరణ అని ఆయన తెలిపారు. నవ రాయపూర్‌లో బిల్డింగ్‌లు మాత్రమే ఉన్నాయని కానీ జనం లేరని సజ్జల పేర్కొన్నారు. "చంద్రబాబు లెక్కల ప్రకారమే అమరావతి రూ.2-3 లక్షల కోట్లు కావాలి. ఇప్పుడు కేవలం పనిచేసే ఉద్యోగులు ఉండడానికి మాత్రమే కడుతున్నాడు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిలు వీరికి బంగ్లాలు మాత్రం కడుతున్నాడు. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లు డెవలప్ చేయాల్సి ఉంది. అది ఎప్పటికి అవుతుందో ఎవ్వరికీ తెలియదు. ఎలాంటి సౌకర్యాలు, సదుపాయాలు లేని చోట అంతంత డబ్బు పెట్టి ప్రజలు ఎలా ఉంటారు? జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రేట్లు పెట్టి ప్రజలు అక్కడికి ఎందుకు వస్తారు? ప్రజలు భరించలేని రేట్లతో ఏ సదుపాయాలూ లేనిచోట ఎందుకు ఉంటారు? మౌలిక సదుపాయాల కోసమే ఎన్ని లక్షల కోట్లు పెట్టాలి? ప్రజలు రాకుండా సిటీ ఎలా అవుతుంది" అని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.



## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కేంద్ర మాజీ ఎన్నికల కమిషనర్ గోపాలస్వామి, క్రీడాకారుడు పుల్లల గోపీచంద్, తెలంగాణ మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్, సింగర్ శ్రీకృష్ణ, వొజ్జల అద్వితీయ, అంబిక కృష్ణ, ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

**గ్రాండ్ ఫినాలేలో 'మిస్ తెలుగు యుఎస్ఏ 2026'**

## కిరీటాన్ని గెలుచుకున్న అమూల్య బాల్మూరి



హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: గ్రాండ్ ఫినాలేలో 'మిస్ తెలుగు యూఎస్ఏ 2026' కిరీటాన్ని గెలుచుకున్న అముల్య బాల్మూరి కరీంనగర్‌కు చెందిన యువతి. గోల్డ్‌మన్ సాక్స్ ప్రొఫెషనల్ మరియు రచయిత్రి అయిన ఆమె, ఏప్రిల్ 4న జరిగిన గ్రాండ్ ఫినాలేలో 100 మంది పోటీదారుల నుండి ప్రత్యేకంగా పోటీలో నిలిచి టైటిల్‌ను గెలుచుకున్నారు. బి.శ్రీనివాస రావు (రిటైర్డ్, ఐ క్యాడ్ డిపార్ట్‌మెంట్), బి.రమల కుమార్తె అయిన అముల్య బాల్మూరి, మిస్ తెలుగు యూఎస్ఏ 2026 కిరీటాన్ని గెలుచుకున్నారు. ప్రస్తుతం టెక్సాస్‌లోని డల్లాస్‌లో నివసిస్తున్న అమూల్య, కరీంనగర్‌లోని చిట్యలపల్లి గ్రామానికి చెందినవారు. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆల్వాల్‌లో నివసిస్తున్నారు. భోజరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ నేపథ్యంతో తన విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించిన అమూల్య, ఆ తర్వాత మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి, ప్రస్తుతం గోల్డ్‌మన్ సాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో విజయవంతమైన మార్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. రచనపై ఉన్న మక్కువతో ఆమె తన కథలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తూ, ప్రపంచవ్యాప్తంగా 90,000మందికి పైగా పాఠకులను సంపాదించుకున్నారు.

11skl13:11skl13.qxd 11-04-2026 00:32 Page 1



## బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పరమేశ్వరరావు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలానికి చెందిన బైపల్లి పరమేశ్వరరావు నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవన్ ఆదేశాలు మేరకు జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సేవభావం, సామాజిక స్పృహ కలిగిన పరమేశ్వరరావు టెక్కలి నియోజకవర్గంలో బీజేపీకి మంచి ఊపు తెచ్చిన వ్యక్తి. యువకుడు అయిన పరమేశ్వరరావు బీజేపీ అధికార ప్రతినిధికి అర్హుడని పలువురు భావిస్తూ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చేనాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టెక్కలి నియోజకవర్గం ఇంచార్జి కణితి కిరణ్ కుమార్, ఆమదాలవలస ఇంచార్జి పేడాడ రామ్మోహన్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ చైర్మన్ గేదెల చైతన్య, సూడా చైర్మన్ కె రవికుమార్ పలువురు కూటమి నాయకులు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో బీజేపీ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు మాధవన్, తేజేశ్వరరావులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో ప్రతి సామాన్య కార్యకర్తకు అందుబాటులో ఉంటూ గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతనకి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి : రెడ్డిశాంతి



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో నూతనంగా పదవులు పొందిన నాయకులు శుక్రవారం స్థానిక వైకాపా క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ మ్మెల్యే రెడ్డి శాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియామకానికి సహకరించినం దుకు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్ఆర్సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శిగా పాతపట్నం పట్టణానికి చెందిన ఎరుకోల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా కొత్తూరు మండలానికి చెందిన చింతాడ సూర్యనారాయణ నియమితులైన నేపథ్యంలో వారిరువురు వైకాపా శ్రేణులతో కలిసి రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేయాలని ఆమె ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, నాయకులు ఏనుగుతల సూర్యం, ఐ.సింహాచలం, మీసాల రామకృష్ణ, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్లో ఆరోతరగతి ప్రవేశపరీక్ష



కంచిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఎంఎస్ పల్లి ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 12వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాన్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని చీఫ్ సూపరెండెంట్ నడకుదుటి శివప్రసాద్ తెలిపారు. డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎంఈఓ 2 చిట్టిబాబు మాట్లాడుతూ పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందు ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అలాగే హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేసారు. విద్యార్థులు సమయ పాలన పాటిస్తూ నియమ నిబంధనలు ఖచ్చితంగా అనసరించాలని చీఫ్ సూపరెండెంట్ నడకుదుటి శివప్రసాద్ తెలిపారు.

## జనగణన సర్వే సక్రమంగా జరగాలి : ఐటీడీఏ పీవో



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మే 1 నుంచి ప్రారంభం కానున్న జనగణన సర్వేను సిబ్బంది అందరూ సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం సీతంపేట వైటీసీలో ఎన్యూమరేటర్స్, సూపర్ వైజర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వెళ్లి జనగణన సర్వే చేపట్టాలని అన్నారు. సర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకన్య, ఎంపీడీవో బీబీ మిశ్రో, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా .. పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతం : కూన



ఆమదాలవలస, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతం శ్రీకాకుళమని, జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్త రోడ్‌లో ఉన్న శాంతి కన్వెన్షన్ హాల్లో సిఎస్ఆర్ సమ్మెట్‌లో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ జిల్లా పెట్టుబడులకు ఉత్తమమైన, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణమని తెలిపారు. పారిశ్రామికి వేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమలు నిర్మిస్తే సమీపంలో నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులు సులభతరం అవుతాయని తెలిపారు. జిల్లాలో ఎప్పటికీ ఉన్న నేషనల్ హైవేలు పరిశ్రమల రవాణాకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జిల్లాలో పెట్టుబడులు పెడితే ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. జిల్లాను పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పెట్టుబడుదారులు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నల్ దినాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆర్థిక వనరులను, జిల్లా ప్రగతిని వివరించారు. నాయకులు రాష్ట్ర కాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, కూన ఆంజనేయులు, బుదుమూరు సీతారాం, తాండ్ర హరి, హనుమంతు బాలకృష్ణ, గురుగుబెల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలి వైసీపీ నేతలక పిచ్చి ముదిరింది



కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు వాస్తవాలు మాట్లాడుతుంటే ఆ మాటలకు సరైన సమాధానం చెప్పలేక సమాజం తలదించుకునే విధంగా టెక్కలి వైకాపా నేతలు మాట్లాడడం సిగ్గుచేటని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవింద రాజులు అన్నారు. శుక్రవారం సాయంత్రం కోటబొమ్మా లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ ప్రమాదం వెనుక అచ్చెన్నాయుడు పాత్ర ఉందని ఆ ప్రమాదంతో ముడి పెడుతూ వైకాపా నేతలు తప్పుడు కూతలు కూస్తున్నారని అది మంచి పద్ధతి కాదని అన్నారు. అచ్చెన్నాయుడు వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారంటే ప్రజల్లో ఆయనకు ఎంత విలువ ఉందో వేరే చెప్పనక్కర్లేదని అన్నారు. కింజరాపు కుటుంబాన్ని విమర్శించే స్థాయి ఎవరికి లేదని ఆయన జీవితం ప్రజా సేవకే అని రాజకీయాల్లో విమర్శకు ప్రతి విమర్శలు తప్పవని కానీ ఆధారాలు లేని విమర్శలు చేయడం సబబు కాదని అన్నారు.

## చొట్రాయిపురం ఎంపీపీ స్కూల్ తనిఖీ



కంచిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : కంచిలి మండలం చొట్రాయిపురం ఎంపీపీ స్కూల్‌ను మండల విద్యాశాఖధికారి సప్పటి శివరామ ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన సంగ్రహణాత్మక మూల్యాంకనము-2 పరీక్షల యొక్క అసెస్మెంట్ బుక్‌లెట్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మా పాఠశాలకు నరసన్నపేట మండలం కిల్లాం గ్రామంనకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ చింతపల్లి షణ్ముఖరావు 15000 రూపాయలు విలువ గల లౌడ్ స్పీకర్ మరియు భోజన ప్లేట్స్‌ను మండల విద్యాశాఖాధికారి సప్పటి శివరామ ప్రసాద్ చేతులు మీదుగా విద్యార్దులకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు మద్దు తిరుపతి రావు మాస్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సప్పటి శివరాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను, ప్రతిభా పాటవాలు గుర్తించి,పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి తనవంతుగా ఆర్థిక సహాయం అందించిన దాత యగు చింతపల్లి షణ్ముఖరావుకి, ఇంతటి సేవాకార్యక్రమంనకు సమన్వయకర్తగా వ్యవహరించిన చల్ల లింగమూర్తి మాస్టర్ కు,గ్రామం, పాఠశాల, మండల శాఖతరుపున, అభినందనలు తెలియజేస్తూ, విద్యార్థులు అందరూ నిరంతరం మంచి నడవడిక, పట్టుదల, కృషి, సహనం మరియు క్రమశిక్షణతో మెలిగినప్పుడు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు.

## సీతానగరంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



సంతబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మండలంలోని సీతానగరం గ్రామంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కాస్పా నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 58మంది రోగులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరీక్షలు నిర్వహించారు. వెన్ను, మోకాళ్ళు నొప్పులు, డయాబెటిస్, శ్వాస సమస్యలు, చర్మ రోగాలు, ఇతర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వారికి యోగ విశిష్టత, జీవన శైలి మార్పుల వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేసారు. మీకు దగ్గరలో ఉన్న ఆసుపత్రిలోని ఆయుర్వేద వైద్య సేవలు, ఉచిత యోగ శిక్షణ వంటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. వైద్యులతో పాటు యోగ గురువులు ఆసుపత్రి సిబ్బంది ఏ ఎన్ ఎంలు ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీలాపుపుట్టుగలో కాళీమాత ఆలయ ప్రతిష్ట



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : నీలాపుపుట్టుగ గ్రామంలో కాళీమాత ఆలయ ప్రతిష్ట మహోత్సవం మరియు హరేరామ హరేకృష్ణ యజ్ఞం ఈ నెల 15వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాహుదా జలాలతో శోభాయాత్ర నిర్వహించి పూర్ణకలశాలతో పవిత్ర జలాలను తీసుకొచ్చారు. నీలగిరి రామకృష్ణ సిద్ధాంతి, శ్యామసుందర సిద్ధాంతి, నారాయణపాడి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. 11న పూజలు, జలాభిషేకాలు నిర్వహిస్తారు. 12న ప్రతిష్ట, కుంకుమార్చన నిర్వహిస్తారు. ఈ నెల 15వరకు యజ్ఞం అనంతరం పూర్ణాహుతి ఉంటుంది. 9 భజన బృందాలతో భజగోవింద గోష్టి నిర్వహిస్తున్నారు.

## తులసమ్మ సంబరం నిర్వహణపై అధికారుల సమీక్ష



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ వార్షిక సంబరం ఈ నెల 12 ఆదివారం నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఓ జాతరలో కల్తీ బాదంపాలు తాగి 130 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా తులసమ్మ సంబరానికి ప్రభుత్వ అధికారులు సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్ వెంకటరావు పర్యవేక్షణలో పోలీస్, ఎలక్ట్రికల్, మెడికల్, పంచయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, మండల పరిషత్ అధికారులతో పాటు ఆలయ కమిటీతో చర్చించారు. సుమారు 20వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేశారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి తాగునీటి సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరా కల్పించాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెడికల్ క్యాంప్ నిర్వహించాలని, ఆహార నాణ్యత కల్తీ నివారణపై పర్యవేక్షణ ఉండాలని తదితర అంశాలపై సిబ్బందికి విధులను కేటాయిస్తూ సమీక్ష చేశారు.

## 12న మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఈ నెల 12న పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు చెప్పారు. ఉదయం 10 నుంచి 12 వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. 220 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లును పొందాలని, పరీక్షకు ఆధార్‌కార్డు తప్పనిసరి చెప్పారు.

**పాతపట్నం...**



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : స్థానిక పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్లో 2026-27 విద్యా సంవత్సరమునకు 6వ తరగతిలో అడ్మిషన్లు పొందడానికి 100 సీట్లకు 226 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికి ఏప్రిల్ 12వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ కె.వి.రత్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులు తమ కాండిడేట్ ఐడి మరియు పుట్టిన తేదీ ఆధారంగా ఆన్లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకుని ఉదయం 8.30 గంటలకు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. సందేహాలు నివృత్తి కొరకు8919820148 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

## ఐటీడీఏ ఎదుట గిరిజన సమస్యలపై ధర్నా



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : గిరిజనులు సేకరిస్తున్న జీడిపిక్కలు కిలో రెండు వందల రూపాయలుకు గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని. డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఐటిడిఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పీఎం జన్మన్ గృహాల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయాలని గిరిజన ప్రాంతాలలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారులు పూర్తి చేయాలని, జలజీవన్ పనులు పూర్తిచేసి గిరిజనులకు త్రాగునీరు అవసరాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పిఓ పవర్ స్వప్నల్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ఆదివాసి సంఘం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు ఎం.లక్ష్మణరావు, పి.సాంబయ్య, జె.శ్రీరాములు. తదితరులు పాల్గొన్నారు.

## దూడల పెంపకంలో మెలకువలు పాటించాలి



కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : పాడి పరిశ్రమలో లాభాల కోసం శాస్త్రీయ పద్ధతుల్లో దూడల పెంపకం, పోషణ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ముఖ్యమని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డి.ఎల్.డి.ఎ.) సౌజన్యంతో ఉపసంచాలకులు డాక్టర్ సి.హెచ్.సత్య ప్రకాష్ అన్నారు. ఆయన శుక్రవారం తిలారులోని పశువైద్య చికిత్సాలయంనందు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు తిలారు, తుంబయ్యపేట, రావిపాడు ఏనేటి కొత్తూరు గ్రామాల నుండి సుమారు 40 దూడలను తీసుకురావడం జరిగింది. ఇక్కడ పాల్గొన్న దూడలలో తక్కువ వయసులో ఏపుగా పెరిగిన దూడలను, జాతి బట్టి నిర్ధారించుకొని బహుమతులు అందజేశారు. శాస్త్రీయమైన పెంపకంతో దూడలు త్వరగా లైంగిక పరిపక్వం చెంది తక్కువ వయసులోనే మొదట కాన్పుకు సిద్ధమవుతాయి. తద్వారా పాడి పరిశ్రమలో లాభాలు పెరుగుతాయి. స్త్రీ లింగ నిర్ధారణ వీర్యంతో మేలు రకం ఆబోతుల వీర్యకణాలతో శాస్త్రవిజ్ఞాన పరిమళాలతో పాల వెల్లువకు శ్రీకారం చుట్టింది. ఒక లింగ నిర్ధారణ వీర్యం ఖరీదు 1800 రూపాయలు ఉండగా కేవలం 150 రూపాయలకే రైతుకి అందిస్తుంది. రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డా.ఎం.లోకనాథం, డా.ఎమ్.ప్రజ్ఞ చైతన్య, డా. ఎల్.కిరణ్ కుమార్ మరియు మండల పశువైద్యసహాయక సిబ్బంది రాంబాబు, ఫణీంద్ర, ప్రసాదరావు, భాస్కరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## 60 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



కంచిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: సోంపేట ఎక్సైజ్ సిబ్బంది మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కలిసి ఒడిశా సరిహద్దుల్లో కాపు గాసి ఒడిశా నుంచి రెండు కావుళ్ళతో నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకొని వారి వద్ద చెరో 30 లీటర్లు అనగా 60 లీటర్లు నాటు సారా స్వాధీన చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ చెప్పారు. ఒడిశా రాష్ట్రం తుంబగడకి చెందిన భాస్కర్ కార్జీ మరియు కృష్ణ సబర్‌లను అరెస్ట్ చేసి సోంపేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ఇద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించటం జరిగినది. వారి వాంగ్మూలం ద్వారా కంచిలి మండలం దొలసాయి గ్రామానికి చెందిన చైతన్య భుయ్యా మీద కూడా కేసు నమోదు చెయ్యటం అయినది. గతంలో నాటు సారా కేసులు కలిగి ఉన్న వారి అందరి మీద ప్రత్యేక నిఘా మరియు అందరి మీద బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నామని తెలిపారు. సోంపేట ఎక్సైజ్ సి.ఐ రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సి.ఐ శ్రీనివాస్ ఎస్.ఐలు సుజాత, జగన్నాథ్ సిబ్బంది విజయ్, రమణ, గాలిబ్, వెంకటేష్, ఉమాపతి మరియు మార్కారావులు పాల్గొన్నారు.

## మురుగు కాలువలు శుభ్రం చేయాలి



సంతకవిటి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : బిల్లాని పంచా యితీ ఇజ్జిపేట గ్రామంలో మురుగు సమస్యలు తీవ్రంగా మారాయి. గ్రామంలోని కాలువలు అస్తవ్యస్తంగా మారి, మురుగు తీయకపోవడంతో చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వ్యాపిస్తూ, దోమల బెడద ఎక్కువై స్థానికులు రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎగువ ద్వారబంధంలో హ్యాబిటేట్ రైట్స్‌పై అవగాహన



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: అటవీశాఖ ఐటీడీఏ రెవెన్యూ సంయుక్తంగా హ్యాబిటెడ్ రైట్స్ పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం సీతంపేట మండలంలోని ఎగువ ద్వారబంధం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ హాబిటెడ్ రైట్స్ ఇవ్వడానికి గల అర్హతలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజనులు యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హ్యాబిటెడ్ రైట్స్ పంపిణీకి అవసరమయ్యే అన్ని అంశాలపై గిరిజనులకు పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటా ప్రతినిధి గిరిరావు, గిరిజన సంక్షేమ శాఖ అటవీ శాఖ స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణమూర్తి, ఐటిడిఏ ఏపీఓ జి.చిన్నబాబు, పార్వతీపురం ఐటిడిఏ ఏపీవో మురళీధర్ అటవీశాఖ రేంజర్ రామారావు డిప్యూటీ తహసిల్దార్ శ్రీవిద్య. తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## రవీంద్రభారతిలో ఘనంగా కిడ్స్ కాన్వొకేషన్





పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం ఘనంగా కిడ్స్ కాన్వొకేషన్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డా. భారతి కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దే దిశగా ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయడం ద్వారా చిన్నారుల్లోని ఆత్మవిశ్వాసం పెరిగి వారికి మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తి సామర్థ్యాలు వెలికి తీయడానికి తోడ్పడే విధంగా ఈ విద్యా విధానం అమలు చేయడం ద్వారా వారి భావి జీవితానికి మెరుగులు దిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నార్త్ ఆంధ్రా జోనల్ ఇంచార్జ్ వెంకటేష్, సీ జీ యం.వసంత, జీ యం కె.రమ్య, చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో చిన్నారులు చేసిన పలు నృత్యాలు అందరినీ అలరించాయి.

## నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది నవధాన్య విత్తన కిట్స్‌ను తయారు చేశారు. సందర్భంగా డిపిఎం పూజారి సత్యనారాయణ మాట్లాడుతూ నోడల్ బి.ఆర్.సి సెంటర్‌లో రెండు వేల విత్తన కిట్స్ ను తయారు చేశామన్నారు. రైతులతో నవధాన్య విత్తన సాగుకు అవసరమైన విత్తనాలను ప్రస్తుత సిబ్బంది అందరూ కూడా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సరైన ప్రణాళికలు చేసుకొని విత్తన కిట్స్‌ను రైతులందరికీ పంపిణీ చేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ డిపియం ధనుంజయరావు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలి



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఇటీవల వరుసగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై మరియు అన్నమయ్య జిల్లా పీలేరులో న్యాయవాదిని హత్య చేయడం అత్యంత దారుణమని పాతపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకుగాను చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. న్యా యవాదులు వృత్తి ధర్మం నిర్వర్తించినందుకు భౌతిక దాడులు చేయడం, అలాగే హత్య చేయడమన్నది అత్యంత హేయమైన చర్య అని తెలియజేస్తూ శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులపై జరుగుతున్న వరుస సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకుగాను తక్షణమే పటిష్టమైన న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉర్లాన దాలయ్య, జనరల్ సెక్రటరీ మద్దిల రమణ, ఉపాధ్యక్షులు గొంటి రామ్మోహన్ రావు, ఏజీపి బుద్దల ఈశ్వర సత్యనారాయణ, న్యాయవాదులు మెట్ట రామారావు, గేదెల సూర్యారావు, పి.ఈశ్వర సత్యన్నారాయణ పట్నాయక్, సంపతిరావు రవికుమార్, లుకలాపు యుగంధరరావు, గంగు సుం దరరావు, పద్ద అప్పలనాయుడు, చెంచల రామకృష్ణ, సిష్ఠ షణ్ముఖరావు, ముక్త అప్పలరాజు, శ్రీహరి, బాడాన వెంకటప్పల నాయుడు, కూర్మాపు రామారావు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జనగణన యాప్‌ను అనుసరించి విధులు నిర్వహించండి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : గ్రామాల్లో జనగణన యాప్ ను అనుసరించి విధులు నిర్వహించాలని సంబంధిత ట్రైనీలు సూర్యనారాయణ, మల్లేశ్వరరావులు అన్నారు. రెండవ రోజైన శుక్రవారం 40 మంది సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు ఈ జనగణన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాప్‌లో పొందుపరిచిన 34 అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి జనగణన నమోదు పత్రాలలో పూరించాలన్నారు. యాప్‌ను ఎలా డౌన్లోడ్ చేయాలి, దానిని ఎలా నిర్వహించాలి, అనుసరించవలసిన విషయాలను ఈ శిక్షణ ద్వారా తెలియజేశారు. శిక్షణ సమయంలో వీరికి ఆహార, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆయనతో ఏ.ఎస్.ఓ ఏ.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల లక్ష్యాలు పూర్తిచేయనివారిపై చర్యలు





సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనుల్లో సిబ్బంది లక్ష్యాలు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని మన్యం జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు మండలంలో 40 కోట్ల రూపాయలు మేర ఉపాధి హామీ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పనులు సక్రంగా జరిగాయా లేదా అనే దానిపై ప్రజావేదిక నిర్వహించడం జరిగిందన్నారు. వేతనదారులకు పనులు కల్పించే బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉందన్నారు. అలా ఏ సిబ్బంది అయినా కల్పించకపోతే చర్యలు కట్టిన తరంగా ఉంటాయి అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్ ఎంపీడీవో బీబీ మిశ్రా. ఏపీ డి.త్రివిక్రమరావు అంబుడ్స్ మాన్ ఎన్ తిరుపతిరావు. కే మాధవరావు. ఈసీ పాండురంగనాథం, ఏపీవో సాగర్ , తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ బీజేపీ బీఎల్‌ఏ 1 గా త్రివేణి



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ పాతపట్నం నియోజకవర్గ బీఎల్‌ఏ1గా సిరిపురం త్రివేణి నియమితులయ్యారు. విశాఖపట్నంలో నిర్వహించిన సమగ్ర ఓటరు సవరణ -2026 శిక్షణా కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సూచన మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఈ నియామకాన్ని ఖరారు చేసారు. ఈ సందర్భంగా శిక్షణా వేదికపై మాధవ్ నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు తేజేశ్వరరావుకు అందజేశారు. రానున్న ఓటరు సవరణ ప్రక్రియలో నియోజకవర్గ స్థాయిలో ఓటర్ల జాబితా క్రమబద్ధీకరణ, కొత్త ఓటర్ల నమోదు వంటి కీలక అంశాల్లో త్రివేణి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. పార్టీ బలోపేతానికి, పారదర్శకమైన ఓటరు నమోదుకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమ్మవారి గుడి కాలనీలో సీసీ రోడ్డు పనులు



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభతవార్త : పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవతో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. శుక్రవారం స్థానిక అమ్మవారి గుడి కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్, టిడిపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే గోవిందరావు ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజల కనీస అవసరాలైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు అక్కంధ్ర సన్యాసి, ఆర్.చలపతి, నట్టు స్వామి, శాసనపురి వెంకటరమణ, డోల కుమార్, నక్క మార్కండేయులు, గోరుశెట్టి దుర్గారావు, తాడేల సుధాకర్, లోకేష్, నెయ్యల వెంకీ, త్రినాధరావు, టంకాల సోమేశ్, పి.మోహనరావు, తార విజయ్ కుమార్, చంటి, బుజ్జి, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా శామ్యూల్ హనీమూన్ జయంతి



కవిటి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : హోమియోపతి వైద్య పితామహుడు క్రిస్టియన్ ఫ్రెడిక్ శామ్యూల్ హనీమూన్ 271 జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగతి శివాలయం ఆవరణలో నిర్మించిన శామ్యూల్ హనీమూన్ విగ్రహానికి సోంపేట ఎంపీపీ నిమ్మాన దాసు, జగతి హోమియో డాక్టర్ దుర్గాప్రసాద్ పట్నాయక్‌తో పాటు తాజా మాజీ సర్పంచ్ పూడి వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు జై ప్రకాష్ గ్రామ పెద్దలు భావన సీతారామమూర్తి పూడి వెంకటేశం భావన నారాయణమూర్తి, ప్రియ జోగయ్య భావన చంద్రశేఖర్ భావన కామేశ్వరరావు సమల ధనుంజయ పూడి వెంకటరమణ గుడియా సంతోష్ లమ్మత ప్రభాకర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూసారం తగ్గిపోవడం వల్లే పంట దిగుబడి తగ్గుదల

గరుగుబిల్లి , ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలం తోటపల్లిలో గల అన్నపూర్ణేశ్వరి శిక్షణాలయంలో ఖరీఫ్ 2026 సన్నద్ధత, ఎల్ నినో ముందస్తు జాగ్రత్తలు మరియు సీడ్ టు సీడ్ ప్రకృతి వ్యవసాయ వ్యూహాలపై జరుగుతున్న 3 రోజుల శిక్షణలో పాల్గొన్న నైరా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జోగి నాయుడు పాల్గొని కొన్ని ముఖ్య సూచనలు చేసారు. రెండు బృందాలుగా జరుగుతున్న సుమారు 120 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధిక దిగుబడుల ఆశతో ఏడాదికేడాది రసాయన ఎరువులు, పురుగుమందులు, కలుపు మందులు పరిమాణం పెంచుతూ పోవడం వలన నేలలో సారం తగ్గుతోందని ఫలితంగా దిగుబడులు తగ్గిపోయి వ్యయం పెరుగుతోందని ఈ అంశాన్ని రైతు సోదరులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీలీలీ కన్సల్టెంట్‌లు వ్రాసు దేవరావు , శ్రీమతి ఉమామహేశ్వరి , శ్రీమతి విరాజిత, సన్యాసి రావు , ఎం.టి.ఎల్ గణేష్ చంద్ర, ఎన్.ఎఫ్. ఏలు అన్నపూర్ణ, ముసలయ్య, శారద, జట్టు ట్రస్టు సిబ్బంది, ఏపీ సి ఎన్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కే.కృష్ణాపురంలో పోషణ పక్వాడా కార్యక్రమం



దత్తిరాజేరు ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలంలోని కే కృష్ణాపురం ఎం. లింగాలవలసలో తాత్కాలిక సూపర్వైజర్లు ఇందిరా భవాని అపర్ణ రాణి అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలకు బాలింతలు చిన్నారులకు పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పోషణ పక్వాడ కార్యక్రమాలను అన్ని అంగన్వాడి కేంద్రాల్లో జరిపించాల న్నారు మొదటి ఆరు సంవత్సరాల్లో లోపు పిల్లలకు మెదడు అభివృద్ధిని గరిష్ట స్థాయికి చేర్చడం అనేది ముఖ్య ఉద్దేశమన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా పుడతారన్నారు పోషకాహార లోపం నివారణ పై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా గర్భిణీ తీసుకోవాల్సిన ఆహారం ఆరోగ్యం రక్తహీనత గురించి 1000 రోజులు సంరక్షణ తల్లి బిడ్డ ఆరోగ్యం నవజాతి శిశువు సంరక్షణ పరిశుభ్రతల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు విజయలక్ష్మి ఏఎన్ఎంలు హెల్పర్లు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## పిల్లలకు పోషకాహారంలో జాగ్రత్తలు పాటించాలి



శృంగవరపుకోట,ఏప్రిల్10, ప్రభాతవార్త : పిల్లలకు అందించే పోషకాహారంలో తగు జాగ్రత్తలు పాటించాలని అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం తెలిపారు. శుక్రవారం మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ మెట్టపాలెం గిరిజన గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషక పక్వాడ పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పోషకాహార విలువలు తీసుకోవలసిన జాగ్రత్తలుపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్ర కార్యకర్తలు, సిబ్బంది, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## జీవనోపాధులకు ఆర్థిక రుణాలపై శిక్షణ



నెల్లిమర్ల, ఏప్రిల్ 10,ప్రభాతవార్త : మండలంలోని రామతీర్ధం సచివాలయంలో కల్కి పద్మావతి క్లస్టర్ విఓ ఓబీ, విఓ ఏ, ఈ నారిలకు ఏసి ఎల్ పి పై ఏపీఎం సురేష్ పర్యవేక్షణలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. 202627 సంవత్సరానికి గాను సభ్యులకు అవసరమైన జీవనోపాదులుకు కావలసిన అప్పు వారికీ అవసరమయిన నెలలో పొందుటకు, వారికి కుటుంబ అవసరాలకి కావాల్సిన మొత్తం ఏ నెలలో కావలసింది? ఎంత మొత్తం కావాలి? అనే వివరాలు ఏ సి ఎల్ పి యాప్ లో ఏ విధముగా చేయాలన్న వివరాలు కోసం సభ్యులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఆర్థిక అవసరాలకు రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లింపులు అవకాశాలు గురించి తెలుసుకున్నారు. శిక్షణ కార్యక్రమానికి ఎల్సి నర్సింగరావు, ఏ. సూరీడమ్మ , ఎస్. అప్పలనాయుడు , ఎస్. శ్రీను వాసరావు ఈ నారి లు, వివిధ గ్రామాలకు చెందిన వివో లు ఓబిలు ,స్థానిక వివోఏ మనోజ హాజరయ్యారు.

## సర్వసిద్ధి రమణ మాస్టర్ విగ్రహావిష్కరణ



బొబ్బిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గొల్లపల్లి గ్రామానికి చెందిన సర్వసిద్ధి రమణ మాస్టర్ విగ్రహావిష్కరణ ఎమ్మెల్యే ఆర్‌విఎస్ కే రంగారావు చేతుల మీదగా ఘనంగా గొల్లపల్లి గ్రామంలో నిర్వహించారు. శుక్రవారం గొల్లపల్లి గ్రామంలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వి ఎస్కే రంగారావు ,(బేబీ నాయన) ఆధ్వర్యంలో వార్డు మాజీ కౌన్సిలర్ కాకల వెంకట్రావు. గోవిందమ్మ టిడిపి పార్టీ ఇంచార్జ్ నాయుడు. బొబ్బది తవిటి నాయుడు పిరిడి ఈశ్వరరావు. సర్వసిద్ధి సూర్యనారాయణ ఆధ్వర్యంలో బేబీ నాయన ఆర్థిక సహాయంతో వార్డు కేంద్రములో సమాజ సేవకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వసిద్ధి రమణ మాస్టర్ అశువుల బాసి ఐదు సంవత్సరాలు అయినా తన సేవలను గుర్తించి కాకల వెంకట్రావు బేబీ నాయన సౌజన్యంతో కూడలిలో తన విగ్రహాన్ని ప్రతిష్టించడం ఎంతో ఉన్నతమైన భావమని పలువురు ప్రశంసిస్తున్నారు. సందర్భంగా బేబీ నాయన మాట్లాడుతూ రమణ మాస్టారు పేద ప్రజల అభ్యున్నతికి బడుగు బలహీన వర్గాల ఉన్నతిని సాధించాలనే ప్రతి నిత్యము జీవితం ఉన్నంతవరకు పాటుపడాలని ఆయనను గ్రామస్తులు మరువు రాణి వ్యక్తిగా తన విగ్రహాన్ని ప్రతిష్టించుకోవడం మన సాంప్రదాయంగా భావించారన్నారు. బొబ్బిలిలో ఎన్నో కుటుంబాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వీణలు తయారీ కార్మికులు ఉన్నారని వారికి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉండాలంటే ఇక్కడ వీణ నిర్మిత కేంద్రం తయారు చేయాలని అప్పటి ప్రభుత్వాలను పోరి మన జిల్లాలో పనిచేసిన కలెక్టర్ నాగిరెడ్డి చేతుల మీదుగా మీనా కేంద్రాన్ని క్రాఫ్ట్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో ఆయన కృషి ఎనలేనిదని గ్రామస్తులు అంటున్నారు. ఆయన కృషి ఫలితమే మా కుటుంబాలు వీణ కేంద్రంలో బ్రతుకుతున్నామని అన్నారు. అందుకు బొబ్బిలి రాజులు సహకారం ఎప్పుడూ ఉంటుందని బేబీ నాయన వారికి అభయమిచ్చారు. రమణ మాస్టర్ కుటుంబ సభ్యులతో పాటు గొల్లపల్లి గ్రామంలో ఎస్సీ వీధికి సంబంధించి అనేక కుటుంబాలు ఈ కార్యక్రమానికి హాజరవ్వడం చాలా సంతోషంగా ఉందని బేబీ నాయన కొనియాడారు. ఆయనతో అనుబంధం ఉన్న రాజకీయ నాయకులు కార్మికులు కార్మిక అధ్యక్షులు కుల మతాలకు అతీతంగా జిల్లా స్థాయిలో ఆయన విగ్రహారానికి విచ్చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు : మంత్రి

సాలూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : రాష్ట్ర పేదప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)



ఎంతో భరోసాను కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా టౌన్, రూరల్ కు సంబంధించిన ఆనారోగ్య సమస్యలతో భాదపడుతున్న లబ్ధిదారులకు సీఎం సహానిధి ద్వారా సుమారు 9లక్షల 87వేల 512 రూపాయల చెక్కులను సంధ్యారాణి చేతులు మీదుగా అందజేశారు.అనంతరం మాట్లాడుతు పేదల కష్టకాలంలో ధైర్యాన్నిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోవడం కూటమి ప్రభుత్వం భాద్యతని మంత్రి క్లారిటీ ఇచ్చారు.అలాగే చిక్కులు అందుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు అలాగే రాష్ట్ర మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలియజేశారు.టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది.చిట్టి, హర్షవర్ధన్,కిలారి.రవి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించని వాహనదారులకు ఎస్ఐ క్లాస్



నెల్లిమర్ల, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్క వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని నడపాలని నెల్లిమర్ల ఎస్సై బి. గణేష్ తెలిపారు. శుక్రవారం వెహికల్ చెకింగ్ నిర్వహించి హెల్మెట్ ధరించని వారికి ప్రత్యేకంగా క్లాస్ నిర్వహించి హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలు, గతంలో హెల్మెట్ ధరించకపోవడం కలిగే అనర్ధాలు వివరించారు. అలాగే హెల్మెట్ ధరించకపోతే పోలీసులు 1035 ఫైన్ విధించడం జరుగుతుందని దానికి బదులుగా మంచి హెల్మెట్ కొనుక్కొని ధరించడం వల్ల తమ ప్రాణాలని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. హెల్మెట్ కొనే సమయంలో మంచి నాణ్యతతో కూడిన ఐ ఎస్ ఐ మార్క్ ఉన్న హెల్మెట్లను కొనుక్కొని ధరించాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, దీనివల్ల తల్లిదండ్రులు కూడా కేసుల్లో ఇరుక్కుంటారని ఆయన హెచ్చరించారు.

## ఫేకర్ కాలనీలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



గరివిడి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: గరివిడి ఫేకర్ జె టైప్ కాలనీ లో గత కొంతకాలంగా విద్యుత్తు సర్వీసు వైర్లు వేలాడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం ప్రమాదమని తెలిసినా అదే వైర్లు కింద నుండి రాకపోకలు సాగిస్తూ కాలనీ వాసులు జీవనాన్ని సాగిస్తూ ఉన్నారు. ప్రమాదం అంచున వారు బితుకు బితుకు మంటూ బతుకు తున్నారు. అధికారులకి తమ గోడు వెళ్లగక్కుకున్నా,పాలకులకు తమ వేదన చెప్పుకున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. అదిగో,ఇదిగో అంటూ అధికారులు, పాలకులు కాలయాపన చేస్తున్నారని జె టైప్ కాలనీ వాసులు మొర్రో అంటున్నా రు. విద్యుత్తు తీగలు వలన ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో నని ఆ కాలనీ వాసులు కంటిమీద కునుకు లేకుండా నివసించే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. విద్యుత్ సర్వీసు వైర్లు వేలాడే ప్రాంతంలో కొత్తగా విద్యుత్తు స్థంభం నెలకొల్పి తీగలు ఎత్తు పెంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



గరివిడి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండలం లోని వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులకు శ్రీరామ్ నగర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ చేశారు. మండలం లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లకు చెందిన మూడు వేల మంది విద్యార్థులకు ఉచితంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. నేత్ర పరీక్షలు నిర్వహించిన విద్యార్థుల్లో 90 మంది విద్యార్థులకు కళ్ళద్దాలు అవసరమైన దృష్ట్యా వారికి లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీరాం నగర్ అధ్యక్షులు బలిజేపల్లి రవి, ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి ప్రసన్న కుమార్,ప్రతినిధులు మూర్తి తదితరులు కళ్ళద్దాలు అందించి విద్యార్థుల్లో ఆనందం నింపారు. శ్రీరాం నగర్ లయన్స్ క్లబ్ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 12న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

భోగాపురం ఏప్రిల్ 10 ప్రభాతవార్త : భోగాపురం ఆదర్శ పాఠశాలలో ఆదివరం ఉదయం 10:00 గంటల నుండి 12:00 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఉదయం 9:00 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి హాల్ టికెట్ తప్పనిసరి. విద్యార్థులందరికీ పరీక్షలో విజయాన్ని ఆకాంక్షిస్తూ.. ఏప్రిల్ 10న నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల వివరాలు, ప్రవేశ పరీక్షకు సంబంధించిన సూచనలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మోడల్ పేపర్లు మరియు వీలైతే ప్రాక్టీస్ షీట్లు పంపిణీ చేయబడినవి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన , ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రి టీజీ భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే బోనెల



పార్వతిపురం, ఏప్రిల్ 10, ప్రభాత వార్త: రాష్ట్ర ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్తాను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చేనెల పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి హాజరు కావాలని మంత్రిని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాటి ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరుకావాలని మంత్రి ని కోరడం జరిగిందన్నారు. పార్వతీపురంలో ఇండస్ట్రీస్ గురించి ప్రయత్నాలు చేస్తున్నామని, దీనికి సహకరించాలని మంత్రి ని కోరడం జరిగిందన్నారు. దీనికి ఆయన స్పందిస్తూ ఎంఎస్ఎంఈ పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు తొందర్లోనే ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చారని, వాటి ప్రారంభోత్సవానికి కూడా హాజరు అవుతానని చెప్పడం జరిగిందన్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ తహశీల్దార్ విచారణ



వేపాడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : విజయనగరం గ్రీవెన్స్‌లో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ నుండి వచ్చిన ఆదేశాలపై శుక్రవారం డిప్యూటీ తహసిల్దార్ పి రామకృష్ణ విచారణ జరిపి మూడు గ్రామాల రైతుల నుండి వివరాలు సేకరించారు. మండలంలోని గుడివాడ రెవిన్యూలో సర్వేనెంబర్ 175/1,2,3,4,5 లలో గల సుమారు 15 ఎకరాల సాగు భూమికి సంబంధించి సాగులో ఉన్న రైతులు తమకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గుడివాడ గ్రామంలో రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి మా సాగులోనే భూమి ఉందని ఆ భూమిని మా పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు చేయాలని,15 మంది రైతులు విజ్ఞప్తి చేశారు. అలాగే అదే భూములో సాగులో ఉంటున్న మరో ఇద్దరు రైతులు ఆ భూమిని మేము అమ్మేశామని ఆ భూమిపై పట్టాదార్ పాస్ పుస్తకాలు కొరకు మ్యుటేషన్ పెట్టుకున్న నవుడూరి సత్య వెంకటరమణమూర్తి పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని చెప్పగా వారి వాంగ్మూలం అధికారులు తీసుకున్నారు. పై విషయాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామని ఉప తహసిల్దార్ పి.రామకృష్ణ తెలిపారు. కాగా ఈ విషయంపై తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం సరికాదని గ్రామంలో రైతులు మధ్య కాసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. గ్రామ పెద్దలు కలుగజేసుకుని ఫిర్యాదు పై వచ్చిన అధికారులు విచారణలో ఎటువంటి అల్లర్లకు పాల్పడకూడదని సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. రెవెన్యూ అధికారులతో పాటు రైతులు వంటాకు శ్రీను, బూసరి సింహాచలం నాయుడు, బూసరి అప్పల నాయుడు, ఆర్. ముత్యాల నాయుడు , వంటాకు వెంకటరమణ, వంటాకు గోవింద , జక్కాన దేముడు, గ్రామ పెద్దలు సిరికి సూర్యనారాయణ, జగన్నాధం, కృష్ణంనాయుడు, బూసరి కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి



బలిజిపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : అరసాడ గ్రామంలో గురువారం రాత్రి ట్రాన్స్ఫార్మర్తుకు గురవడంతో యధా స్థానంలో కొత్త 63 కెవి ట్రాన్స్ఫార్మర్ తెచ్చి బిగించి యధావిధిగా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్దించిన విద్యుత్తు సిబ్బంది విద్యుత్ సింహాచలం లైన్ మాన్ సతీష్ కోట్ల బుజ్జి ధనంజయ తదితరులు సహకారంతో పునరుదించడం జరిగింది దీనికి అరసాడ గ్రామ ప్రజలు విద్యుత్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

విజయనగరం 25
పార్వతీపురం మన్యం
వార్త

## బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న డిపో రైస్ స్వాధీనం ... ఆటో సీజ్



సాలూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : సాలూరు మండలం దండిగం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న డిపోరైస్(పీడిఎస్) జిల్లాపౌర సరఫరాల అధికారి బి.అశోక్ ఇంకా డిప్యూటీ తాసిల్దార్ షేక్ ఇబ్రహీం స్వాధీనం చేసు కున్నారు. శుక్రవారం వారు తెలియ జేసిన వివరాలు ఇలాఉన్నాయి. దండిగం నుండి ఒరిస్సా రాష్ట్రానికి ఎపి35 టిబి 0759 నెంబర్ ఆటోలో వెయ్య కిలోలు డిపోబియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నమన్నారు. అలాగే ఆటోను సీజ్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్ కు అప్పగించామని తెలిపారు.అంతేకాకుండా డిపోరైస్ తరలిస్తున్న సీదరపు. దాలయ్య, మువ్వల.నారాయణ పై జిల్లా సబ్ కలెక్టర్ కోర్టులో 6ఏ కేసు నమోదు చేసామని క్లారిటీ ఇచ్చారు. అజయ్,హరిప్రసాద్, తేజోరామ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో తప్పిన పెను ప్రమాదం



మక్కువ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మండల కేంద్రంలో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. విస్తరణలో భాగంగా రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణాలను శుక్రవారం సాయంత్రం ప్రోక్లనర్ సహాయంతో తొలగిస్తున్న సమయంలో దుకాణం పిల్లర్ విరిగి విద్యుత్ స్తంభాల పై ఉన్న ఫైబర్ నెట్ వైర్లపై పడడంతో చివరగా ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడింది. విద్యుత్ స్తంభం దగ్గర ఉన్న సిహెచ్ రామకృష్ణ వాహనంపై విద్యుత్ స్తంభం విరిగిపడడంతో వాహనం మొత్తం ధ్వంసం అయింది. అయితే విద్యుత్ స్తంభం విరిగి పడేటప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే అప్పుడే వాహనం దగ్గర ఉన్న వ్యక్తులు దూరం జరగడంతో ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. హఠాత్తుగా ప్రమాదం జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురి అయ్యారు.

## 8వ పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన



తెర్లాం, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) : 8 వ పోషణ పక్వాడా కార్యక్రమం పైన గర్భిణీలకు బాలింతలకు అవగాహన కార్యక్రమలో జిల్లా శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారిని కేవీ బాలమణి పాల్గొన్నారు . శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా జిల్లా శిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారిని కేవీ బాలమణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులు ఆరోగ్యం పైన తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారం పై ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ దృష్టి సారించాలని పోషక విలువలు కలిగిన పదార్థాలు సేవించాలని గర్భంలో పెరుగుతున్న శిశువుకు బలమైన ఆహార అందించే దిశగా గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలు మీకు అందుబాటులో ఉన్నాయని తద్వారా కేంద్రాల నుంచి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్విని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెరుమాలి తె ర్లాం సెక్టార్ అంగన్వాడి సూపర్వైజర్ అపర్ణ ఈశ్వరమ్మ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కౌన్సిలర్ అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అధికారులు

కొమరాడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలంలో నాగావళి నది తీర ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసినట్లు కొమరాడ తహసిల్దార్ రత్నకుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కొమరాడ రెవెన్యూ సిబ్బంది పోలీసులు సంయుక్తంగా చేపట్టిన దాడులలో నాగావళి నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకోవడం జరిగిందన్నారు.

## మామిడిపల్లిలో డ్రై డేపై అవగాహన : తహశీల్దార్

సాలూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మామిడిపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించామని తాసిల్దార్ ఎం సురేష్ స్థానిక విలేకరులకు తెలిపారు.ఆయన తెలియజేసిన వివరాలు ప్రకారం అక్కడ గ్రామ ప్రజలకు డ్రైడే గురించి అవగాహన కల్పించామన్నారు.అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశామన్నారు.అంతేకాకుండా పారిశుధ్య కార్మికులతో దోమల నివారణకు కాలువలలో మందు పిచికారి దగ్గరుండి చేయించారు. అలాగే నీటి నిల్వాలు లేకుండా చర్యలు చేపట్టామని ఎమ్మార్వో క్లారిటీ ఇచ్చారు.సచివాలయ, అంగన్వాడి,ఆశాలు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు మత్తుపదార్థాలు పై అవగాహన..ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్. కురుపాం ఏప్రిల్ 10 ప్రభాతవార్త. మత్తు పదార్థాలు వినియోగిస్తే వచ్చే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కురుపాం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు . శుక్రవారం నవోదయమ్ కార్యక్రమం లో భాగంగా కురుపాం మండల కేంద్రంలో ఉన్న బాలురు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో మత్తు పదార్థాలు సేవించడం వలన సంభవించే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహచర విద్యార్థులు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి అలవాట్లకు లోనైతే తమకు తెలియజేయజేస్తే వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, విద్యార్థులు అందరూ వారి నైపుణ్యాలను నిరంతరం మెరుగు పరుచుకుంటూ లక్ష్యాలను సాధించి మంచి పౌరుడిగా ఎదిగి సమాజ అభివృద్ధికి తమవంతు ప్రయత్నం చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ రాజ శేఖర్, సిబ్బంది హాజరయ్యారు.

## టీడీపీకి కార్యకర్తలే పునాది : ఎమ్మెల్యే కోళ్ల



లక్కవరపుకోట, ఏప్రిల్ 10, ప్రభాత వార్త : టీడీపీకి రాష్ట్రములో అలాగే నియోజకవర్గంలో వున్నా కార్యకర్తలే గట్టి పునాధులు అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు శుక్రవారం ఎల్. కోటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలోనూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ కార్యకర్తలు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై ఈ సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడతామని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష

వేపాడ, ఏప్రిల్ 10 , ప్రభాతవార్త: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఈ నెల 12వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్ ఈశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ పరీక్షను ఆదివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్లో హాల్ టికెట్లు పొందలేని వారు శనివారం పాఠశాలకు వచ్చి హాల్‌టికెట్లు పొందవచ్చని కోరారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 12వ తేదీ ఉదయం 8:30 గంటలకు ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో హాజరు కావలసి ఉంటుందని సూచించారు.

ఆర్.ఓ.సి.నెం.70/2023-ఎ1.తే.10.04.2026 ది నగర పంచాయితీ కార్యాలయం నెల్లిమర్ల.

**బహిరంగ వేలం నోటీసు**

నెల్లిమర్ల నగర పంచాయితీకి సంబంధించి 2026-27 సంవత్సరమునకు గాను రోజువారి రోడ్డు మార్జిన్ మరియు మార్కెట్ ఆశీలు వసూలు చేసుకునే హక్కును లీజుకు ఇచ్చుటకు తే.13.04.2026దీన సోమవారం నాడు నగర పంచాయితీ కార్యాలయం నందు ఉదయం 11.30 గంటకు కమీషనరు వారిచే గాని అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలం పాట నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొన దలచిన వారు నిర్ణీత ధరావత్తు సైకం చెల్లించి తే.13.04.2026 కి ముందు పొందినటువంటి రూ.1,00,000/-ల విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు ఇ.సి.లతో 2026-27 సంవత్సరము వేలం నోటిఫికేషన్ నందలి షరతులకు లోబడి పాటలో పాల్గొనవలెను. ఇది వరకు గుత్తలు సక్రమముగా చెల్లించని వారు మరియు వారి కుటుంబసభ్యులు వేలం పాట నందు పాల్గొనుటకు అనర్హులు. మిగిలిన వివరములు పొందుగోరు వారు ఈ కార్యాలయం పనిచేయు వేళలో ఎ1 గుమాస్తా వారి నుండి పొందగలరు మరియు సదరు పాట దక్కించుకున్న పాటదారు సబ్ రిజిస్ట్రార్, నెల్లిమర్ల వారి కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ చేయించి సంబంధిత కాపీలు ఈ కార్యాలయమునకు దాఖలు చేయవలెను.

| క్ర. నెం. | గుత్త వివరములు | కాల పరిమితి | ధరావత్తు | సాల్వెన్సీ విలువ | అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ కొరకు స్టాంప్ డ్యూటీ నిమిత్తం డిపాజిట్ | పాడిన పాటపై జిఎస్‌టి % |
|---|---|---|---|---|---|---|
| 1 | రోజువారి రోడ్డు మార్జిన్ మరియు మార్కెట్ ఆశీలు వసూలు చేసుకొనుటకు | తే.01.04.2026 ది నుండి తే.31.03.2027 ది వరకు | రూ. 50,000/-లు | రూ. 1,00,000/-లు | రూ. 6,000/-లు | 18% |

కమీషనరు, నెల్లిమర్ల నగర పంచాయితీ

11-04pg10.qxd:11-04pg10.qxd 1/1/02 6:25 AM Page 1






# ధోనీ స్టయిల్ ఫినిష్

*ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రతి ఏటా కొత్త కొత్త డైమండ్లను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. నిన్నటి దాకా ఎవరికీ తెలియని ఆటగాళ్లు రాత్రికి రాత్రే స్టార్‌లుగా మారిపోతుంటారు. 2026 సీజన్‌లో అచ్చం అలాగే వెలుగులోకి వచ్చిన మరో అద్భుత కిరణం ముకుల్ చౌదరి. కోల్‌కతా నైట్ రైడర్స్ చేతుల్లోకి వెళ్లిపోయింది అనుకున్న మ్యాచ్‌ను తన సిక్సర్ల సునామీతో లక్నో సూపర్ జెయింట్స్ వైపు తిప్పేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు ఈ 21 ఏళ్ల కుర్రాడు.*

(వార్త క్రీడా విభాగం)

ఏప్రిల్ 9 రాత్రి ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో ముకుల్ చౌదరి సరికొత్త చరిత్ర సృష్టించాడు. లక్నో గెలుపుపై ఆశలు వదులుకున్న దశలో ఏడో నంబర్ బ్యాటర్‌గా వచ్చిన ముకుల్ కేవలం 27 బంతుల్లోనే 54 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఆఖరి 4 ఓవర్లలో లక్నోకు 54 పరుగులు కావాల్సి ఉండగా,అందులో 52 పరుగులు కేవలం ముకుల్ బ్యాట్ నుంచే వచ్చాయి. ఈ అద్భుత ఇన్నింగ్స్ లక్నోకు విజయాన్ని అందించింది. ధోనీ స్టైల్‌లో మ్యాచ్‌ను ఫినిష్ చేసి, జట్టుకు అసాధారణ విజయాన్ని అందించిన ఈ యువ ఆటగాడిపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

ముకుల్ చౌదరి సామర్థ్యాన్ని గుర్తించిన లక్నోయాజమాన్యం వేలంలో అతని కోసం ఏకంగా 2.60 కోట్లు ఖర్చు చేసింది. ఒక అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు ఇంత భారీ ధర ఎందుకని అప్పట్లో విమర్శలు వచ్చినా, గురువారం ఇన్నింగ్స్‌తో ముకుల్ వాటన్నింటికీ సమాధానం చెప్పాడు. ముకుల్ కేవలం హిట్టరే కాదు, వికెట్ కీపర్ కూడా కావడం జట్టుకు అదనపు బలం.

లక్నో టీమ్ కోసం ఒక మ్యాచ్ విన్నర్ దొరికాడని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముకుల్ చౌదరి ఆడిన కొన్ని షాట్లు, ముఖ్యంగా కవర్స్ మీదుగా కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ ఐపీఎల్ 2026లో అత్యంత ప్రభావం చూపగల ఆటగాళ్ల జాబితాలో చేరిపోయాడు.

### ముందే హెచ్చరించిన అర్జున్ టెండూల్కర్

ముకుల్ టాలెంట్ గురించి అర్జున్ టెండూల్కర్ ముందే హెచ్చరించాడు. ముకుల్ చౌదరి చాలా బాగా సిక్సర్లు కొడతాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో అతని హిట్టింగ్ చూసి నేను షాక్ అయ్యాను. మైదానం నలుమూలలా, ముఖ్యంగా స్క్వేర్ లెగ్, పాయింట్ మీదుగా అతను కొట్టే షాట్లు అద్భుతం. అతని బ్యాటింగ్ నన్ను బాగా ఆకట్టుకుందని తెలిపాడు. కోల్‌కతా మ్యాచ్‌లో ముకుల్ సరిగ్గా అర్జున్ చెప్పినట్లే షాట్లు ఆడటం విశేషం.

రాజస్థాన్‌కు చెందిన ముకుల్ చౌదరి... వికెట్ కీపర్ కమ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. ఇటీవల అండర్-23 లెవెల్‌లో సత్తాచాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఐదు ఇన్నింగ్స్‌లలో 200 స్ట్రైక్ రేటుతో 173 రన్స్ స్కోరు చేశాడు. జనవరి 2023లో రంజీ ట్రోఫీ ద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు.డెత్ ఓవర్లలో వేగంగా పరుగులు చేస్తాడని ముకుల్‌కు పేరుంది. 160కి పైగా స్ట్రైక్ రేటుతో అతడు రన్స్ రాబడుతున్నాడు.

**ఏప్రిల్ 8: ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్; లక్ష్యం: 211 పరుగులు**

క్రీజ్‌లో స్పెషలిస్ట్ బాట్స్‌మెన్ డేవిడ్ మిల్లర్. అప్పటికే వేలిగాయంతో రిటైర్డ్‌హర్ట్ అయ్యాడు. తప్పని పరిస్థితుల్లో క్రీజ్‌లోకి వచ్చాడు. చివరి 2 ఓవర్లలో చేయాల్సిన రన్స్ 36. 19వ ఓవర్లో సిక్స్, ఫోర్, సిక్స్‌తో ఏకంగా 23 రన్స్ సాధించాడు. 20వ ఓవర్లో విజయానికి 13 రన్స్. మొదటి మూడు బంతులు మిగతా వాళ్లు ఆడేశారు. నాలుగో బంతికి మిల్లర్ సిక్స్. గెలుపుకు 2 బంతుల్లో 2 రన్స్. అయిదో బంతికి సింగిల్ తీసుకోలేదు. చివరి బంతికి నాన్ స్రయికింగ్ ఎండ్‌లో ఉన్న కుల్దీప్ వేగంగా స్పందించకపోవడంతో రనౌట్. గుజరాత్ టైటాన్స్ ఖాతాలో విజయం.

**ఏప్రిల్ 9: కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్; లక్ష్యం: 182 పరుగులు**

128 పరుగులకే ఏడు వికెట్లు, 16 ఓవర్లు పూర్తి.. విజయానికి 4 ఓవర్లలో54 రన్స్ చేయాల్సిన పరిస్థితి. గత మ్యాచ్‌లో మిల్లర్ బ్యాటింగ్ స్టైంత్ అందరికీ తెలుసు. కానీ ఇక్కడ మాత్రం అలాంటి పేరున్న బ్యాట్స్‌మెన్ లేదు.క్రీజ్‌లో ముకుల్ చౌదరి అంతకుముందు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో చేసింది 2, 14 రన్స్. కోల్‌కతా తొలి విక్టరీ ఖాయమని అంతా డిసైడ్ అయ్యారు. కానీ ముకుల్ తుఫాన్‌లా చెలరేగి సిక్సర్లమోతతో 54 పరుగుల్లో ఒక్కడే 52 రన్స్ చేశాడు. చివరి ఓవర్లో రెండు సిక్స్‌లు బాది విజయానికి చేరువచేశాడు. చివరి బంతికి సింగిల్ తీస్తే గెలుపు. బంతి వికెట్ల వెనక్కి వెళ్లింది. నాన్ స్ట్రయికర్‌లో ఉన్న అవేష్ వేగంగా పరుగు పూర్తి చేయడంతో లక్నోకు అద్భుత విజయం లభించింది.

## ఐపీఎల్‌లో నేటి మ్యాచ్‌లు

| | | | |
|---|---|---|---|
| సన్‌రైజర్స్ హైదరాబాద్ V/S పంజాబ్ కింగ్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు | చెన్నై సూపర్ కింగ్స్ V/S ఢిల్లీ క్యాపిటల్స్ | రాత్రి 7.30 గం.లకు |

ఐపీఎల్‌లో ఈ రోజు రెండు మ్యాచ్‌లు అలరించనున్నాయి. న్యూచండీఘర్ వేదికగా మధ్యాహ్నం 3.30 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తలపడతాయి. పంజాబ్ అజేయ జైత్ర యాత్రకు సన్‌రైజర్స్ బ్రేక్ వేస్తుందా అన్న ఉత్కంఠ నెలకొంది.బ్యాటింగ్‌లో వైఫల్యాన్ని అధిగమిస్తే భారీ స్కోరుకు ఢోకా ఉండదు. అభిషేక్, ఇషాన్ కిషన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలోనే ఉంది. మరోమ్యాచ్‌లో రాత్రి 7.30 గంటలకు సొంతగడ్డపై ఢిల్లీ క్యాపిటల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన సీఎస్‌కే పరాజయాల బాటకు ఫుల్‌స్టాప్ పెట్టాలని చూస్తోంది. ధనాధన్ ధోనీ అందుబాటులోకి రావడం జట్టుకు కలిసొచ్చే అంశం. మరోవైపు గత మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ రెండు విజయాలు, ఓ పరాజయంతో ఉంది.



## నైషిక్‌కు గోండ్వానా కప్

**హైదరాబాద్:** ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన ఆలిండియా టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన నైషిక్ రెడ్డి విజేతగా నిలిచి గోండ్వానా కప్‌తో పాటు లక్ష రూపాయల నప్రైజ్ మనీ అందుకున్నాడు.పురుషులసింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ ప్రసాద్ ఇంగలే(మహారాష్ట్ర)ను 7-6, 6-4తో ఓడించాడు.సెమీస్‌లో 3వ సీడ్ అనూప్ మహాదేవ్(మహారాష్ట్ర)పై, క్వార్టర్స్ ఫైనల్లో ప్రబీర్ ముఖేష్ (గుజరాత్)పై గెలుపొందాడు. టోర్నీ మొత్తంలో నైషిక్ ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి అరుణ్ సావ్, ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ అనిల్ ధూపర్... నైషిక్‌కు ట్రోఫీ అందజేశారు. సురేష్ కృష్ణ టెన్నిస్ అకాడమీలో నైషిక్ శిక్షణ పొందుతున్నాడు.మాజీ ఒలింపియన్ విష్ణు వర్ధన్ మార్గదర్శకత్వం వహిస్తున్నారు.

# భారత్ పసిడి పంచ్

## మీనాక్షి, ప్రీతి, అరుంధతి, ప్రియ స్వర్ణాల పంట



**ఉలాన్‌బాటర్ (మంగోలియా):** ఆసియా సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్ల పంచ్ అదిరింది. పతకాల పంట పండించింది. మీనాక్షి హుడా (48 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), అరుంధతి చౌధరీ (70 కేజీలు), ప్రియ ఘన్‌ఘస్ (60 కేజీలు) పసిడి పతకాలతో మెరిశారు. ప్రపంచ చాంపియన్ జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), అల్ఫియా పఠాన్ (80(ప్లస్ కేజీలు) రజత పతకాలతో సరిపెట్టారు. ఫైనల్స్‌లో మీనాక్షి 5-0తో నొముందరి (మంగోలియా)పై, ప్రీతి 5-0తో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత హువాంగ్ సియావో వెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గారు. అరుంధతి 4-1తో బకిత్ సెడిష్ (కజకిస్తాన్)పై, ప్రియ 3-0తో వన్ ఉన్ గ్యోంగ్ (ఉత్తర కొరియా)పై గెలుపొందారు. జైస్మీన్ 0-5తో పున్రావి ర్యునర్స్ (థాయ్‌లాండ్) చేతిలో, అల్ఫియా 0-5తో దినా ఇస్లామ్‌బెకోవా (కజకిస్తాన్) చేతిలో పరాజయం పొందారు. తెలంగాణ స్టార్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ (51 కేజీలు)సెమీస్‌లో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టింది. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన 10 వెయిట్ కేటగిరీల్లోనూ భారత బాక్సర్లు పతకాలు గెలుపొందారు.



# ఆయుష్ పతకం గ్యారంటీ

## ప్రపంచ నెం.4పై సంచలన విజయం

## సెమీస్‌లోకి ఎంట్రీ

**నింగ్‌బో(చైనా):** భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి.. చైనాలోని నింగ్‌బోలో జరుగుతున్న ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పతకాన్ని ఖాయంచేసుకున్నాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నెంబర్4 జోనాటన్ క్రిస్టీ(ఇండోనేషియా)ను వరుస సెట్లలో కంగుతినిపించాడు. కేవలం 50 నిమిషాల్లోనే 23-21, 21-17తో సంచలనం విజయం అందుకున్నాడు. తొలి సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. టై బ్రేకర్ వరకు సాగిన ఈ సెట్‌ను గెలిచి శుభారంభం చేసిన ఆయుష్... రెండో సెట్‌లో మరింతగా విజృంభించాడు. సెట్‌ను, మ్యాచ్‌ను ముగించి ముందంజవేశాడు. ఈ ఖండాంతర టోర్నమెంట్‌లో 2018లో హెచ్.ఎస్. ప్రణయ్ తర్వాత పురుషుల సింగిల్స్‌లో పతకం సాధించనున్న తొలి భారత షట్లర్‌గా నిలవనున్నాడు. 2023లో చిరాగ్ శెట్టి, సాయిరాజ్ రంకిరెడ్డి జోడీ పురుషుల డబుల్స్ స్వర్ణం సాధించిన తర్వాత బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం కానుంది. సెమీఫైనల్స్‌లో ఆయుష్... పారిస్ 2024 రజత పతక విజేత కున్లావుట్ విటిడ్సార్న్(థాయిలాండ్)తో తలపడతాడు. ఈ టోర్నమెంట్‌లో అంతకుముందు, ఆయుష్ తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్ 7, ప్రస్తుత ఆసియా గేమ్స్ ఛాంపియన్ లీ షీ ఫెంగ్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌ను ఓడించి క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. భారత సవాల్‌గా ఒకే ఒక్కడుగా ఉన్నాడు. కాగా రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు రెండో రౌండ్‌లో, లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.



## డాలర్ వర్సెస్ రూపాయి

# 92.57

**ముంబయి, ఏప్రిల్ 10:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బలపడింది. వారాంతంలో రూపాయి దాదాపు 10 పైసలు లాభపడి 92.57 వద్ద ట్రేడ్ జరిగింది. ముందు రోజు ముగింపు ధర 92.66గా ఉంది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్‌లో భారత్ కరెన్సీ బలపడుతుండటం కనిపించింది. బ్యాంకులు తమ ఆర్బిట్రేజ్ పొజిషన్లను రద్దు చేసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన గడువు నేటితో ముగియనుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఆఫ్‌షోర్ నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్‌డీఎఫ్)మార్కెట్‌లో బ్యాంకుల మితిమీరిన లావాదేవీలను నియంత్రించేందుకు ఆర్బీఐ గత నెలలో కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పనిదినం ముగిసేసరికి బ్యాంకు నికర ఓపెన్ పొజిషన్ 100 మిలియన్ డాలర్లకు మించరాదని స్పష్టం చేసింది. ఈ గడువును పొడిగించాలని పలు బ్యాంకులు కోరినప్పటికీ, ఆర్బీఐ అందుకు అంగీకరించలేదు. దీంతో బ్యాంకులు తమ పొజిషన్లను సరిచేసుకుంటున్నాయి. ఆర్బీఐ తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మార్కెట్ వేచి చూసే ధోరణిలో ఉండవచ్చని విశ్లే షకులు భావిస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ లో ముడిచమురు ధరలు పెరుగుతుండటం ట్రేడర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 1.13 శాతం పెరిగి 97 డాలర్ల వద్ద ఉండగా, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ 1శాతానికి పైగా పెరిగి 99.24 డాలర్లకు చేరింది. ఈ పరిణామాలపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో అస్థిరతను అరికట్టేందుకే బ్యాంకులపై ఈ ఆంక్షలు విధించామని, ఇవి తాత్కాలిక చర్యలు మాత్రమేనని స్పష్టం చేశారు. బ్యాంకులు చేస్తున్న ఆర్బిట్రేజ్ ట్రేడ్‌ల వల్లే ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఒడిదొడుకులు పెరిగాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, ఏప్రిల్ 10:** గ్లోబల్ మార్కెట్లలో ర్యాలీ, కాల్పుల విరమణపై సందిగ్ధత తొలగడం, చమురు ధరలు దిగిరావడం వంటి పరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో లాభాలబాట పట్టాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 918.80పాయింట్లు పెరిగి 77,550. 25 పాయింట్ల వద్దకు చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 275.50 పాయింట్లుపెరిగి 24,050.60 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేసింది.ఐసిఐసిఐబ్యాంకు 3.22,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.65శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.56శాతం చొప్పున పెరిగి ఈక్విటీలకు మద్దతిచ్చాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ కూడా 1.71శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.60శాం చొప్పున పెరిగాయి.బిఎస్ఇలో 3360 షేర్లు పెరిగితే 945 షేర్లుతిరోగమించాయి. 151 షేర్లు మాత్రం నిలకడగానే కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 92.69వద్ద కొనసాగింది. ముందు రోజు 92.51తో పోలిస్తే కొంతమేర దిగజారింది. ఎంసి ఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ సెటిల్‌మెంట్ నాటివి రూ.1,52,420గా ఉన్నాయి. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు 0.05శాతంపెరిగి 4.291శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్లు 61సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 96.53 డాలర్లుగా కొనసాగాయి. షేర్‌బైబాక్ ఉంటుందన్న అంచనాలతో విప్రో 0.96శాతం పెరిగింది. బిఇయన్‌బ్రెయిన్స్ గ్యారేజి వెంచర్స్ గ్రో మాతృకంపెనీ 3.72 శాతం పెరిగింది.పవర్‌మెక్‌ప్రాజెక్టులు 8.49శాతం, ఐషర్‌మోటార్స్ 3.87శాతం, గోద్రెజ్‌ప్రాపర్టీస్ 1.37శాతం, ప్రెస్టిజ్ ప్రాజెక్ట్స్ 0.25 శాతం ఐఆర్‌బి ఇన్‌ఫ్రా డెవలపర్స్ 3.69శాతం, పార్క్ మెడివరల్డ్ 4.48శాతం చొప్పునపెరిగాయి.దేవ్ ఐటి 7.03శాతంపైపైకి ర్యాలీ తీసింది. విఎటెక్ వాబాగ్ కూడా 2.11అదే తీరులో ఉంది. కంట్రై నర్ కార్పొరేషన్ 0.41శాతం పెరిగింది. రైల్‌టెల్ కమ్యూనికేషన్ ఇండియా 1.22శాతం పెరిగింది. ఇక ఐపిఒల పరంగా ఓంపవర్ ట్రాన్స్‌మిషన్ 41,46,300 షేర్లకుగాను బిడ్లు రాబట్టింది. బిడ్లు 0.69రెట్లు కొనుగోల్లుజరిగాయి. 13వ తేదీతో బిడ్లు పూర్తివుతాయి. ఐపిఒ ధరలు రూ.166నుంచి 175గా నిర్ణయించింది. గ్లోబల్‌మారెనకట్లుకూడాయుద్ధవాతావరణం సద్దుమణుగుతున్నదన్న ధోరణు లతో ర్యాలీ తీసాయి. యూరోప్; ఆసియా మార్కెట్లు వారాంతంలో గణనీయంగాపెరిగాయి. ఇజ్రాయెల్‌కూడా చర్చలకు సుముఖంగా ఉండటంతో ఆసియా షేర్లుమరింతపెరిగాయి. వాల్‌స్ట్రీట్‌లో కూడా షేర్లు ర్యాలీ తీసాయి. ఎస్అండ్‌పి 500 0.62శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.83శాతం, డోజౌన్స్ ఇండస్ట్రియల్ సగటు 275.88 పాయింట్లు చొప్పున పెరిగింది. అమెరికా వాణిజ్యశాఖ ద్రవ్యోల్బణం 2.8శాతంగా ఉందని చెప్పడంతో స్టాక్స్ సానుకూలంగా కదిలాయి.

## ఒక్కనెలలో రూ.32,087 కోట్లు రాక

# ఫండ్స్ పెట్టుబడుల్లో 'సిప్'లే ఎక్కువ




**ముంబయి, ఏప్రిల్ 10:** ఈ ఏడాది భారతదేశ మ్యూచువల్ ఫండ్ రంగం కొత్త రికార్డులు నమోదుచేసింది. సామాన్యులు నెలల వారీగా పెట్టుబడి పెట్టే సిప్ ఇన్ ఫ్లో మొదటిసారిగా మార్చి నెలలో రూ. 32,087 కోట్లకు చేరింది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సిప్ పెట్టుబడులు ఏకంగా 24 శాతం పెరగడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో దాదాపు 9.72 కోట్ల సిప్ ఖాతాలు ఉన్నాయి.

ప్రజలు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారని ఈధోరణి స్పష్టం చేస్తోంది. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోని మొత్తం నిర్వహణ ఆస్తులు రూ. 73.73 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో కేవలం సిప్ ద్వారా వచ్చిన ఆస్తులే రూ. 15.10 లక్షల కోట్లు (సుమారు 20.5 శాతం) ఉండటం విశేషం. మ్యూచువల్ ఫండ్ ఖాతాల సంఖ్య మార్చి నాటికి 27.39 కోట్లకు చేరింది. కేవలం ఒక్క నెలలోనే 33.63 లక్షల కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు వరుసగా 61 నెలలో కూడా పెరిగాయనేచెప్పాలి.దీర్ఘకాలికంగా సంపదను సృష్టించుకోవడానికి భారతీయులు మ్యూచువల్ ఫండ్లను విశ్వసిస్తున్నారనడానికి ఈ పెట్టుబడులే ఉదాహరణ.సిప్ పెట్టుబడులు బలంగా ఉన్నప్పటికీ ఫిబ్రవరితో పోలిస్తే ఆస్తుల విలువ కొంత తగ్గింది. రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ప్రజలు తమ ఆర్థిక లక్ష్యాల కోసం మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం వల్ల ఈ వృద్ధి సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.




## అనుమానాస్పద లావాదేవీలకు చెక్

# గంట దాటాకే క్లియరింగ్ : ఆర్బీఐ

**ముంబయి, ఏప్రిల్ 10:** డిజిటల్ చెల్లింపులపరంగా పదివేలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం ఉన్న అకౌంట్ టు అకౌంట్ ట్రాన్స్‌ఫర్లకు ఒక గంట ఆలస్యం విధించాలని సూచించింది. ఈ వ్యవధిలో, బ్యాంకులు చెల్లింపుదారులతో అనుమానాస్పద చెల్లింపులను ధృవీకరించుకోవచ్చు,చెల్లింపుదారులు వాటిని రద్దు కూడా చేయవచ్చు. డిజిటల్ మోసాలు అంటే ప్రభుత్వ పరిగణనలోనికి వచ్చిన సైబర్‌మోసాలే గత సంవత్సరం రూ.22,930 కోట్లకు చేరాయి. రూ.10,000 పైగా లావాదేవీలు మోసాల సంఖ్యలో 45 శాతం ఉన్నప్పటికీ, విలువల మొత్తంలో 98.5శాతం వరకు ఉన్నాయి. మోసకారులు విక్టిమ్‌లను త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి చేస్తారు. గంట కూలింగ్ ఆఫ్ పీరియడ్ ఇచ్చి, వినియోగదారులు లావాదేవీని రద్దు చేసుకోవడానికి లేదా బ్యాంక్ సందేహాస్పదమైతే తనిఖీ చేయడానికి అవకాశం ఇస్తుంది. ఈ ఆలస్యం సమయంలో మొత్తం ప్రొవిజనల్ డెబిట్ అవుతుంది. వినియోగదారుడు రద్దు చేస్తే డబ్బు తిరిగి వస్తుంది.

వ్యక్తులు, సోల్ ప్రొప్రైటర్లు, పార్టనర్‌షిప్ ఫర్మ్‌లు చేసే అకౌంట్‌టుఅకౌంట్ ట్రాన్స్‌ఫర్‌లు మెర్చంట్ పేమెంట్లు షాపింగ్, బిల్లులు వంటివి. ఇవి ఇప్పటికే డిస్ప్యూట్ రిజల్యూషన్ ఉన్నాయి, రికరింగ్ పేమెంట్లు, చెక్కులు. తక్కువ మొత్తం లావాదేవీలు ఇప్పటిలాగే తక్షణం పూర్తవుతాయి. సీనియర్ సిటిజన్లు, డిసేబుల్డ్ వ్యక్తులు వంటి సమూహాలకు రూ.50,000 పైగా లావాదేవీలకు ట్రస్టెడ్ పర్సన్ అదనపు ఆథెంటికేషన్. సందేహాస్పద అకౌంట్లకు క్రెడిట్ లిమిట్లు. వినియోగదారులు ఒక్క క్లిక్‌తో కిల్ స్విచ్ అన్ని డిజిటల్ పేమెంట్లను ఆపేసే సదుపాయం. వినియోగదారులు కొన్ని ముఖ్యమైన లావాదేవీలు లేదా పేయీలను వైట్‌లిస్ట్ చేసుకుని ఆలస్యాన్ని దాటవేయవచ్చు. ఇది చర్చా పత్రం మాత్రమే.అన్ని వర్గాలు తమ అభిప్రాయాలు వారంరోజుల్లోపు పంపించాలని ఆర్బీఐ సూచించింది.

# తులం బంగారం 1.55 లక్షలు



**ముంబయి, ఏప్రిల్10:** బులియన్ మార్కెట్‌లో ధరలుమళ్లీ ఒక్కసారిగా పెరిగాయి వెండిధరలు కిలో ఒక్కంటికి రూ.3800 పెరిగి కిలో వెండి రూ.2.47 లక్షలుగా దేశ రాజధాని మార్కెట్లలో కొనసాగింది. అలాగే బంగారంధరలు కూడా పది గ్రాములు రూ.1.55 లక్షలకు చేరింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ వివరాలప్రకారం వెండిదరలు రూ.2.47 లక్షలుగాఉంది. ముందు రోజు రూ..2.43 లక్షలతో పోలిస్తే కొంతమేర పెరిగింద.ఇ ఇక 99.9 కేరట్ల స్వచ్ఛత కలిగిన బంగారం రూ.400 పెరిగి తులం ఒక్కంటికి రూ.1,55,300గాకొనసాగింది.అంతకు ముందు రోజు 1.55 లక్షలవరకూ వెళ్లిన సంగతి తెలిసిందే.వారంలోనే వెండిధరలు 4.2శాతం, బంగారం ధరలు 2.51శాతం చొప్పునపెరిగాయి.

ఇరాన్ వివాదంలో దౌత్యపరమైన చర్చలు సానుకూలంగా ఉంటాయన్న ధోరణులతోనే ఈ ధరల ప్రభావం ఎక్కువ ఉంది. గ్లోబల్ స్థాయిలో కూడా బంగారం ధరలు స్పాట్ మార్కెట్‌లో 11.52 డాలర్లపెరిగి ఔన్స్ ఒక్కంటికి 4777.17 డాలర్లుగా ఉంది. వెండిధరలు కూడా ఒకటిశాతం పెరిగి ఔన్స్ ఒక్కంటికి 75.91 డాలర్లుగా ఉంది. ఒకదశలో బంగారం ఔన్స్ ఒక్కంటికి 4700గా నమోదయి క్రమేపీ పెరిగింది. శాంతిడీల్ కుదిరితే ఔన్స్ ఒక్కంటికి ఐదువేల డాలర్లవరకూ పెరగవచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. చెన్నై, హైదరాబాద్‌ల్లో వెండిధరలు 2,65,500గా కొనసాగుటుంటే ఇతరత్రా ఢిల్లీ, ముంబై,కోల్‌కత్తా, బెంగళూరుల్లో 2.60 లక్షలుగా కొనసాగింది.

## 12వేల రెట్లు పెరిగిన డిజిటల్ పేమెంట్స్



**ముంబయి, ఏప్రిల్ 10:** భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఈనెల 11వ తేదీతో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ దశాబ్ద కాలంలో లావాదేవీల పరిమాణంలో 12వేల రెట్లు, విలువల పరంగా నాలుగువేల రెట్లకు పైగా అసాధారణ వృద్ధిని నమోదు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.78 కోట్ల లావాదేవీలు, విలువ రూ. 6,952 కోట్లు మొదలైన యూపీఐ ప్రస్థానం2025-26 నాటికి 21,898 కోట్ల లావాదేవీలతో దాదాపు రూ. 285 లక్షల కోట్ల విలువలకు చేరింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత డిజిటల్ చెల్లింపుల వినియోగం విపరీతంగా పెరగడంతో యూపీఐ వృద్ధి అమాంతం పెరిగింది. మర్చంట్ క్యూఆర్ కోడ్‌లు, పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్ సంఖ్య కూడా భారీగా పెరిగింది.ఈఏడాది మార్చిలో యూపీఐ తన ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. ఆ నెలలో ఏకంగా 22.64 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. యూపీఐ ప్రారంభమైనప్పటి నుంచి ఒకే నెలలో ఇన్ని లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి. గతేడాది మార్చితో పోలిస్తే ఇది 24 శాతం అధికం. ప్రస్తుతం ఒక నెలలో జరుగుతున్న యూపీఐ లావాదేవీల విలువ సుమారు రూ. 28 లక్షల కోట్లుగా ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.